లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

ప్రజలే ప్రభువులు

# జనబలం

అక్టోబర్ 2020 రూ.10/-



## 150 గాంధీని చర్చించని భారతం




## ఎల్లలు లేని తెలుగు - ఎప్పటికీ వెలుగు



## ఈ చట్టాలను వ్యతిరేకించేవారు రైతు బాంధవులెట్లవుతారు?

## ఉచిత విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు సరైన నిర్ణయమే

## టైటిల్ గ్యారంటీ, ఐదారేళ్లకోసారి భూసర్వే కూడా ఉండాలి



# గాంధీ గెటప్‌కి మనం ప్రాధాన్యతనిస్తుంటే.. ప్రపంచ దేశాలు గాంధీ ఆలోచనల్ని అందిపుచ్చుకుంటున్నాయి

"స్వతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా గాంధీ మహాత్ముని అర్థం చేసుకుని, ఆయన మార్గాన్ని అనుసరించటంలో మన దేశం నేటికీ తడబాటుకు గురవుతూనే ఉంది. గాంధీ అంటే నేటి తరానికి చరఖా, ఖద్దరు, కళ్లజోడు మాత్రమే గుర్తుకువచ్చే విధంగా ఆహార్యానికి భారతీయులు ప్రాధాన్యత ఇస్తే.. ప్రపంచ దేశాలు గాంధీ ఆలోచనల్లోని లోతును అర్థం చేసుకుని అనుసరించటానికి ప్రాధాన్యతనిస్తున్నాయి. దేశంలో నేడు గాంధీజీ ఆలోచనలకు విరుద్ధంగా అధికారం ఒకేచోట కేంద్రీకృతమైంది, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. రాజకీయాలు ఎల్లప్పుడు ప్రజల బాగు, సమాజ ప్రగతి కోసం ఉపయోగపడే పవిత్ర వ్యాసంగమని గాంధీజీ భావించేవారు. ఇందుకోసం తన వ్యక్తిగత అవసరాలను పక్కనపెట్టి దేశం కోసం సర్వసంగ పరిత్యాగిలా పాటుపడ్డారు. నేడు రాజకీయాలకు వ్యక్తిగత నిర్వచనం ఇచ్చుకుని స్వప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. సమాజాన్ని, వ్యక్తులను ఏకతాటిపై నిలిపేందుకు గాంధీ ప్రయత్నించారు. అయితే ప్రస్తుతం సమాజంతో సంబంధం లేకుండా వ్యక్తులు ఎదగాలని చూస్తున్నారు. దాని పర్యవసానం తీవ్రంగా ఉంటుంది. ప్రపంచంలో ఎక్కడా లేనంతగా మన వద్ద రాజకీయ పార్టీలు ఎన్నికలలో గెలవటానికి డబ్బు ఖర్చు చేస్తున్నాయి. దానికి ప్రతిఫలం ఆశించే క్రమంలో అవినీతికి పాల్పడుతున్నాయి. ప్రజాప్రతినిధుల్లో పలువురు పదుల రెట్లు సంపాదిస్తున్నారు. ప్రజల చేతికి అధికారం రానంత వరకు దేశంలో సమస్యలు తప్పవు. ఓటుహక్కును విజ్ఞతతో ఉపయోగించుకోవటంలో.. చదువులేనివారికి, చదువుకున్న వారికి మధ్య ప్రస్తుతం పెద్ద తేడా లేదు. ఓటు విలువను తెలుసుకోనంత కాలం దాని వల్ల కలిగే నష్టాలను ప్రజలు భరించవలసిందే. దేశంలో ప్రజలకు కొంతవరకు రాయితీలు అవసరమే. ప్రభుత్వాలు ప్రణాళికతో వ్యవహరించుకుండా పందేరాల్ని కొనసాగిస్తే మాత్రం ఆర్థిక సంక్షోభం తప్పదు"

- మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని ఓ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 23 సంచిక 10

అక్టోబర్ 2020



సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

## చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

## లోపలి పేజీల్లో...


06 గాంధీని చర్చించని భారతం..

14 ఎల్లలు లేని తెలుగు - ఎప్పటికీ వెలుగు

25 బాపూని సరిగ్గా అర్థం చేసుకుంటే, సంఘటితంగా పోరాడితే.. మన జాతికి పట్టిన పీడని తొలగించటం చిటికెలో పని



కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,
సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

## కార్టూన్ కార్నర్




## జనబలంలో ప్రకటన రేట్లు

| | |
|---|---|
| **కలర్‌పేజీ:** | **10,000** |
| **ఇన్‌సైడ్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **5,000** |
| **ఫుల్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **2,000** |
| **సగం పేజీ బ్లాక్ అండ్ వైట్:** | **1,000** |

ప్రకటన రుసుము, ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ప్రతినెలా 20వ తేదీ లోపుగా మాకు అందేలా పంపించగలరు. చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను

**చిరునామా: సంపాదకుడు, జనబలం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక,**
*తులిప్స్ అపార్ట్‌మెంట్స్, 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,*
*సోమాజిగూడ, హైదరాబాద్-500 082*

సంపాదకీయం

# అత్యాచార భారతంలో హథ్రాస్ పర్వం

ఆడకూతుళ్ళపై అత్యాచారాలకు అంతులేకుండా పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అత్యాచారాలపై పాలకుల స్పందన మరింత ఆందోళనకరంగా తయారయ్యింది. రాజకీయనేతల్లో, వ్యవస్థలలో, సమాజంలో పితృస్వామ్య, అగ్రవర్ణ ఆధిపత్య భావజాలం నిస్సిగ్గుగా వ్యక్తమవుతున్న తీరు కలవరపరుస్తోంది. ఒక మహోన్నత సంస్కృతికి వారసులమని గొప్పలు చెప్పుకుంటున్న పాలకపక్షనేతల సాంస్కృతిక ధోరణులు అంతర్జాతీయ సమాజంలో మన పరువుప్రతిష్టలను దిగజార్చుతున్నాయి.

మనదేశంలో మహిళలపై నేరాలు ప్రతి ఏటా పెరుగుతున్నాయని నేర గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2019లో దేశంలో మహిళలపై జరిగిన నేరాల సంఖ్య 4,05,861గా వుందని క్రైమ్ రికార్డ్స్ బ్యూరో విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. 2018తో పోలిస్తే నేరాలు 7 శాతం పెరుగుదల నమోదయ్యాయి. ఈ జాబితాలో 59,853 నేరాలతో ఉత్తరప్రదేశ్, 41,550 నేరాలతో రాజస్థాన్, 37,144 నేరాలతో మహారాష్ట్ర తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ సంఖ్యలు కేవలం నమోదైన కేసులు మాత్రమే! అత్యాచారాలు, దౌర్జన్యాలు, గృహ హింస వంటి ఉదంతాలన్నీ పోలీస్ స్టేషన్ వరకూ వెళ్లవన్న సంగతి తెలిసిందే! దేశ వాణిజ్య రాజధాని ముంబైలో మహిళలపై లైంగిక వేధింపుల కేసులు చాలా ఎక్కువ అవుతున్నాయి. మెట్రో నగరాల్లో జరుగుతున్న మానభంగ కేసుల్లో ముంబై అగ్రస్థానంలో ఉండగా దేశ రాజధాని ఢిల్లీ రెండో స్థానంలో ఉండటం అత్యంత విచారకరం. 2018-19 సంవత్సరంలో ప్రజా రవాణా సర్వీసుల్లో జరిగిన లైంగిక వేధింపు కేసులలో 6,519 కేసులతో ముంబై అగ్రస్థానంలో ఉండటం కూడా ఆర్థిక రాజధానిలో మహిళలకు లభిస్తున్న రక్షణకు అద్దం పడుతున్నది. యూపీ, బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో మహిళలకు ఇంటా బైటా రక్షణ లేని పరిస్థితి కొనసాగుతున్నది.

సెప్టెంబర్ 14న యూపీలోని హథ్రాస్‌లో మనీషా వాల్మీకి అనే దళిత యువతిపై జరిగిన మానభంగం, హత్యాకాండ మాటలలో వర్ణించలేని అమానుష ఘటన. తల్లితోపాటు పొలం వెళ్లి పశుగ్రాసం కోసుకుంటున్న మనీషా వాల్మీకిని అదే గ్రామానికి చెందిన నలుగురు అగ్రవర్ణ యువకులు దౌర్జన్యంగా ఈడ్చుకుపోయారు. ప్రతిఘటించిన దళిత యువతిపై వారు చేసిన హింసతో ఆమె వెన్నుముక దెబ్బతిన్నది. నాలుక తెగిపోయింది. ఆస్పత్రికి వెళ్ళకముందే మనీషా పాత్రికేయులకు చెప్పిన వివరాలుగానీ, సెప్టెంబర్ 22న మెజిస్ట్రేట్‌కు ఇచ్చిన వాంగ్మూలంలో గానీ, వైద్యుల ప్రాథమిక పరిశీలనా నివేదికలోగాని ఆమెపై గ్యాంగ్ రేప్ జరిగిందని స్పష్టంగా వెల్లడైంది. ఆ తర్వాత సెప్టెంబర్ 29న ఆమె ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో కన్నుమూసింది. పంతొమ్మిదేళ్ల దళిత యువతిపై అగ్రవర్ణానికి చెందిన నలుగురు యువకులు అత్యాచారం చేసి హత్య చేస్తే యూపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఘోరంగాఉంది. తల్లిదండ్రుల ప్రమేయం లేకుండా మనీషా భౌతిక కాయాన్ని పోలీసులు, అధికారులు దహనం చేసేశారు. తమ ఇంటికి తీసుకువెళ్లి హిందూ మత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు జరుపుకుంటామన్న తల్లిదండ్రుల అభ్యర్థనలను ప్రభుత్వం తోసిపుచ్చింది. హిందూమత సంరక్షకులమని చెప్పుకునే యూపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం మనీషా వాల్మీకి కుటుంబ సభ్యుల మనోభావాలను గాయపరిచింది. అవివాహిత యువతి శరీరాన్ని అర్ధరాత్రి దహనం చేసింది.

మానభంగం, హత్యకు గురైన వ్యక్తి దేహాన్ని పూడ్చి పెట్టాల్సి ఉండగా దహనం చేయడం సాక్ష్యాలను రూపుమాపడానికేనని తేటతెల్లం అవుతోంది. ఫోరెన్సిక్ నివేదికలో మానభంగం జరిగిన జాడలేదని వచ్చిన అంశాన్ని ఒక పోలీస్ ఉన్నతాధికారి మీడియాకు అత్యుత్సాహంతో వెల్లడించడం, బాధితుల కుటుంబాన్ని జిల్లా కలెక్టర్ బెదిరించడం, మీడియా ప్రతినిధుల్ని గ్రామాలలోకి రానీయకుండా నిరోధించడం, ప్రియాంక, రాహుల్‌గాంధీల పట్ల పోలీసుల దురుసుప్రవర్తన వంటివన్నీ ప్రభుత్వ ఉద్దేశాలను వెల్లడిస్తున్నాయి. అదే సమయంలో నిందితులకు బాసటగా పరిసరగ్రామాల అగ్రవర్ణాల నేతలు, కుల సంఘాలు, సేనలు భారీస్థాయిలో జన సమీకరణ చేసిన తీరు అక్కడి సామాజిక, సాంస్కృతిక ధోరణులను వెల్లడిస్తున్నాయి. యూపీ పాలక పక్ష నేతలు బాధితులపై నోరు పారేసుకుంటున్న తీరు వైషమ్యాలను రెచ్చగొట్టే విధంగాఉన్నాయి. ఠాకూర్లది ఉడుకు రక్తం అని ఒకరు, మానభంగం చేసినపుడు మహిళలు దాన్ని ఆనందంగా స్వీకరిస్తారని ఒకరు, బాధితకుటుంబాల ఆడవాళ్ళ ప్రవర్తన మంచిదికాదని మరొకరు, ఆడపిల్లలకు సంస్కారం నేర్పాలని మరొకరు చేసిన వ్యాఖ్యలు వారిలో కరడు కట్టిన పితృస్వామ్య, అగ్రవర్ణ దురహంకారం ఏ స్థాయిలో ఉన్నదీ తేటతెల్లం చేశాయి. దీనికి తోడు నిరుద్యోగం కారణంగా యువకులకు వివాహాలు కాకపోవడం వల్లనే వారు మానభంగాలు చేస్తున్నారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మార్కండేయ కట్జూ చేసిన వ్యాఖ్యసైతం మన మేధావులలో ఉన్న వక్ర ఆలోచనలకు అద్దం పట్టింది.

ఒక్క యూపీ అని కాదు, కథువా, నిర్భయ, దిశ వంటి అన్ని సందర్భాలలోనూ నేరాన్ని నేరంగా చూసే బదులు నేరస్తుల కుల, మతాలు, వారి రాజకీయ పలుకుబడి వంటి వాటిని చూసి వ్యవస్థలు స్పందించడం సిగ్గు పడాల్సిన అంశం. మనీషా వాల్మీకి ఆస్పత్రిలో చేరినపుడు జరిగిందేమిటో తెలుసుకునేందుకు వైద్యులు ప్రయత్నించలేదు. పోలీసులు కూడా అడగలేదు. కలెక్టరు, పోలీసులు, అధికారులు బాధితుల పక్షం వహించకుండా పరోక్షంగా నిందితుల్ని వెనకేసుకొస్తున్నట్లుగా ప్రవర్తించారు. యూపీ ప్రభుత్వం కేసును సీబీఐకి అప్పగించింది. నలుగురు నిందితుల్ని అరెస్టు చేసింది. కుటుంబాన్ని ఆదుకోవడానికి ఆర్థిక సహాయం, భూమి, ఉపాధి వంటి హామీలు ఇచ్చింది. మనీషా కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి నిందితులకు కఠిన శిక్షలు పడేట్లు చూస్తామని ఆదిత్యనాథ్ ప్రకటించారు.

అసలు సమస్య యూపీలో శాంతి- భద్రతలు క్షీణించడం, ఎన్‌కౌంటర్లతో అమాయకుల్ని చంపేయడం, తప్పుడు కేసులు బనాయించడం, రాజకీయ ప్రత్యర్థులను క్రూర చట్టాలతో అణచి వేయడం, మహిళలపై, దళితులపై, మైనారిటీలపై నిరంతరం జరుగుతున్న అత్యాచారాలు, హత్యాకాండలు పెరుగుతుండటం! వీటిని అరికట్టేది ఎవరు? ఎప్పుడు? యూపీలో యాంటీ రోమియో స్క్వాడ్‌లను యోగీ ఏర్పాటు చేశారు. వాటి సోదాలలో 83 లక్షల మంది పట్టుబడ్డారు. 35 లక్షల మందికి వార్నింగ్ ఇచ్చి వదిలారు. సుమారు 12 వేల మందిని అరెస్టు చేశారు. ఈ గణాంకాలు చూస్తే మొత్తం సామాజిక వాతావరణం ఉన్న తీరు అర్థంకావడం లేదా?

ఏదో ఒక అత్యాచారం జరిగినప్పుడు ప్రజాగ్రహానికి జంకి తాత్కాలిక ఉపశమన చర్యలు చేపట్టడం తప్ప మన సామాజిక, సాంస్కృతిక ఆవరణంలో కొనసాగుతున్న ఆధిపత్య భావనలను, దురహంకార ధోరణులను అరికట్టాలనే సంకల్పం పాలకులకు ఉండటం లేదు. చట్టబద్ధపాలనను పాలకులే పాతిపెడితే మన ప్రజాస్వామ్యానికి రక్షణ ఎక్కడ? హథ్రాస్ ఘటనపై పెల్లుబికిన నిరసన వెల్లువతో అయినా పాలకులు, వ్యవస్థలు కళ్ళు తెరుస్తాయని ఆశించవచ్చా?

డి. సోమ సుందర్

# గాంధీని చర్చించని భారతం..

## 'రాజకీయం'పై మహాత్ముడి నిర్వచనంలోనే ఉంది జాతికి పరిష్కారం

మహాత్మాగాంధీ 150వ జయంతి వేడుకలను మన దేశంలో 2018లో ప్రారంభించారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి సారథ్యం వహిస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వంతోపాటు, గాంధీ ఫ్యామిలీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ కూడా జాతీయస్థాయిలో ఈ కార్యక్రమాలను ప్రతిష్ఠాత్మకంగా జరుపుతామని జాతి నుద్దేశించి చెప్పాయి. గాంధీజీపై కార్యక్రమాలను సూచించేందుకు, రూపొందించేందుకు, అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రాష్ట్రపతి నేతృత్వంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పౌర సమాజ నేతలు తదితరులతో ఒక అత్యున్నతస్థాయి జాతీయ కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది కాకుండా ప్రధాని నేతృత్వంలో మరో ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటైంది. 'గాంధీ ఇన్ యాక్షన్'పై దేశమంతటా ప్రచారం జరగాలని, విదేశాల్లోనూ కార్యక్రమాలు జరగాలని ప్రధాని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రాలు కూడా తమ పరిధిలో కొన్ని ఏర్పాట్లు చేశాయి. మొత్తంగా 2020 గాంధీ జయంతి (అక్టోబర్ 2) వరకు జాతిపిత ఉత్సవాలను నిర్వహిస్తామని ఢిల్లీ నుంచి గల్లీ దాకా పాలకులు ఘనంగా ప్రకటించారు. దేశానికి స్వతంత్రం వచ్చిన సమయంలోనే హత్యకు గురైనా, గాంధీజీ 21వ శతాబ్దంలో నేటికీ పనికొచ్చే నాయకుడు. మన ఆధునిక యువ నాయకుల కంటే ఆధునిక యువభావాలున్న నేత గాంధీజీ. అందుకే కేంద్రంలో, రాష్ట్రాల్లో ప్రభుత్వాల, పార్టీల ప్రకటనలు, కార్యక్రమాల ప్రణాళికలు చూశాక యావత్ భారతం గాంధీజీని కొత్తగా చూస్తుందని, చర్చిస్తుందని, మథనంతో పునరావిష్కరించుకుని లబ్ధి పొందుతుందని ఆశ కలిగింది. కానీ వాస్తవంలో చాలా మొక్కుబడిగా గాంధీ స్మరణ జరిగింది. ప్రభుత్వాలపరంగా ప్రాయోజితంలాగా కొన్ని కార్యక్రమాలు, స్టాంపులు, నాణేల ఆవిష్కరణ, పార్టీల పరంగా అక్కడక్కడా పాదయాత్రలు, పాఠశాలలు, సంస్థల్లో యథావిధి కార్యక్రమాలు వంటివి జరిగాయంతే. నిన్న సరే.. నేటికి, రేపటికి గాంధీ అవసరం ఏమిటి?, అంబేద్కర్‌ను, గాంధీని కలపటం ఈవేళ్టి భారతానికి, ముఖ్యంగా యువతకు ఎందుకు అవసరం? అన్న చర్చ లోతుగా జరగలేదు. కొన్ని పత్రికలు, కొందరు రాజకీయ ఉద్యమ నేతలు, విద్యావేత్తలు, జర్నలిస్టులు, పరిశోధకులు, సామాజిక సంస్థలు, కార్యకర్తలు తప్ప గాంధీ అవసరాన్ని మిగతా దేశం లోతుగా పట్టించుకోలేదు. కొందరు ఆలోచనాపరులైతే గాంధీ పట్ల గుడ్డి వ్యతిరేకతతో మహాత్ముడి 150 ఏళ్ల సందర్భాన్నే దాటవేశారు. చిట్టచివరి పౌరునికి కూడా వివక్షలేకుండా తలెత్తుకుని బతికే వాతావరణం, భద్రత, సుఖసంతోషాలు, సామరస్య సమాజం, విలువలు, బిడ్డల భవిష్యత్తుకు భరోసా వంటి లక్ష్యాలు, లక్షణాలకు కొన్ని లోపాలతోనైనా ప్రతిరూపంగా ఒక నాయకుడు/నాయకురాలు నిలిచినప్పుడు విశ్వాసాల పేరుతో వ్యతిరేకించాల్సిన అవసరమేముంది? వారిని ఉపయోగించుకుని ప్రజలను చైతన్య పరచాలి గాని. 2020లో కొవిడ్-19 రావటంతో గాంధీ గొడవే మన దేశంలో మరుగున పడిపోయింది.



గాంధీజీ గురించి అనేక విశ్లేషణలు గతంలోనే ఉన్నాయి. గాంధీ కంటే మిన్నగా గాంధేయ విలువల్ని ఆచరిస్తున్నవాళ్లు ఇంకా ఉన్నారు. కానీ ఒక సమాజంగా, దేశంగా గాంధీ అవసరం మనకు ఇప్పుడెంత అనే స్పష్టత ఆయన 150వ జయంతి నిర్వహణ సందర్భంగా కావాల్సి ఉంది.

'రాజకీయానికి – జీవితానికి మధ్య ఉన్న సంబంధంపై గాంధీ నిర్వచనం, ఆచరణ'ను మనం ఈరోజు లోతుగా అర్థం చేసుకోవాల్సిన అంశంగా భావించవచ్చు.

మన దేశాన్ని బాగుచేయాలన్నా, చెడగొట్టాలన్నా రాజకీయానిదే ప్రధాన పాత్ర. ఇటీవలికాలంలో మన జీవితాల్ని అల్లకల్లోలం చేసిన కరోనా వెనక కూడా రాజకీయాల వైఫల్యమే ఉంది. రాజకీయాల ద్వారా మంచిని పెంచుతూ, చెడును నిరోధిస్తూ మనం లబ్ధి పొందాలంటే.. రాజకీయాలకు సంబంధించి గాంధీ మార్గాన్ని అర్థం చేసుకోవాలి. మన సామాజిక, ఆర్థిక పరిస్థితులు, ప్రపంచవ్యాప్త పరిణామాల దృష్ట్యా గతంలో ఎప్పటికన్నా కూడా ఇప్పుడు మనకు ఈ అవసరం పెరిగింది. భవిష్యత్తులో 90 శాతానికి పైగా కాలాన్ని సొంతం చేసుకునే భారతీయ యువతకు ఈ అవగాహన మరీ అవసరం.

ఫిజిక్స్ కంటే పాలిటిక్స్ కష్టం అన్నారు ఐన్‌స్టీన్.
అలాగే కాస్త ఎక్కువ సత్యం కోసం ప్రయత్నించటమే విజయవంతమైన రాజకీయ నేత లక్షణం అన్నారు జర్మనీ ఉక్కుమనిషి బిస్మార్క్.

కానీ వీరిద్దరికీ భిన్నమైన కోణంలో రాజకీయాన్ని దర్శించి ఆచరించారు గాంధీజీ.

రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉండటం ఎవరికీ సాధ్యం కాదు, మన జీవితంలోని ప్రతి అంశాన్ని, రంగాన్ని రాజకీయాలు పెనవేసుకుని ఉన్నాయి అని స్పష్టం చేసి.. రాజకీయానికి,

జీవితానికి మధ్య ఉన్న కృత్రిమ గోడల్ని కూల్చివేశారు గాంధీ. పాలిటిక్స్‌ను పట్టించుకోని జీవితంలోని సమస్యలతో పోలిస్తేనే ఫిజిక్స్ కష్టాలు తక్కువ అనే సంకేతాన్నిచ్చారు. ఐన్‌స్టీన్ పార్టీ రాజకీయాల దృష్టితో మాట్లాడి ఉండవచ్చు, కానీ గాంధీజీ పార్టీలు, ఎన్నికలు, ప్రత్యక్ష, పరోక్ష సహా ప్రతి పౌరుని జీవితాన్ని ఏదోకరూపంలో రాజకీయాలు నిర్దేశించటాన్ని గుర్తించారు.

అలాగే బిస్మార్క్ చెప్పినట్లు, కాస్త ఎక్కువ సత్యం రాజకీయ ఎజెండాగా ఉంటే చాలు అన్నట్లు కాకుండా.. రాజకీయాల్ని సంపూర్ణ స్థాయి సత్యాన్వేషణ ప్రయత్నంగా మార్చేశారు.

రాజకీయాలు జీవితంలో ఒక భాగమేనని, రాజకీయాల్ని ఇష్టపడటమంటే జీవితాన్ని ఇష్టపడటమేనని, రాజకీయంలో భాగంగా కష్టపడటం మరింత ఎక్కువ సుఖాన్ని పొందటం కోసమేనని గాంధీజీ స్పష్టం చేశారు. తాను ఎంత మత విశ్వాసి అయినప్పటికీ, మత విశ్వాసాన్ని వ్యక్తిగతానికి పరిమితం చేయటంతోపాటు.. అంతిమ లక్ష్యమైన మోక్షం కోసం ఓ ఆశ్రమంలో ముక్కు మూసుకుని తపస్సు చేయాలన్న సనాతన వాదాన్ని తిరస్కరించారు. తన వ్యక్తిగత సుఖం సమాజ హితంతో ముడిపడి ఉందని గ్రహించి సమాజాన్ని బాగు చేయటం, ఆ క్రమంలో తానూ మెరుగుపడుతుండటం, తిరిగి సమాజాన్ని ఇంకా బాగు చేయటం.. ఇలా తన సత్యాన్వేషణలో భాగంగానే రాజకీయాన్ని చూశారు, చేశారు. అందుకే తన ఆత్మకథను సత్యశోధన అని కూడా చెప్పుకున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో కావచ్చు, మన దేశంలో కావచ్చు, ఈరోజున్న పెద్దసమస్య.. వనరుల లోపం, ప్రజలకు తెలివితేటలు, కష్టపడే శక్తి లేకపోవటం కాదు. వీటిని సద్వినియోగం చేసేలా రాజకీయ ప్రక్రియను మనం నడిపించుకోకపోవటం.

మన జీవితాల్ని నిత్యం ప్రభావితం చేసే రాజకీయాల్ని మనం నిర్దేశించలేకపోతున్నాం. కేవలం ఎన్నికల్లో ఓట్లు వేయటం, ఆ తర్వాత భావప్రకటనా స్వేచ్ఛతో వీధుల్లో, సామాజిక మాధ్యమాల్లో అరుపులు, అసభ్య, అశ్లీల తిట్లతో విమర్శలకు దిగటం తప్ప మన కు, రాజకీయానికి మధ్య సంబంధం పెద్దగా లేకుండా పోయింది.

ప్రజాస్వామ్య రాజకీయాల్లో ఎన్నికలు ఎంతో కీలకమైనవనటంలో సందేహం లేదు. కానీ ఎన్నికలంటే విప్లవం కాదు. మొత్తాన్నీ మార్చిపారేసే మంత్రదండాలు కావు. ఎన్నికల మధ్యకాలంలో కూడా ప్రజలుగా మన పాత్ర ఉంటుంది. ఈ పాత్రను పోషించాలంటే మనం రాజకీయాలను చూసే దృష్టి మారాలి. గాంధీ ఇచ్చిన నిర్వచనంలోని అంతరార్థాన్ని గ్రహించాలి. మన జీవితంలో భాగంగానే రాజకీయాన్ని చూడాలి తప్ప, అదేదో మనకు సంబంధం లేని రంగంగా భావిస్తే ఎప్పటికీ పరిష్కారాన్ని అందుకోలేం.

మన దేశంలో రాజకీయ విశ్లేషణల్లో తలపండినవారు కూడా ఎక్కువమంది విచిత్రంగా రాజకీయ పార్టీలలోని వ్యవహారాలు ప్రైవేటు వ్యవహారమన్నట్లే మాట్లాడుతుంటారు. రాజకీయ పార్టీలు ఎలా నడుస్తాయనే అంశంతో సంబంధం లేకుండా వస్తే న్యూస్ ఈవెంట్లలాగా పార్టీల కార్యకలాపాల్ని విశ్లేషిస్తుంటారు. పార్టీల్లో జరిగిన అంతర్గత చర్చలు ప్రజలకు తెలియనక్కర్లేదు.. కానీ తీసుకున్న నిర్ణయాలు, ఆ నిర్ణయాలకు ప్రాతిపదిక, పార్టీ పదవుల్లోకి ఎవరు, ఏ రకంగా ఎన్నికయ్యారు, పార్టీకి నిధులెలా వస్తున్నాయి, ఎలా ఖర్చు చేస్తున్నారు.. వగైరా విషయాలన్నీ ప్రజలకు తెలియాలి. ఎందుకంటే భారత్ వంటి ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ పార్టీలు ప్రజల ఆస్తి తప్ప ఎవరి సొంతం కావు. మనల్ని, మన కుటుంబాల్ని ఎలా చూస్తామో, అలా రాజకీయాల్ని కూడా మనం సొంతం చేసుకోకుండా వీటన్నిటినీ గుర్తించటం సాధ్యం కాదు. మనకజీవితాలకు, రాజకీయాలకు ఉన్న సంబంధాన్ని చూడటానికి, ఒప్పుకోవటానికి నిరాకరిస్తున్నందునే మనం ఎన్నికల్లో ఓటు వేయటానికి డబ్బు, తాత్కాలిక తాయిలాలు, ప్రలోభాలు, కులం, మతం, భాష వంటి ఉన్మాదాలకు గురవుతున్నాం, రాజకీయ పార్టీలు కొందరు నేతల ప్రైవేటు ఎస్టేట్‌లన్నట్లు విడిచిపెడుతున్నాం, కేవలం పుట్టుక కారణంగా వారి వారసులు రాజకీయాల్లో పదవులను నేరుగా పొందుతుంటే తమాషా చూస్తున్నాం.

రాజకీయాలంటే కేవలం పార్టీలకు, నాయకులకు, మీడియాకు వదిలేయాల్సిన విషయం కాదు. ప్రధానంగా రాజకీయాలు తమ కోసమేనని, తమకు సంబంధించినవేనని గుర్తించి ప్రజలు తమ రోజువారీ జీవితంలో భాగంగా పట్టించుకుంటుండాలి. మన జీవితంలో ముడిపడిన రాజకీయాల్ని మనం 'ఓన్' చేసుకుంటేనే ఇహలోకంలో అభివృద్ధి, ఆనందం, పరలోకంలో విముక్తి అన్నది గాంధీ జీవితంలోని అతి పెద్ద పాఠం. అందుకే లోక్‌సత్తా జేపీ పేటెంట్ తీసుకున్నట్లు చెబుతుంటారు.. "రాజకీయాల్ని మించిన పవిత్ర వ్యాసంగం మనిషి జీవితంలో లేదు" అని. 2012లో అన్నా హజారే బృందం రాజకీయాల్ని దూషించినా, తిరస్కరించాలని పిలుపునిచ్చినా జేపీ దాన్ని తోసిపుచ్చారు. రాజకీయాల్లోకి వస్తే చెప్పుతో కొట్టండని అప్పట్లో చెప్పిన అరవింద్ కేజ్రీవాల్ ఆ తర్వాత 'ఆమ్‌ఆద్మీ పార్టీ' (ఆప్) పెట్టారనుకోండి. రాజకీయాల పట్ల ఈ అవగాహన అవసరం ఇప్పుడు మరింత పెరిగింది.

కానీ జనాభాలో దాదాపు 90 శాతం మంది అసంఘటిత రంగంలో, అనిశ్చిత ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న మన దేశంలో.. రాజకీయాలను నిత్యం పట్టించుకోవటం సాధ్యమా? అన్నది ప్రశ్న. దీనిక్కూడా గాంధీ గారే పరిష్కారం చూపుతున్నారు. అధికారాన్ని వికేంద్రీకరించి గ్రామ, వార్డు స్థాయికి చేరిస్తే, మన చుట్టూ పాలనను ఏదోక రూపంలో రోజూ కాసేపు పట్టించుకోవచ్చు. యువత తమ జీవితాల్ని చూసుకుంటూనే ఈ పని చేసేయొచ్చు. మన జీవితాల్లో దాదాపు 80 శాతం సమస్యలు, పరిష్కారాలు స్థానికంగానే ఉంటాయి కాబట్టి.. ఈ కొద్దిపాటి రాజకీయ భాగస్వామ్యం ద్వారానే మనం అద్భుత ఫలితాల్ని సాధించుకోగలం. కాస్త ఎక్కువ సామర్థ్యం, సొంత వనరులు ఉన్నవారు పైస్థాయికి నాయకులుగా ఎదగవచ్చు. చిత్తరంజన్ దాస్, సుభాష్ చంద్రబోస్, ప్రకాశం పంతులు, నెహ్రూ, పటేల్, అంబేద్కర్ లాంటి వారిలాగా క్రమంగా రాష్ట్ర, జాతీయ స్థాయికి కూడా ఎదగొచ్చు. రాజకీయాల్ని పట్టించుకోవటమంటే, అందరూ తత్వవేత్తలు, నిపుణులు, జాతీయస్థాయి నేతలు కానక్కర్లేదు. ఆ అవకాశాలు అందివచ్చి ఆసక్తి ఉన్నవారు మాత్రమే పైస్థాయికి వెళ్లి స్థానికంగా పరిష్కరించుకోలేని 20 శాతం సమస్యల్ని, అలాగే రాష్ట్రానికి, దేశానికి దిశానిర్దేశం చేసే పనిని చేస్తారు. అధికారం ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల చేతుల్లో కేంద్రీకృతం కాకుండా ఉంటే, ఇప్పటికే మనకు ఈ స్పష్టత వచ్చేసేది. వంశపారంపర్య

నేతలు కాకుండా దిగువస్థాయి నుంచి జవజీవాలు, నిజమైన సత్తా ఉన్న యువనాయకులు ఎదుగుతుండేవారు. అందుకే గాంధీజీ చెప్పిన గ్రామస్వరాజ్య భావనను యథాతథంగా కాకున్నా, స్ఫూర్తిగా తీసుకుని స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాలి. కులం ప్రభావం ఎక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతంలో కొన్ని గ్రామాలను సముదాయాలుగా ఏర్పాటు చేసి పంచాయతీలుగా మార్చాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకుండా నేరుగా స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు హక్కుగా ఉండేట్లు, అదే సమయంలో జవాబుదారీతనం, ప్రజల భాగస్వామ్యం ఉండేట్లు చేయాలి. ప్రధానిగా 73, 74వ రాజ్యాంగ సవరణల్ని తీసుకొచ్చిన పీవీ నరసింహారావు శతజయంతి ఉత్సవాల్ని ఈ ఏడాది ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక సంస్థలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లాగా స్వతంత్ర ఉనికిగల స్థానిక ప్రభుత్వాలుగా మార్చాలన్నది ఆ సవరణల లక్ష్యం. అయితే వాటి రూపకల్పనలో లోపాల వల్ల స్థానిక ప్రభుత్వాలు ఇంకా స్థానిక సంస్థలుగానే కొనసాగుతున్నాయి, మూడో అంచె ఫెడరలిజం ఇప్పటికీ కలగానే ఉంది. ఈ లోపాన్ని సరిదిద్ది స్థానిక ప్రభుత్వాల సాధికారతకు విధిగా బడ్జెట్ కేటాయింపులు, ఇతర ఏర్పాట్లు ఉండేలా చట్టబద్ధ ఏర్పాట్లు చేస్తే పీవీకి కూడా నిజమైన నివాళి అవుతుంది. అలాగే ఎన్నికలలో గెలిచినవారి పాత్రతోపాటు ఎన్నికల మధ్యసమయంలో పౌరుల పాత్ర కూడా ఉండేలా నిర్దిష్ట ఏర్పాట్లు చేయాలి. ఇందుకు కూడా గాంధీ గారినే ఉదాహరణగా తీసుకోవచ్చు. ఆయనకు ఏ పదవీ లేదు, కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం ఉందో లేదో, ఎప్పుడు రద్దయిందో కూడా సరిగా ఎవరికీ తెలియదు. అందువల్ల పదవులే ధ్యేయమనే ధోరణిని వీడి రాజకీయం చేయగలిగే పౌరశక్తిని మనం పెంచుకోవాలి.

ఇంకో అంశం రాజకీయాలు జరిపే తీరు. పత్రికల్లో, టీవీల్లో కనిపించటానికో, సోషల్ మీడియాలో సంచలనం కావటానికో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాం, వేధింపులకు, భౌతిక దాడులకూ తెగబడుతున్నాం. ఇది రాజకీయం కాదు, అరాచకం. రాజకీయంలో హింసకు స్థానం లేకుండా భావాల సంఘర్షణ మాత్రమే ఉండేలా మనం బహిరంగ చర్చా ప్రమాణాల్ని పెంచుకోవాలి. గాంధీ చెప్పిన సృజనాత్మక ఒత్తిడి (క్రియేటివ్ టెన్షన్) పద్ధతిలో హింస దాకా వెళ్లకుండా.. సంభాషణ, హేతుబద్ధ వాదనలతో, భిన్నమైనవైనా, పరస్పర విరుద్ధమైనవైనా సరే అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ పోరాడే నాగరిక ప్రజాస్వామిక పద్ధతుల్ని అలవరచుకోవాలి. విద్యావంతుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ భావాలు వికసిస్తూ వ్యక్తీకరించే ధోరణులు పెరుగుతుంటాయి. నూరు పూలు వికసించాలి, వేల భావాలు సంఘర్షించాలి. కానీ వీటన్నిటి మధ్యా ఎవరి వాదనలో బలముంటే ఆ వాదన నెగ్గాలి. పాలనా సమస్యలైనా, అన్యాయాలు, కుల వివక్షలు వంటి అంశాలైనా, లేదా మనం కొత్తగా వేరే పరిష్కారాలు చెప్పాలనుకున్నా ఎంత ఆవేశం, ఆక్రోశం ఉన్నా కూడా ఒక క్రమపద్ధతిలోనే, వాస్తవాలు, సాక్ష్యాలు ఆధారంగానే, మాట హద్దు మీరకుండానే తెలియచెప్పాలి. అప్పుడే దీర్ఘకాలం నిలబడే పరిష్కారంలో భాగం కాగలం.

అలాగే రాజకీయాల్లో చురుకుగా పాల్గొనాలంటే మనకంటూ సొంత ఉపాధి ఉండాలి. కరోనా తర్వాత ఉపాధి, ఆదాయాల ప్రాధాన్యత మరింత అర్థమైంది. ఉపాధినిచ్చేవారంతా దొంగలు అనుకునే ధోరణిపై పునరాలోచన మొదలైంది. సంక్షోభం, అనిశ్చితి ఉన్నా ఉపాధిని పొందే నైపుణ్యాల్ని పెంచుకుంటూ, చిన్న పని, పెద్ద పని అనికాకుండా సమాజానికి ఉపయోగపడే పని ద్వారా ఆదాయాన్ని పొందే డిగ్నిటీ ఆఫ్ లేబర్ సంస్కృతిని పెంపొందించుకోవాలి. ఇతరుల దగ్గరో, ప్రభుత్వం దగ్గరో చేయిజాచి అర్థించే కంటే సొంతంగా ఎంత సంపాదించుకున్నా ఆ స్వావలంబన ఎన్నో రెట్లు గొప్ప. కుల, మత, లింగ వివక్షలు లేకుండా ఉత్పాదకంగా చేతనైన పని చేయటమనే గాంధీ సూత్రం మన దేశంలో ఉపాధి సమస్యను పరిష్కరించటానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఇక గాంధీ చెప్పిన ఈ అంశాలను పక్కనపెట్టి ఆయన్ను పాలకులు ఎక్కువగా వాడుకున్నది పారిశుద్ధ్యం విషయంలో. గాంధీజీ చీపురుతో ఊడవటం, ఆయన కళ్ల జోడు వంటి వాటిని స్వచ్ఛభారత్‌కు ప్రచార ఫోటోలుగా ఉపయోగించుకున్నారు, ఉపయోగించుకుంటున్నారు. చిత్తశుద్ధిలేని శివపూజ కావటంతో ఆ కార్యక్రమం అంతగా విజయవంతమవలేదనుకోండి. ఆరోగ్యంతో ప్రత్యక్ష సంబంధమున్న పారిశుద్ధ్యం, గాంధీ చెప్పిన ఇంకో అంశం పర్యావరణ పరిరక్షణలను రాజకీయ ఎజెండాలో భాగం చేసి ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్నట్లు కాకుండా స్థానిక ప్రభుత్వాల పరిధిలోకి తేవాలి. నాణ్యమైన ఆరోగ్యాన్ని, గాంధీ సూచించినట్లు మాతృభాష/స్థానిక భాషలో బోధనను మొదలుపెట్టి మంచి ప్రమాణాల విద్యను అందించటం, పర్యావరణాన్ని కాపాడటం విధిగా స్థానిక పాలనలో భాగం కావాలి. 'మనిషి అవసరానికి తగినంత ప్రకృతి ఇస్తుందిగానీ, అత్యాశకు పోతే ఎన్ని వనరులున్నా చాలవు' అని గాంధీ ఎప్పుడో హెచ్చరించారు.

ప్రకృతితో సామరస్యంగా ఉంటూ అవసరానికి మించిన సంపదకు ధర్మకర్తలా వ్యవహరించాలని చెప్పేవారు గాంధీజీ. ఈ ధర్మకర్తృత్వ ధోరణితో మంచి రాజకీయానికి తగినన్ని విరాళాలు లభిస్తే, ఆర్థిక అంతరాలు తగ్గటంతోపాటు మరింత మంది యువనాయకులు తయారవుతారు, సమాజానికి, దేశానికి మరింత భరోసా ఏర్పడుతుంది.

కరోనా కాలంలో పరిణామాలు, నాయకులు, ప్రభుత్వాల వైఫల్యాలు చూశాక ఏదోకస్థాయిలో మనందరి మనసుల్లో మెదిలిన అంశాలే ఇవి. కానీ వీటిపై మనకు స్పష్టత ఏర్పడాలి, రోజుకో సంచలనం మధ్య ఇవి కొట్టుకుపోకుండా చూసుకోవాలి. అప్పుడే మనం గాంధీజీ ఆశించిన రీతిలో రాజకీయ పరిష్కారంలో భాగం కాగలం, గాంధీ బోధించి ఆచరించిన విలువలు వేళ్లూనుకునేందుకు తగిన వ్యవస్థల్ని నిర్మించగలం, పెద్దఎత్తున యువ నాయకత్వాన్ని అందించగలం, రెండో స్వాతంత్ర్యాన్ని సాధించగలం, నామమాత్రపు స్వరాజ్యాన్ని అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే సురాజ్యంగా మార్చగలం. గాంధీజీ 150వ జయంతి వేడుకలను జరుపుకోవటమంటే ఇదే.

**(మహాత్మాగాంధీ 150వ జయంతి ముగింపు సందర్భంగా గత రెండేళ్లలో ఆయన జీవితం, కృషిపై వెలువడిన రచనల నుంచి కొన్నిటిని 'జనబలం' అక్టోబర్ సంచికలో ఈ వ్యాసం తర్వాత ప్రచురిస్తున్నాం. ఆయా రచయితలకు, వీటిలో కొన్నిటిని ఇప్పటికే ప్రచురించిన పత్రికలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాము)**

ఆకార్ పటేల్

# ఎప్పటికీ అవసరమైన నాయకుడు




కొన్ని సంవత్సరాల క్రితం నాకు వార్ధా వెళ్లే అవకాశం వచ్చింది. ఇది మహారాష్ట్రలోని ఉత్తర ఈశాన్యంగా ఉన్న చిన్న గ్రామం. భారతదేశాన్ని ప్రముఖ కేంద్రంగా ప్రపంచానికి పరిచయం చేసిన గ్రామం. మహాత్మాగాంధీ 'సేవాగ్రామ్' అనే ఒక ఆశ్రమాన్ని ఇక్కడే ప్రారంభించారు. అంతేకాదు, తన జీవితంలోని చివరి దశాబ్దన్నర కాలాన్ని (1933–1948) ఇక్కడే గడపడం విశేషం. నిజానికి నాకు ఈ ప్రాంతంతో పెద్దగా పరిచయం లేదు. పాఠశాలలో చదువుకున్నప్పుడు పుస్తకాల ద్వారా 'సేవాగ్రామ్', 'వార్ధా' పేర్లు పరిచయమయ్యాయి. నిజానికి వార్ధా వంటి ప్రదేశాలకు జనం పెద్దగా రారు. విరివిగా రారు. 'సైట్ సీయింగ్' అంటూ మనవాళ్లు తరచూ పెట్టుకునే విహార యాత్రల ప్రణాళికలో కూడా 'వార్ధా' ఉండదు. పరిచయం ఉన్నవారు కూడా ఎవరూ లేకపోవడం, సరైన ఆహ్వానాలు కనిపించక పోవడం వల్ల కూడా వార్ధా ఇవాళ తన విహార పరిమళాన్ని కోల్పోయింది.

కానీ ఇది ఒక ముఖ్యమైన ప్రదేశం. స్కూల్ పిల్లలు, పెద్దవాళ్లు, వయస్సుతోనూ, కులమతాలతోను సంబంధం లేకుండా అందరూ దర్శించవలసిన ఆవరణ. 150 సంవత్సరాల తరువాత కూడా తన సమాంతర కాలంతోపాటు, తన తర్వాతి తరాలని, ప్రపంచవ్యాప్తంగానూ ప్రభావితం చేస్తున్న గొప్ప వ్యక్తి నివసించిన జాడ ఇది. భారతదేశాన్ని ఇంత ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంచడానికి తనదైన ప్రయత్నాన్ని కొనసాగించిన వాడు గాంధీ. సౌందర్య దృష్టిలేని నాలాంటి వాడికి కూడా ఆ ఆశ్రమ ఆవరణలోకి అడుగుపెట్టగానే, గాంధీని కలిసిన ఒక అనుభూతిని పొందడం ఒక సర్వసాధారణ అనుభవం.

నేను ఆశ్రమంలోని సందర్శకులతోనూ, పెద్దవాళ్లతోనూ ఇవాళ్టి సమాజంలో, ఇవాళ్టి అవసరంలో గాంధీ సమకాలీనత ఎలా ఉంటుందని ఎన్నో చర్చలు చేశాను. చర్చలు కొనసాగుతూ ఉండగానే మధ్యాహ్నం దాటింది. ఆ సమయం వార్ధాలో ప్రార్థనా సమయం. అందరూ కూడా చిన్న, పెద్ద, ముసలి, ముతకా తేడా లేకుండా సేవాగ్రామ్ ఆచారాలని పాటించడానికి, సమయ పాలన కొనసాగించడానికి తాపత్రయ పడటం చూశాను. మొదట నాకు ఇది అతిగా అనిపించినా, వాళ్ల అంతరంగం అర్థమవసాగింది. సమయపాలన కొనసాగించడంలోనూ, ప్రార్థనలు చేయడంలోనూ, ఎవరి పని వారు చేసుకోవడంలోనూ తెలియకుండానే గాంధీతోనూ, ఆయన ఆశయాలతోనూ కలిసి నడుస్తున్న ఒక భావం వాళ్లల్లో కనపడింది.

మరి మిగతావాళ్లం ఏ విధంగా గాంధీని చేరగలం. ఇన్ని దశాబ్దాల తర్వాత కూడా విలువలతో కూడిన గాంధీ జీవితం, గాంధీ ఆచరణ ఇంత ప్రభావవంతంగా ఉండటంతో తమని తాము కోల్పోతున్న ప్రతి ఒక్కరూ గాంధీని తలచుకొని పునర్ నిర్మితమవడానికి ప్రయత్నించడం ఒక్కటే చేయవలసినది. ఆశ్చర్యమేమిమంటే గాంధీ పుట్టిన కాలానికి, ఇప్పటికీ చాలా తేడా ఉంది. గాలిబ్ మరణించిన సంవత్సరం (1869)లోనే గాంధీ పుట్టాడు. గాంధీ జీవితంలోని చివరి ఏడెనిమిది నెలలు తప్ప మొత్తం జీవితం అంతా యూరోపియన్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంతోనే సరిపోయింది. మరో కోణంలో చూసుకుంటే ఆయన కాలం, ఆయన జీవితం, ఆయనకి తెలిసిన భారతదేశం ఒకదానితో ఒకటి విభిన్నమైనవి కావు. ఇది మనలో కొత్త అర్థాన్ని, స్ఫూర్తిని నింపి మన అడుగులు 'సేవాగ్రామ్' వైపు నడవడానికి దోహద పడుతుంది.

భారతీయులకు ఉన్న 'పరిశుభ్రత' సమస్యను గాంధీ మొదటగా గుర్తించారు. సమస్య మన చుట్టూ ఉన్న మురికిని, మరో ఇళ్లలోని సౌందర్యాన్ని మన ముందు ఆవిష్కరింపచేస్తుంది. దీని దృష్టిలోంచి సేవాగ్రామ్‌లోని చిన్న చిన్న భవంతులని చూస్తే ఇతర గ్రహాలపై ఉన్నామనే భావన కలుగుతుంది. సేవాగ్రామ్ మొత్తం చాలా చాలా శుభ్రంగా ఉంటుంది. అంతేకాదు భారతదేశ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా గాంధీ ఈ భవంతులను నిర్మించారు. ముఖ్యంగా అత్యధిక వేడి నుండి, విరివిగా కురిసే వర్షాల నుండి రక్షించుకోవడానికి అనువైన విధంగా నిర్మాణం జరిగింది. ప్లింత్ ఏరియా అందంగా తీర్చిదిద్దడం గానీ, కిటికీలను వాటి సైజులను జాగ్రత్తగా గమనించి వాటిని సరైన స్థలంలో ఏర్పాటు చేయడం గానీ, నిర్మాణానికి కావలసిన ముడిసరుకును సేకరించడంలో గానీ, పైకప్పును అందంగా నిర్మించడంలో గానీ గమనిస్తే సంవత్సరంలోని వివిధ కాలాలకు అనుగుణంగా మార్పులను

తట్టుకుని నిలబడే విధంగా నిర్మాణం జరిగినట్లు స్పష్టంగా కనపడుతుంది.

భారతదేశంలోని ఇతర నగరాలలో ఎక్కడా కూడా ఇలాంటి రూపకల్పనతో కూడిన ఆర్కిటెక్చర్ కనపడకపోవడం సిగ్గుపడవలసిన విషయం. గాంధీ సౌందర్య దృష్టి సొగసైనదే గానీ సౌందర్యవంతమైనది కాదు. ఆశ్రమంలోని చిన్న చిన్న గుడిసెలలో, ఇళ్లలో ఎక్కడా కూడా ఒక అనవసర వస్తువు కనపడదు. ఒక్క అలంకారం కనపడదు. ఒక్క ఆడంబరమూ కాదు, ఆఖరికి మరుగుదొడ్డి కూడా ఇండియన్ స్టయిల్‌లోనే ఉండడంతో ఎప్పటికప్పుడు వ్యర్థాన్ని బయటకు పంపించాలన్న గాంధీ ఆలోచన మనకు స్పష్టమవుతుంది. కులం అనేది ఆచారాల ద్వారా కొనసాగే కాలుష్యంగా భావించారు గాంధీ. వెంటనే దీనిని సరిదిద్ద తలచారు. అందులో భాగంగా ప్రతి ఒక్కరూ విధిగా మరుగుదొడ్లను శుభ్రపరచుకోవాలని, ఎవరి పని వారు చేసుకోవాలని నిబంధన పెట్టారు. అందుకే, జి.డి బిర్లా సైతం వార్ధా ఆశ్రమానికి వచ్చినప్పుడు తాను ఉపయోగించిన మరుగుదొడ్డిని తానే శుభ్రపరచుకునేవారు అనే వాస్తవం గాంధీ ఆలోచనలలోని నిబద్ధతను స్పష్టం చేస్తుంది.

దీనినే గాంధీ ఇంకో విధంగా చెప్పేవారు. నా సంతోషం కొద్దీ వేద మెహతా రాసిన 'మహాత్మాగాంధీ, అతని శిష్యులు' (మహాత్మాగాంధీ అండ్ హిజ్ ఎపోజల్స్) అన్న గ్రంథంలో చదివిన ఒక విషయాన్ని చెబుతాను. గాంధీ ఎప్పుడూ కూడా తాను ఉపయోగిస్తున్న మరుగుదొడ్డి తలుపులు వేసుకునేవారు కాదట. చాలామంది ఆయనను ఆ సమయంలో కలిసి అనేక విషయాలు మాట్లాడేవారు. ఆరోగ్యపరమైన సమస్య వల్ల ఎక్కువసేపు మరుగుదొడ్లో ఉండవలసి రావడంతో గాంధీ ఇలా చేసేవారని చెబుతారు. అంటే సమయాన్ని ఆదా చేయడమన్న మాట.

గాంధీ ఎప్పుడూ యథాతథస్థితిని కొనసాగించేవారు కాదు. ఎప్పటికప్పుడు మారడం, మార్పును ఆహ్వానించడం చేసేవారు. ఇది గాంధీ మనకు చెప్పిన రెండో పాఠం. మొత్తం జీవితాన్ని ఉద్యమానికే అంకితం చేసి, విపరీతమైన అధికారం ఉన్న బ్రిటీష్ సామ్రాజ్యంతో గాంధీ యుద్ధం చేశారు. రైతుల కోసం చంపారన్ సత్యాగ్రహంతో మొదలు పెట్టిన గాంధీ ఉద్యమ నడక, మొత్తం జనాన్ని ఆకర్షించటంతో, ఆకట్టుకోవటంతో, ప్రభావపరచటంతో జనమయమైన ఆ ఉద్యమాన్ని కాదనలేని పరిస్థితిలోకి బ్రిటిష్‌ను గాంధీ నెట్టారు. దీనినే మేధావియుక్తిగా పేర్కొంటారు. జనబలం, పోరాటస్ఫూర్తి ఉన్న గాంధీ ప్రజాపక్షాన నిలబడి అనేక అవసరాలను ఉద్యమాల ద్వారా సాధించారు.

మనం చేసే పని గురించి గాంధీ మనకు మూడో పాఠం చెబుతారు. మనలో చాలామంది జీవితంలో ఎదురయ్యే సంఘటనలను యథాతథంగా స్వీకారం చేస్తుంటారు. వాటి వాస్తవాలను గ్రహించరు. అవాస్తవాలను ప్రశ్నించరు. కష్టమైన, సమస్యలతో కూడుకొన్న మార్పు వైపు జరగడానికి భయపడతారు. కానీ గాంధీ అలా కాదు. మొదటి నుండి కూడా ప్రతి పనిలోనూ ప్రయత్నాన్ని కొనసాగించేవారు. తనకు నచ్చని పనిపట్ల గానీ, విధానం పట్ల గానీ చాలా కచ్చితంగా ఉండేవారు. వి.ఎస్ నైపాల్ గాంధీజీ జీవితంలోని ఆఖరు సంవత్సరంలో జరిగిన ఒక సంఘటన గురించి రాశారు. 1946లో విభజనకు వ్యతిరేకంగా తూర్పు బెంగాల్‌లోని నౌఖాలీ ప్రాంతంలో జరిగిన అల్లర్లకు కొన్ని వేలమంది జనం తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంలో అక్కడికి వెళ్లిన గాంధీ ఆ గొడవలను ఆపడానికి ప్రయత్నించారు. కానీ విభజన తీవ్రత వల్ల గాంధీకి అది సాధ్యం కాలేదు. నైపాల్ చాలా ఆధారాలతో ఈ విషయాన్ని తన వ్యాసంలో ప్రస్తావించారు. ఆ గొడవలను ఆపలేకపోతున్నందుకు గాంధీ చాలా తీవ్రంగా కలత చెందుతూ పైకి, కిందకూ తిరుగుతున్నారట. 'క్యాకరూ! క్యాకరూ!' (నేను ఏం చెయ్యగలను? ఏం చెయ్యగలను?) అంటూ తెగ మథనపడ్డారట. వెనువెంటనే నిరాశకు గురిచేసే ఆలోచనలను దూరం చేసుకుని, మళ్లీ ప్రయత్నానికి గాంధీ సిద్ధమయిపోయారు.

గాంధీ చెప్పే నాలుగో పాఠం సహనంగా, శాంతంగా ఉండటం. ఇది మనందరం మర్చిపోకుండా గుర్తుంచుకోదగ్గ విషయం. ఏ విషయాలైతే ఆరోజు గాంధీ గారు చెప్పారో.. అవే విషయాలు ఇప్పటికీ అవసరపడటమే గాంధీ గొప్పతనం.

గాంధీని హత్య చేసిన నాథూరాం గాడ్సే దృష్టిలో దేశం రెండు ముక్కలు కావడానికి, పాకిస్తాన్ ఏర్పడటానికి గాంధీయే కారణం, అందుకే గాంధీని కాల్చిచంపానని భావిస్తాడు.

**గాడ్సే చెప్పిన మాటలు ఇవి:**

"కాంగ్రెస్‌లోని ముఖ్య నాయకులందరూ గాంధీ సలహా తీసుకుని భారతదేశాన్ని రెండు ముక్కలుగా చింపివేశారు. ఇది దేవుని పనిగా మనందరం భావించాం. కానీ నా మనసు నిండా భయంకరమైన కోపం నిండిపోయింది. నాకు వ్యక్తిగతంగా ఎవరి మీద ద్వేషం లేదు. ప్రజలను పట్టించుకోకుండా తనకు ఇష్టమొచ్చినట్టుగా నడిచే ప్రభుత్వాన్ని నేను ద్వేషిస్తాను. ముస్లింల పక్షపాతిగా మారుతున్న ప్రభుత్వాన్ని నేను ప్రశ్నిస్తాను. ఈ ముస్లిం పక్షపాతం కచ్చితంగా గాంధీ వల్ల మాత్రమే వచ్చిందని మనం ఢంకా బజాయించి చెప్పవచ్చు."

పాకిస్తాన్‌తో వ్యవహారశైలి విషయంలో గాంధీ కోరుకున్నది ఏమిటి?.. మళ్లీ మనం ఒకసారి ఆలోచించాలి.

గాంధీ భాష విషయంలో కూడా చాలా ఉదారంగా ఉండడం మనం గమనించాలి. భారతీయులందరూ కూడా ఉర్దూ స్క్రిప్టులోనూ, నాగరి స్క్రిప్టులోనూ అచ్చయిన హిందీ సిలబస్‌ను నేర్చుకోవాలని చెబుతారు. భాషాపక్షపాతిగా ఎవరూ గాంధీని భావించరు. ఎందుకంటే, అప్పటికే హిందీ దేశంలో అందరినీ దగ్గర చేసే భాష.

పాకిస్తాన్‌లోని ప్రముఖ పత్రిక 'డాన్'లో ఒక వ్యాసం చదివాను. లాహోరు నుండి ఒక పెద్దమనిషి తన అనుభవాన్ని రాసుకున్నాడు. 'ఒకసారి వాళ్ల అమ్మాయి గాంధీ గురించి రాస్తూ 'గాంధీ' అనే ప్రస్తావించిందట. వెంటనే ఆ పెద్దాయన అది చూసి 'బేటీ, గాంధీజీ కహో' అన్నారట. గాంధీ కాదు, గాంధీజీ అని రాయమని అర్థం. మనం ఇక్కడ జిన్నాని నిందించినట్లుగా,

పాకిస్తాన్‌లో గాంధీ గురించి ఎవరూ మాట్లాడరు, నిందించరు. గాంధీపై ఒక్క చెడు అభిప్రాయాన్నయినా వినడం పాకిస్తాన్‌లో కష్టసాధ్యమైన విషయం.

ఒక్క పాకిస్తానే కాదు ప్రపంచంలోని ఇతర దేశాలు కూడా గాంధీని నెత్తిన పెట్టుకున్నాయి. యూరప్‌లోనూ, ముఖ్యంగా ఇంగ్లాండ్‌లోనూ గాంధీ పొడ గిట్టకపోయినా కూడా, బ్రిటిష్ సామ్రాజ్యం పట్ల దారుణమైన విమర్శకుడిగా పేరు పొందినా కూడా, ఆయా దేశాలలో కూడా గాంధీని ఇష్టపడేవారు ఉన్నారు. 1949లో గాంధీ మీద జార్జి ఆర్వెల్ ఒక వ్యాసం రాస్తూ: "ఎవరికైతే సౌందర్య రాహిత్యం ఉందనుకున్నారో, ఎవరైతే దైవత్వాన్ని కాదనుకున్నారో, ఎవరైతే మానవునికి దూరంగానూ, అతీతంగానూ ఉండకూడదనుకున్నారో, ఎవరైతే ప్రజల పక్షాన నిలబడి, ప్రజలకు వ్యతిరేకంగా జరిగే ఏ పనినైనా ఉద్యమించి ఆపారో.. ఆపగలరో వారే గాంధీజీ. ఆ కాలంలో మిగతా రాజకీయ నాయకులతో పోలిస్తే గాంధీజీ తన చుట్టూ ఎంతో సుజల శోభాయత పరిమళాన్ని వెదజల్లారు."

చివరిగా గాంధీ నుండి నేర్చుకోవలసింది ఆయన అణకువ, వినమ్రత, సునిశిత హాస్య ధోరణి. మెహతా రాసిన పుస్తకం ఒక సంఘటనను ప్రస్తావిస్తుంది. గాంధీ మౌనవ్రతంలో ఉన్నప్పుడు ఒక స్త్రీ వచ్చి చూసి వెళుతుంది. మళ్లీ తిరిగి వస్తూ 'నేను ఈ ప్రపంచంలోనే చెత్త మనిషిని చూశాను' అంటుంది. దీనికి గాంధీ ముఖం చిట్లించుకుని, అనంగీకారంతో చూస్తారు. వెంటనే ఆమె 'కాదు కాదు, నేను ఈ ప్రపంచంలో రెండో చెత్త మనిషిని చూశాను' అందట. అది విన్నవారు నవ్వును ఆపుకోలేకపోయారు.

ఇటువంటి మనుషులు మన మధ్య తిరిగారని చెప్పుకున్నప్పుడు మనకు గర్వంగా ఉంటుంది. గాంధీ పుట్టిన యుగంలోనే మనం ఉన్నామని తెలిసి మనసు పులకించిపోతుంది. మళ్లీ మళ్లీ చెప్పొచ్చు: ఎంతో తెలివైన, కలిసిమెలిసి బతికిన, సామాన్యుడిగా జీవించిన గాంధీ ఎప్పటికీ మనకు అవసరమే.

(బిజినెస్ స్టాండర్డ్)



## ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసిన స్వామి

ప్రజాస్వామిక విలువలు, మానవ హక్కులు, ఉపాధి అవకాశాల కోసం అలుపెరగకుండా పోరాడిన సామాజిక యోధుడు స్వామి అగ్నివేష్ అని ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. శత్రుత్వం లేకుండా విభేదించగల నాగరికుడని ప్రశంసించారు. ఆధ్యాత్మికత, దరిద్ర నారాయణ సేవల మేళవింపే అగ్నివేష్ అంటూ జేపీ నివాళులర్పించారు.

## లోక్‌సత్తా కృషితో కదిలిన జాతీయ రహదారి యంత్రాంగం

చిలకలూరిపేట పట్టణంలోని నరసరావుపేట సెంటర్ వద్ద జాతీయ రహదారి డిజైన్ లోపం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, డివైడర్లను సరిచేయాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది మాదాసు భానుప్రసాద్ గత కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. అధికారుల అలసత్వాన్ని నిలదీశారు. వివిధ విభాగాల ఉన్నతాధికారులను వరుస విజ్ఞాపనలతో హోరెత్తించారు. ఎట్టకేలకు నేషనల్ హైవే అథారిటీ నిర్వహణ విభాగం స్పందించింది. ఆ విభాగం అధికారి సన్యాసి నాయుడు రహదారిని తనిఖీలు చేసి అక్కడికక్కడే జీబ్రా క్రాసింగ్ మార్కులు వేశారు. నరసరావుపేట సెంటర్ వద్ద ఆకృతి సరిచేసే ప్రయత్నం చేయాలని, ఈలోగా హెచ్చరిక బోర్డులు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని భానుప్రసాద్ కోరారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ చిలకలూరిపేట ఇంఛార్జి మురికిపూడి ప్రసాద్, మాజీ మిలటరీ ఉద్యోగి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అమితాభ భట్టాచార్య

# గుంటూరు, గాంధీ, మేఘనాథ్ సాహా

1868లో సంభవించిన సంపూర్ణ సూర్యగ్రహణంపై గుంటూరులో జరిగిన అధ్యయనం హీలియం ఆవిష్కరణకు దోహదం చేసింది. నవీన పాశ్చాత్య నాగరికతను ఎంతగా వ్యతిరేకించినప్పటికీ శాస్త్ర విజ్ఞానాన్ని గాంధీజీ తిరస్కరించలేదు. ఆయన ఔత్సాహిక ఖగోళ పరిశీలకుడు. శాస్త్ర విజ్ఞానాన్ని సామాన్యుల శ్రేయస్సుకు ఉపయోగించాలని ఆరాటపడిన వైజ్ఞానికుడు మేఘనాథ్ సాహా. ఈ విలక్షణ త్రయం మధ్య ఒక అరుదైన సంబంధం ఉన్నది.

ఒక పట్టణం, ఒక మహాత్ముడు, ఒక వైజ్ఞానికుడు– ఈ విలక్షణ త్రయం మధ్య ఉమ్మడిగా ఉండదగిన విషయమేమిటి? కోస్తాంధ్రలో గుంటూరు ఒక ముఖ్యమైన పట్టణం. మిరప, పత్తి, పొగాకు పంటలకు గుంటూరు జిల్లా ప్రసిద్ధి. గాంధీజీ (1869–1948), బహుశా గౌతమ బుద్ధుడు తరువాత మహోన్నత భారతీయుడు. సమస్త ప్రపంచమూ అహింసావాద ప్రవక్తగా గౌరవిస్తున్న మహాత్ముడు. బెంగాల్‌లో ఒక పేద కుటుంబంలో ఆఖరి బిడ్డగా జన్మించిన మేఘనాథ్ సాహా (1893–1956) ప్రపంచ ప్రఖ్యాత ఖగోళ భౌతిక శాస్త్రవేత్తలలో అగ్రగణ్యుడు. నిజంగా ఈ విశిష్ట త్రయం మధ్య ఒక సంబంధం ఉన్నది. అది చాలా అరుదైన సంబంధం సుమా!




2018 సంవత్సర స్ఫూర్తిదాయక సంఘటనలలో మూడు వార్షికోత్సవాలు విశిష్టమైనవి. వాటి గురించి తప్పక తెలుసుకోవాలి. నూట యాభై సంవత్సరాల క్రితం–1868లో– గుంటూరు, ఇంకా ప్రపంచవ్యాప్తంగా పలు ప్రదేశాలలో సంపూర్ణ సూర్యగ్రహణం సంభవించింది. శాస్త్రవేత్తలు ఆ ప్రాకృతిక ఘటనను సమగ్రంగా అధ్యయనం చేశారు. ఆ అధ్యయనాలు అంతిమంగా హీలియం అనే ఒక కొత్త మూలకాన్ని (రంగు, రుచి, వాసన లేని, హానికరం గాని రసాయన మూలకం. ఆవర్తన పట్టికలో ఉత్కృష్ట వాయువుల జాబితాలో మొదటిది) కనుగొనడానికి నిర్ణయాత్మకంగా దోహదం చేశాయి. గాంధీజీ 150వ జయంత్యుత్సవాలు ఈ ఏడాది ఆరంభమయ్యాయని అందరికీ తెలుసు. అయితే నక్షత్రాలు, ఖగోళ శాస్త్రంలో గాంధీజీకి ప్రగాఢ ఆసక్తి ఉన్నదన్న విషయం ఎంతమందికి తెలుసు? 125 సంవత్సరాల క్రితం జన్మించిన మేఘనాథ్ సాహాను శాస్త్రవేత్తగా, ఆచార్యుడుగా, సంస్థా నిర్మాతగా సమస్త భారతీయులూ కృతజ్ఞతా భావంతో స్మరించుకుంటున్నారు. న్యూఢిల్లీలోని నెహ్రూ ప్లానెటేరియం (వేధశాల), ఇతర సంస్థలు ఈ మూడు వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాయి. జాతి ఘనతను ఒక సరికొత్త రీతిలో గుర్తు చేస్తున్నాయి. ప్రజల్లో మరింత వైజ్ఞానిక వివేకాన్ని పాదుకొల్పుతున్నాయి. మన దేశంలో శాస్త్ర పరిశోధనల పరిణామ తీరుతెన్నులపై ఒక సమగ్ర చర్చకు ఈ వేడుకలు ఆస్కారమిస్తాయనే ఆశాభావం కలుగుతోంది.

గుంటూరు, 19వ శతాబ్దిలోనే ఒక మునిసిపల్ పట్టణం. హీలియం ఆవిష్కరణకు దారితీసిన సంపూర్ణ సూర్యగ్రహణంతో విశ్వ వైజ్ఞానిక ప్రపంచానికి ఆ పట్టణం పేరు సుపరిచితమయింది. 1868 ఆగస్టు 18న ఫ్రెంచ్ ఖగోళ శాస్త్రవేత్త పియర్ జాన్సన్ (1824–1907) గుంటూరులో సంపూర్ణ సూర్యగ్రహణాన్ని వీక్షించారు. ఆ గ్రహణ దృశ్యాలను, వర్ణమాలను రికార్డు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రదేశాలలో ఆ సంపూర్ణ సూర్యగ్రహణాన్ని అధ్యయనం చేసిన ఫ్రెంచ్, బ్రిటిష్ శాస్త్రవేత్తలలో నార్మన్ లాక్యర్ (ప్రపంచ ప్రసిద్ధ సైన్స్ జర్నల్ 'నేచర్' సంస్థాపక సంపాదకుడు) ఒకరు. మరో ఖగోళ శాస్త్రవేత్త పోగ్సన్ సహకారంతో ఆ సంపూర్ణ సూర్యగ్రహణ వర్ణమాలలోని పసుపుపచ్చ రేఖకు సూర్యునిలోని ఒక పదార్థం కారణమని లాక్యర్ నిర్ధారించారు. ఈ నిర్ధారణల ఫలితమే హీలియం ఆవిష్కరణ. భూమిపై హీలియం పరిమాణం చాలా తక్కువ. అయితే విశ్వంలోని మొత్తం పదార్థంలో నాలుగో వంతు హీలియమే. ఇదొక గొప్ప వైజ్ఞానిక ఆవిష్కరణ. ఖగోళ భౌతిక శాస్త్రమనే కొత్త భౌతిక శాస్త్రానికి హీలియం ఆవిష్కరణే నాంది. గుంటూరు పట్టణంతో ముడిపడివున్న హీలియం ఆవిష్కరణ గాథను డాక్టర్ బిమన్ బి నాథ్ తన 'ది స్టోరీ ఆఫ్ హీలియం అండ్ ది బర్త్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్' అనే గ్రంథంలో ఆసక్తికరంగా వివరించారు.

దేశ స్వాతంత్ర్య సమర పోరాటానికి గుంటూరు పలువురు త్యాగధనులను ఇచ్చింది. గాంధీజీని తొలినాళ్ళ నుంచి అనుసరించిన ఘనచరిత్ర గుంటూరు ప్రజలకు ఉన్నది. గాంధీ, ఆధునిక పాశ్చాత్య నాగరికతను ఎంతగా వ్యతిరేకించినప్పటికీ వైజ్ఞానిక పరిశోధనలు, విజ్ఞాన శాస్త్రవేత్తలలో శ్రద్ధాసక్తులు లేని వ్యక్తి కాదని గాంధీ జీవితచరిత్రకారులు ధృవీకరించారు. విజ్ఞానశాస్త్రాన్ని ఆయన వ్యతిరేకించలేదు. వైజ్ఞానికుల కృషిని ఆయన సదా ప్రశంసించేవారు. 'ఖగోళశాస్త్రంలో నాకు అమితాసక్తి ఉన్నది. సమయం లభించినప్పుడల్లా నేను నక్షత్రాల గమనాన్ని పరిశీలిస్తుంటాను. అదొక అద్భుతమైన శాస్త్రమని' గాంధీజీ అన్నారని డాక్టర్ నందివాడ రత్నశ్రీ (న్యూఢిల్లీలోని నెహ్రూ వేధశాల డైరెక్టర్) తెలిపారు. ఆయన ఎరవాడ జైలులో ఖైదీగా ఉన్నప్పుడు జైలు అధికారులు ఆయన కోసం రెండు పెద్ద టెలిస్కోపులను జైలు ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. 'వాచింగ్ ది హెవన్స్' పేరిట రెండు వ్యాసాలను సబర్మతీ ఆశ్రమంలోని తన సహచరులకు పంపుతూ రోజూ రాత్రిపూట ఖగోళ పరిశీలనలు

చేయాలని ఆయన వారికి సూచించారు. మృగశిర నక్షత్రరాశి విషయంలో ఆయనకు విశేష ఆసక్తి ఉండేదని డాక్టర్ రత్నశ్రీ తెలిపారు. ఆ నక్షత్ర రాశి రేఖాచిత్రాన్ని కూడా ఆయన రూపొందించారు. వివిధ నక్షత్ర రాశులకు సంబంధించిన తమ తమ సొంత రేఖాచిత్రాలను రూపొందించాలని కూడా ఆయన తన సబర్మతీ ఆశ్రమ సహచరులకు సూచించారు. విశాల విశ్వాన్ని అన్వేషించిన మహోన్నత ఖగోళ శాస్త్రవేత్తల జీవిత కథలను సుబోధకంగా వివరిస్తూ రాసిన పుస్తకాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని మహాత్ముడు ఆకాంక్షించేవారు. ఖగోళ శాస్త్రంపై గాంధీజీ రచనలను ప్రజలకు అందుబాటులో ఉంచడానికి నెహ్రూ వేధశాల ఇటీవల 'బాపూ ఖగోళ్ మేలా'ను ప్రారంభించింది.

గాంధీజీ సత్యశోధకుడు. సత్యాన్వేషణకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు. ఖగోళశాస్త్రంలో ఆయన ఆసక్తి ప్రగాఢమైనది. ఖగోళ పరిశీలనలు తనకు ఆధ్యాత్మిక అనుభవాలని గాంధీజీ అనేవారు. ఆధునిక వైజ్ఞానిక పద్ధతులను ఉపయోగించి గుప్తంగా ఉన్న ప్రకృతి నియమాలను ఆయన అన్వేషించేవారు. గాంధీజీ వలే మేఘనాథ్ సాహా కూడా మహోన్నత దేశభక్తుడు. సామాన్య మానవుని జీవితాన్ని ఆనందప్రదం చేయడానికి శాస్త్ర విజ్ఞానాన్ని, అధునాతన సాంకేతికతలను విస్తృతంగా ఉపయోగించుకోవాలని ఆయన పదే పదే చెప్పేవారు. బెంగాల్‌లోని ఒక కుగ్రామంలో ఒక పేద దుకాణ దారు ఐదో బిడ్డగా జన్మించిన సాహా ఎలా ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్తగా ఎదిగిందీ జి.వెంకట్రామన్ తన 'సాహా అండ్ హిజ్ ఫార్ములా' పుస్తకంలో స్ఫూర్తిదాయకంగా వివరించారు. వెంకట్రామన్ ఇలా రాశారు: '1920–30 మధ్యకాలాన్ని భారతదేశంలో భౌతిక శాస్త్ర స్వర్ణయుగంగా అభివర్ణించవచ్చు. ఆ పదేళ్ళలో భారతీయ శాస్త్రవేత్తలు నాలుగు గొప్ప ఆవిష్కరణలు చేశారు. అవి: సాహా అయనీకరణ సూత్రం, బోస్ స్టాటిస్టిక్స్, రామన్ ఎఫెక్ట్, చంద్రశేఖర్ లిమిట్'.

మేఘనాథ్ సాహా, సత్యేంద్రనాథ్ బోస్‌లకు (గాంధీజీకి సైతం) నోబెల్ పురస్కారం లభించకపోవడం చాలా దురదృష్టకరం. అయితే సాహా థర్మల్ అయనీకరణ సమీకరణం (సూర్యుని ఉష్ణోగ్రతల సొష్టవం, సంయోజనం మొదలైన ధర్మాలను విశ్లేషించడానికి ఉపయోగపడే సూత్రం) ఖగోళ వాతావరణ అధ్యయనం మూల సూత్రాలలో ఒకటి. ఖగోళ భౌతికశాస్త్ర పురోగతికి విశేషంగా దోహదం చేసిన వైజ్ఞానిక ఆవిష్కరణ అది (మేఘనాథ్ సాహా తన ఇరవైల మధ్యనాళ్ళలో ఆ సూత్రాన్ని కనుగొన్నారు).

సాహా వైజ్ఞానిక కృషి తమ పరిశోధనలకు ఎలా స్ఫూర్తిదాయకమయిందో ఇరవయోశతాబ్ది మహోన్నత భౌతిక శాస్త్రవేత్తలు ఎ.హెచ్ కాంప్టన్, ఎన్రికో ఫెర్మి, ఇ.ఓ లారెన్స్, హెరాల్డ్ ఊరే, మ్యాక్స్ బార్న్ (అందరూ నోబెల్ పురస్కార విజేతలే), ఆయన 60 జన్మదినోత్సవం సందర్భంగా వివరించారు. సాహా తన తొలినాళ్ళలో దారిద్ర్యం, కుల వివక్ష, వలసపాలనలకు వ్యతిరేకంగా పోరాడారు. అటువంటి ప్రతికూల పరిస్థితులలో కూడా అత్యంత చిన్న వయస్సులోనే ఆయన మహోన్నత మౌలిక వైజ్ఞానిక పరిశోధనలు చేశారు. సాహా, ఆయన సహ పరిశోధకులు తమ ప్రతిభావంతమైన పరిశోధనలతో మాతృభూమికి ఎనలేని కీర్తిప్రతిష్ఠలు సమకూర్చారు. అటువంటి సృజనాత్మక ప్రతిభ మళ్ళీ మనదేశంలో కన్పించడం లేదనడం సత్యదూరం కాదు.

మనదేశంలో శాస్త్ర పరిశోధనల ప్రస్తుత పరిస్థితి ఏమిటి? గుంటూరు, గాంధీ, సాహా గాథలు ఈ విషయమై ఆలోచించేలా మనలను పురిగొల్పుతున్నాయి. పరిశోధకుడిగా తన తొలి సంవత్స రాల అనుభవంతో, విశ్వవిద్యాలయాలు వైజ్ఞానిక పరిశోధనలకు ప్రధాన కేంద్రాలుగా ఉండాలని సాహా సూచించారు. అయితే ఆయన సూచనలు, సలహాలను పాలకులు పట్టించుకోలేదు. ఆయన ప్రతిపాదించిన వైజ్ఞానికాభివృద్ధి నమూనాను స్వతంత్ర భారతదేశం చాలావరకు నిర్లక్ష్యం చేసింది. గాంధీ, సాహాల స్ఫూర్తితో విజ్ఞానశాస్త్రాల అధ్యయనంపై నేటి యువతరంలో శ్రద్ధాసక్తులను పెంపొందింప చేసేందుకు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆధునిక నాగరికతకు, మానవాళి సుఖసంతోషాలకు శాస్త్ర విజ్ఞానం ఏ విధంగా తోడ్పడిందో వారికి తెలియజేయాలి. ఆధునిక శాస్త్ర విజ్ఞానం, నవీన సాంకేతికతల ప్రాతిపదికన మాత్రమే గాంధీజీ ఆకాంక్షించిన మానవీయ సమాజం, సాహా ప్రతిపాదించిన వైజ్ఞానిక, హేతుబద్ధ సంఘ నిర్మాణం సాధ్యమవుతాయని వివరించాలి. ఈ సమున్నత లక్ష్యసాధనకు హీలియం ఆవిష్కరణ 150వ వార్షికోత్సవం, గాంధీజీ 150వ జయంత్యుత్సవాలు, సాహా 128వ జయంతిని నిర్వ హించుకోవడం ఎంతైనా దోహదం చేస్తాయనడంలో సందేహం లేదు.

(స్టేట్స్‌మన్)

## ఉచిత విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు సరైన నిర్ణయమే: జేపీ


రైతులకు ఉచిత విద్యుత్‌ను అందించే వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు బిగించాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్ణయాన్ని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సమర్థించారు. "విద్యుత్ రంగంలో నాకు తెలిసి ఒక మంచి ప్రయత్నం జరుగుతోంది. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర రెడ్డి ఉచిత విద్యుత్‌ను ప్రవేశపెట్టినప్పుడు ఆయనతో నేను గట్టిగా వాదించాను. నచ్చజెప్పే ప్రయత్నం చేశా. మీరు ఉచిత విద్యుత్ ఇవ్వటంలో తప్పు లేదు. కానీ, మీటర్ పెట్టండని చెప్పా. మీటర్ ఉంటే, కనీసం విద్యుత్ ఎక్కడ ఖర్చవుతోంది, ఎక్కడ వృథా అవుతోంది మనకు అర్థమవుతుంది. ఎనర్జీ ఆడిటింగ్ సరిగ్గా ఉంటుంది. కానీ, మనకెందుకీ గొడవ అని కేబినెట్‌లో అనటంతో ఆయన విరమించుకున్నారు. ఇప్పుడు జగన్ సర్కార్ అమలు చేస్తున్నందుకు అభినందిస్తున్నా. కొన్ని రంగాల్లో ఖర్చవుతున్నప్పుడు, అది ఎంతవుతుందో.. ఎక్కడవుతున్నదో తెలియకపోయినట్లయితే.. పొదుపు పాటించకపోతే, సాంకేతిక నష్టాన్ని, దొంగతనాన్ని నివారించకపోతే ఖజానా ఖాళీ అవుతుంది, చివరికి రైతులు, ప్రజలకే నష్టం వస్తుంది'.. అని జేపీ ఓ టీవీ ఛానల్ చర్చలో వ్యాఖ్యానించారు.

# ఎల్లలు లేని తెలుగు - ఎప్పటికీ వెలుగు

**"కొంతమంది పూణె ప్రొఫెసర్లతో సన్నిహితంగా మాట్లాడే సదవకాశం నాకు లభించింది. ఇంగ్లీష్ భాష ద్వారా పరిజ్ఞానాన్ని పెంచుకున్న ప్రతి భారతీయ యువతా తన జీవితంలో కనీసం ఆరు విలువైన సంవత్సరాలను కోల్పోయినట్టని వారు నాకు తెల్పిచెప్పారు. మన స్కూళ్లలో, కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యతో ఆ సంవత్సరాలను గుణించండి. ఎన్ని వేల సంవత్సరాలను ఈ దేశం కోల్పోయిందో మీకే అర్థమవుతుంది. 'చొరవ లేదు' అన్నది మన మీదున్న ఆరోపణ. మన జీవితంలో విలువైన సంవత్సరాలను ఒక విదేశీ భాషలో ప్రావీణ్యం సంపాదించుకోవటానికే వెచ్చిస్తుంటే.. మనకు చొరవ ఎలా వస్తుంది? ఇంగ్లీష్ చదువున్న భారతీయులే ముందున్నారు, నాయకత్వం వహిస్తున్నారు, దేశానికి అన్ని పనులు చేస్తున్నారు.. అని చెప్పుకోవటం నేను విన్నాను. అలాకాకుండా ఇంకోలా అయితే భయంకర ఉపద్రవమేనన్నమాట! మనకు అందుతున్న చదువు.. ఆంగ్ల విద్య మాత్రమే. కచ్చితంగా దాని పట్ల మనం ఎంతోకొంత సానుకూలంగా స్పందించాలి. కానీ ఒక్కసారి ఊహించండి- గత యాభై ఏళ్లుగా మన స్థానిక భాషల్లో మనకు చదువు అందుతుందనుకోండి, ఇప్పుడు ఎలా ఉండేవాళ్లం? మనకు ఎన్ని సమకూరేవి?.. మనకు స్వతంత్ర భారతదేశం ఉండేది, చదువుకున్న స్వదేశీయులుండేవారు, ఈ యాభై ఏళ్లలో వారు సాధించింది దేశ వారసత్వ సంపదగా ఉండేది. ప్రొఫెసర్ బోస్, ప్రొఫెసర్ రే ని చూడండి. వారి పరిశోధనలు సామాన్య ప్రజల ఉమ్మడి ఆస్తి కాకపోవటం అవమానకరం కాదా?"**

**- 1916, ఫిబ్రవరి 4న బనారస్ హిందూ యూనివర్సిటీలో చేసిన చరిత్రాత్మక ప్రసంగంలో గాంధీజీ**

ప్రపంచమంతటినీ కల్లోలపరిచిన కొవిడ్-19 విస్తరణను




భారతదేశంలో మొట్టమొదటిసారిగా గుర్తించినప్పుడు మన పాలకుల స్పందన- కఠిన లాక్‌డౌన్! అలాంటి గుండుగుత్త లాక్‌డౌన్ మన దేశ పరిస్థితుల్లో మంచిదా, చెడ్డదా అన్న సంగతిని అలా ఉంచితే.. లాక్‌డౌన్ సమయంలో తమ స్పందనను వ్యక్తం చేయటానికి తెలుగు ప్రజల్లో పలువురు పదాల్ని వెతుక్కుంటూ మరీ మాతృభాషలో ప్రయత్నించటం ఆకట్టుకునే ఓ సానుకూల పరిణామం.

కరోనా కల్లోలం ప్రజల్ని ఆర్థికంగా, భౌతిక, మానసిక ఆరోగ్యపరంగా, మానవ సంబంధాలపరంగా ఎంతో కదిలించివేసింది. మనిషి అంతగా కదిలిపోయినప్పుడు అసంకల్పితంగానే మూలాల నుంచి, మాతృభాష నుంచే తననితాను వ్యక్తం చేసుకునేందుకు ప్రయత్నిస్తాడు. అందుకే తెలుగులో మాట్లాడటం తప్ప పెద్దగా రాయటం రానివారు కూడా కరోనాపై స్పందనల్ని పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.

వివిధ తెలుగు పత్రికల్లోనే ప్రచురణకు దాదాపు రోజుకు 1,000కిపైగా రచనలు లాక్‌డౌన్ సమయంలో వచ్చాయని సమాచారం. వలస కార్మికుల కష్టాలపై అయితే స్పందనలు ఇంకా చిక్కగా వచ్చాయి. శ్రీశ్రీ చెప్పినట్లు, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల.. ఇలా రోజువారీ కనిపించేవి, వినిపించేవి, అనిపించేవి అన్నీ పలువురికి కవితా వస్తువులయ్యాయి. తమ భావాల్ని పంచుకున్నవారిలో విదేశాల్లోని తెలుగువారు కూడా ఉన్నారు. గొప్ప కవులకుండే దీర్ఘదృష్టి, దార్శనికత, సాహితీ ప్రమాణాలు వీరి రచనల్లో ఉండకపోవచ్చు, కానీ వీరి పదాలు ఓ సంధి దశ సన్నివేశానికి తగ్గట్లు కదం తొక్కే భాష, భావంతో పండితపామర తేడా లేకుండా అందరినీ కదిలించి అంతిమంగా సాహిత్య ప్రయోజనాన్ని అర్థవంతంగా నెరవేర్చాయి (కరోనా కట్టడి మొదలయ్యాక ప్రజల్లో పుస్తకాభిలాష కూడా 12 శాతం పెరిగిందట. చదవటం కోసం అంతకుముందు కన్నా మూడు గంటలు ఎక్కువగా కేటాయిస్తున్నారని 'నీల్సన్ బుక్ ఇండియా' పరిశీలనలో తేలింది).

నిజానికి వివిధ కారణాల వల్ల మన దేశంలో కరోనా సంక్షోభం తక్కువగానే ఉన్నా కూడా.. అంతకుముందు ఎన్నో ఏళ్ల నుంచే మన దేశంలో ప్రజారోగ్యం, ఆర్థికం, పాలనా యంత్రాంగం వంటి మౌలిక రంగాల్లో ఉన్న సంక్షోభం వల్ల అది మనల్ని తీవ్రంగా కదిలించింది. ఉగ్గుపాల నాటి ముద్రల్ని గుర్తుకుతెచ్చింది. ఆయా రంగాల్లో కొంతైనా ఆత్మసమీక్షకు పురికొల్పింది. మన మాతృభాష విషయంలో కూడా సమీక్షకు కొవిడ్ సంక్షోభం ఒక సదవకాశమైంది. పిల్లలకు తెలిసిన భాషలోనే బోధన జరగాలని 104 ఏళ్ల క్రితం గాంధీజీ చెప్పిన సత్యాన్ని పునాదిగా చేసుకుని కనీసం అయిదో తరగతి వరకు ప్రాథమిక విద్యను మాతృభాషలో కొనసాగించాలని జాతీయ విద్యావిధానం-2020 స్పష్టం చేయటం తెలుగు భాష స్థితిపై సమీక్షకు మరో సదవకాశం.

ఇటీవల తెలుగు అంతరించి పోతోందనే భయాలు తరచూ వ్యక్తమవుతున్నాయి. అయితే పరిష్కార దృష్టి ఉంటే, భయమే జయమవుతుంది. తెలుగు వైభవాన్ని కోల్పోయిందనే మాట వాస్తవంకానీ, అంతరించిపోతుందనుకోవాల్సిన పన్లేదు. కేవలం మనకు మాతృభాష కాబట్టే అని కాదు.. ఎప్పటికీ నిలిచే చరిత్ర, వెలిగే అర్హత కలిగిన ఎల్లలు లేని భాష తెలుగు!

తెలుగు ఎప్పటిది అన్న ప్రశ్న గురించి కొంత భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

మానవ నాగరికతకు వ్యవసాయం నాంది పలికితే, వృద్ధికి భాష బాటలు వేసింది. బౌద్ధయుగానికి ముందే క్రీస్తుపూర్వం 5,000 ఏళ్ల నాటి నుంచే తెలుగువారికి చరిత్ర ఉందనేది బలమైన వాదన. దీనికి రుజువుగా కొన్ని ప్రాచీన సంస్కృత రచనల్లో తెలుగువారి ప్రస్తావన కనిపిస్తుంది. వీటిలో రామాయణ, మహాభారతాలు కూడా ఉన్నాయి. వివిధ మత, జానపద, జైన సంప్రదాయాల సాహిత్యంలోనూ,

శాసనాల్లోనూ తెలుగు ఆనవాళ్లు కనిపిస్తాయి. తెలుగునాట ఉన్న ఓ శాసనంలోని 'నాగబు'ను తొలి తెలుగు పదంగా కొందరు అభిప్రాయపడతారు. తెలుగులో సాహిత్యం అంటే మనకు క్రీ.శ 1,000 దాటాకే లిఖితపూర్వకంగా కనిపిస్తుంది కానీ.. ఈ నేపథ్యమంతా ఉండబట్టే తెలుగుకు ప్రాచీన భాష హోదాకఅర్హత ఏర్పడింది. ఒక పరిణామక్రమంగా అప్పటికే తెలుగు ఎదగబట్టే 11వ శతాబ్దంలో నన్నయ భట్టారకుడు మహాభారతం అనువాదాన్ని శబ్దశాసనుడిలా అంత ప్రామాణికంగా చేయగలిగారు.

తెలుగు ఆదికావ్యమనిపించేరీతిలో మహాభారతాన్ని రాజమహేంద్రవరంలో నన్నయ్య అనువదించిన కాలం నుంచి.. మహాభారతం, భాగవతం, రామాయణం, పురాణాలను అనువాదం చేయటం, అందులోని గాథల్ని వివిధ పద్యాలు, పాటల రూపంలో రాయటం, నాయకులను కీర్తించటం, వారి ప్రేమకథలను వర్ణించటం వంటివి తెలుగు సాహిత్యంలో భాగంగా శతాబ్దాలపాటు కొనసాగాయి. ఇందులో ఒక్కో కాలంలో ఒక్కో రూపంలో నవరసాల్నీ పండించారు. మధ్యలో నీతిశతకాలు వచ్చాయి. ఏ రచన చేసినా ప్రధానంగా రాచరిక వ్యవస్థ చుట్టూ, చక్రవర్తులు, వారి సామంతుల విశ్వాసాలు, ఆకాంక్షలు, పాలన, విస్తరణావసరాల చుట్టూనే జరిగాయి. ఇదేసమయంలో క్రమంగా ప్రజాబాహుళ్యంలో కూడా తెలుగు వ్యావహారికంగా కొత్తరూపాల్ని, పలుకుబడిని సంతరించుకుంది. ప్రజల అవసరాలకు, పాలకుల తీరుకు మధ్య తీవ్ర వైరుధ్యాలు ఏర్పడిన యుగంలో ప్రజాకవులు ఈ వ్యావహారికతను వాహకంగా చేసుకుని ఆవిర్భవించారు. పద్యాలు, పదాల రూపంలో ప్రజల్లోకి విస్తృతంగా ఆలోచనల్ని పంపే ప్రయత్నం చేశారు. ప్రజల సామాజిక, రాజకీయ సమస్యలు సాహిత్యంలోకి ప్రవేశించటం భాషను పెంచటానికి ఎంతగానో దోహదం చేసింది. ఈ కృషిలో పంపన, తిక్కన, ఎర్రాప్రగడ, మారన, నాచన సోమన, బద్దెన, పాల్కురికి సోమనాథుడు, నన్నెచోడుడు, శ్రీనాథుడు, పోతన, వేమన, వీరబ్రహ్మం, అన్నమాచార్య, తాళ్లపాక తిరుమలమ్మ, అల్లసాని పెద్దన, కృష్ణదేవరాయలు, ధూర్జటి, తెనాలి రామకృష్ణ, మొల్ల, క్షేత్రయ్య, రామదాసు, త్యాగయ్య, వెంగమాంబ వంటి దిగ్గజాలు ఉన్నారు. ఆ తర్వాత వచ్చిన చిన్నయసూరి తెలుగువారికి ప్రామాణికమైన వ్యాకరణాన్ని అందించారు.



ఇంకాస్త ఆధునిక కాలం వచ్చాక ప్రజాస్వామిక దృక్పథం మరింత పదునెక్కటమే కాకుండా, శైలి, శిల్పం కూడా కొత్తదనం సంతరించుకున్నాయి. నూతన సాహిత్య రూపాలు, సాహిత్య విమర్శ పెరుగుతూ భాషను పటిష్ఠ పరిచాయి. ప్రజల భాషగా తెలుగును తీర్చిదిద్దటంలో హరికథలు, బుర్రకథలు, ఒగ్గుకథలు, నాటకాలు వంటివి కూడా తోడయ్యాయి. కవుల్లో కొందరు పత్రిక, సినిమా రంగాల ద్వారా కూడా తెలుగు భాషను విస్తరింపచేశారు. దళిత, స్త్రీ వాదాలూ ఇందుకు దోహదం చేశాయి. సినిమాల్లో వచ్చిన డైలాగులు ప్రజల్లో వాడుకలోకొచ్చి పదాలుగా, పదబంధాలుగా స్థిరపడిపోవటం, ఉచ్చారణనే కొన్ని పత్రికలు రాతగా మార్చటం తెలుగులో కనిపిస్తుంది. హరికథలు కావచ్చు, సినిమాలు కావచ్చు.. ఈ ప్రక్రియలన్నింటిలో రచయితలతోపాటు కొందరు కళాకారుల అద్భుత ప్రతిభకకూడా తెలుగు పరిరక్షణకు, వ్యాప్తికి దోహదం చేసింది.

కందుకూరి వీరేశలింగం, గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావు, శంకరమంచి సత్యం, పానుగంటి లక్ష్మీనరసింహారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, సురవరం ప్రతాపరెడ్డి, కొడవటిగంటి కుటుంబరావు, విశ్వనాథ సత్యనారాయణ, జంధ్యాల పాపయ్యశాస్త్రి, తిరుపతి వేంకట కవులు, కొప్పరపువారు, త్రిపురనేని రామస్వామి, శ్రీశ్రీ, జాషువా, అజంత, ఆరుద్ర, రాయప్రోలు, బుచ్చిబాబు, మధురాంతకం రాజారాం, చలం, దేవరకొండ బాలగంగాధర తిలక్, మొక్కపాటి నరసింహశాస్త్రి, నండూరి సుబ్బారావు, అల్లం రాజయ్య, సముద్రాల, పింగళి, దాశరథి కృష్ణమాచార్యులు, ముళ్లపూడి వెంకటరమణ, ఆత్రేయ, వేటూరి, చాసో, రావిశాస్త్రి, భద్రిరాజు కృష్ణమూర్తి, కేతు విశ్వనాథరెడ్డి, చేకూరి రామారావు, బూదరాజు రాధాకృష్ణ, సి. నారాయణరెడ్డి వంటి పెద్దలు ఒక పరంపరగా ఈ దశలో తెలుగును విస్తరింపచేశారు.

ఆంగ్లేయులు వలస పాలకులైనా ప్రజలకు సేవలందించటంలో మన పాలకులకంటే మెరుగైన ప్రమాణాల్ని పాటించారు. స్థానిక ప్రభుత్వాలకు పెద్దపీట వేయటంతోపాటు, ప్రజల స్థానిక భాష నేర్చుకుని అధికారులు పాలనా కార్యకలాపాలు నిర్వర్తించాలనే నిబంధన పెట్టారు. ఈ క్రమంలోనే సీపీ బ్రౌన్, థామస్ మన్రో వంటి వారు తెలుగు వైభవాన్ని వెలికితీసి ఎగురవేశారు. ఇదే సమయంలో గ్రంథాయలయోద్యమం తెలుగు బాగా వేళ్లూనుకునేలా చేసింది. గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణయ్య, వట్టికోట ఆళ్వారుస్వామి, వావిలాల గోపాలకృష్ణయ్య, కాళోజీ వంటి వారు ఇందులో భాగస్వాములయ్యారు.

ఇలా సుసంపన్నమై, తలకట్టు తీవి, అజంతాక్షరాలు, పద్యాలు, అవధానాలు వంటి ప్రత్యేకతలతో, పలువురు ఆంగ్లేయుల్ని సైతం మైమరపించిన మాధుర్యంతో ప్రపంచ సుందరభాషల్లో ఒకటిగా రూపుదిద్దుకున్న తేనెలొలుకు ద్రవిడ భాష తెలుగుకు ఏ రకంగా చూసినా తిరుగుండకూడదు. కానీ మన దేశంలో నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత లేకపోవటం తెలుగు పాలిట శాపంగా మారింది.

అవిద్య, పేదరికంతో అడుగులు ప్రారంభించిన స్వతంత్ర భారతదేశంలో పాఠశాల విద్య నిర్లక్ష్యానికి గురై, మాతృభాషగా తెలుగును కొత్తతరానికి చేర్చే కృషి మందగించింది. మాతృభాషకు, విద్యకు మధ్య సంబంధం తగ్గింది. ఇది అప్పటికే మన దేశంలో ఆంగ్లం పట్ల ఉన్న మోజును పెంచటంతోపాటు, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా అవకాశాల్ని అందుకోవాలంటే ఇంగ్లీషులో చదువుకోవటమే మేలనే అభిప్రాయాన్ని కాలక్రమేణా బలపరిచాయి.

వాస్తవానికి తెలుగులో చదువుకోవటానికి, ఇంగ్లీషును నేర్చుకోవటానికి మధ్య ఎటువంటి వైరుధ్యమూ లేదు. నాణ్యమైన పాఠశాల విద్యలో తొలి ఐదారేళ్లూ మాతృభాషలో చదువుకుంటూ ఇంగ్లీషును ఒక సబ్జెక్ట్‌గా నేర్చుకోవటం, ఆ తర్వాత రెంటినీ కలిపి నచ్చిన మాధ్యమంలో ఇంగ్లీషుతోపాటు చదువుకోవటం వల్ల

ప్రపంచంలో ఎక్కడికెళ్లినా అవకాశాల్ని అందుకునే శక్తి మన విద్యార్థులకు సమకూరుతుంది. నాణ్యమైన విద్య లేనప్పుడు ఇంగ్లీషు మీడియంలో చదువుకున్నా, తెలుగు మీడియంలో చదువుకున్నా పరిజ్ఞానం, నైపుణ్యాలు పట్టుబడవు. ఇంగ్లీషు మీడియంతో నడుస్తున్న పలు ప్రైవేటు స్కూళ్లలో కూడా మంచి చదువు అందటం లేదని 'అసర్' వంటి సర్వేలు ఘోషిస్తున్నాయి. ప్రభుత్వాలు నాణ్యమైన విద్యనందించే బాధ్యతనుంచి తప్పించుకుంటూ కూడా ప్రజలకు ఏదో చేశామని చెప్పుకోవటానికి తెలుగుకి, ఇంగ్లీషుకి మధ్య గందరగోళం సృష్టిస్తున్నాయంతే. పాఠశాలలో తొలినాళ్లలో సమాజంలో, ఇంట్లో మాట్లాడే భాషలోనే చదువుంటే అభ్యసనా సామర్థ్యాలు ఆరోగ్యకరంగా పిల్లల్లో పెరుగుతాయని శాస్త్రీయ అధ్యయనాలు, మానసిక నిపుణులు చెబుతున్నా కూడా మన పాలకులకు పట్టటం లేదు. ఈ తీరును మన జాతీయోద్యమ నిర్మాతలు, రాజ్యాంగ సారథి అంబేద్కర్ లాంటి వారు ఊహించి కూడా ఉండరు.

భారతదేశానికి రాబోయే స్వరాజ్యం ఎలా ఉండాలో చెబుతూ, ఆ క్రమంలో మాతృభాష ప్రాధాన్యత గురించి కూడా 1916లో బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఇచ్చిన చరిత్రాత్మక ప్రసంగంలో మహాత్మాగాంధీ స్పష్టంగా, నిర్మొహమాటంగా ఇలా వివరించారు: "మన భాషలంటే మనల్ని మనం సమీక్షించుకోవటం. అత్యుత్తమ ఆలోచనల్ని వ్యక్తం చేసే శక్తి మన భాషలకు లేదు అంటే.. మనం ఎంత త్వరగా మనుగడను కోల్పోతే మనకు అంత మంచిది అంటాను. కొంతమంది పూణె ప్రొఫెసర్లతో సన్నిహితంగా మాట్లాడే సదవకాశం నాకు లభించింది. ఇంగ్లీష్ భాష ద్వారా పరిజ్ఞానాన్ని పెంచుకున్న ప్రతి భారతీయ యువతా తన జీవితంలో కనీసం ఆరు విలువైన సంవత్సరాలను కోల్పోయినట్టని వారు నాకు తేల్చిచెప్పారు. మన స్కూళ్లలో, కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యతో ఆ సంవత్సరాలను గుణించండి. ఎన్ని వేల సంవత్సరాలను ఈ దేశం కోల్పోయిందో మీకే అర్థమవుతుంది. 'చొరవ లేదు' అన్నది మన మీదున్న ఆరోపణ. మన జీవితంలో విలువైన సంవత్సరాలను ఒక విదేశీ భాషలో ప్రావీణ్యం సంపాదించుకోవటానికే




వెచ్చిస్తుంటే.. మనకు చొరవ ఎలా వస్తుంది? ఈ ప్రయత్నంలో కూడా మనం విఫలమయ్యాం. ఇంగ్లీష్ చదువున్న భారతీయులే ముందున్నారు, నాయకత్వం వహిస్తున్నారు, దేశానికి అన్ని పనులు చేస్తున్నారు.. అని చెప్పుకోవటం నేను విన్నాను. అలాకాకుండా ఇంకోలా అయితే భయంకర ఉపద్రవమేనన్నమాట! మనకు అందుతున్న చదువు.. ఆంగ్ల విద్య మాత్రమే. కచ్చితంగా దాని పట్ల మనం ఎంతోకొంత సానుకూలంగా స్పందించాలి. కానీ ఒక్కసారి ఊహించండి– గత యాభై ఏళ్లుగా మన స్థానిక భాషల్లో మనకు చదువు అందుతుందనుకోండి, ఇప్పుడు ఎలా ఉండేవాళ్లం? మనకు ఎన్ని సమకూరేవి?.. మనకు స్వతంత్ర భారతదేశం ఉండేది, చదువుకున్న స్వదేశీయులుండేవారు, సొంత దేశంలోనే విదేశీయుల్లా కాకుండా భారతదేశ అంతరాత్మతో మాట్లాడుతుండేవాళ్లం. అలాంటి స్వదేశీ విద్యావంతులు అత్యంత నిరుపేదల మధ్య పనిచేస్తుండేవారు. ఈ యాభై ఏళ్లలో వారు సాధించింది దేశ వారసత్వ సంపదగా ఉండేది. ఈవేళ మన భార్యలు కూడా మన అత్యుత్తమ ఆలోచనలో

## పౌష్టిక రసగుళికలు పోతనవారి పద్యాలు

సహజ కవి బమ్మెర పోతన భాగవతానువాదంగా రాసిన ఈ పద్యం తెలుగు మాధుర్యానికి, మార్దవానికి, దృశ్యీకరణ శక్తికి అద్దం పడుతుంది. అంతేనా, అభ్యుదయానికి పట్టం కడుతుంది. నలుపును మన దేశంలోనే కాదు, ప్రపంచమంతటా వివక్షతో చూసేవారున్నారు. పాశ్చాత్య దేశాల్లో వర్ణ వివక్ష ఒక రకంగా ఉంటే, కుల వివక్ష ఉన్న మన దేశంలో నలుపు పట్ల చిన్నచూపు మరో రకంగా ఉంది. సొంత కులంలో పెళ్లి చేసుకోవాలన్నా పిల్ల, పిల్లాడు నలుపా, తెలుపా అనేది ఇప్పటికీ పెద్ద అంశమే. మనకు నచ్చనిదాన్ని, దొంగపనుల్ని, మోసాల్ని నలుపుగా చెప్పటం పరిపాటి. కానీ రాముడ్ని, కృష్ణుడ్ని వర్ణించేటప్పుడు పోతన వారి నల్లరంగునే మొదట కీర్తించారు. బ్లాక్ నాటోన్లీ మేటర్స్, బట్ గ్రేటర్ అనే రీతిలో.. నలుపు తర్వాతే మిగతా లక్షణాల్ని, గుణాల్ని వర్ణించారు.

రాముడ్ని ప్రార్థించే ఈ పద్యం చూడండి:

**"నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు**
**మహాశుగంబులన్**
**విల్లును దాల్చువాఁడు గడు విప్పగు వక్షము గలవాఁడు మేలుపైఁ**
**జల్లెడువాఁడు నిక్కిన భుజంబులవాఁడు యశంబు దిక్కులం**
**జల్లెడువాఁడు నైన రఘుసత్తముఁడిచ్చుత మా కభీష్టముల్"**

**నాణ్యమైన ఆలోచనలు, జీవనం విలువ తెలిసినవారు మురికిగుంటలాంటి భావాల జోలికి ఎందుకు వెళతారు?.. అని మరో కాలాతీత భావాన్ని రసరమ్యంగా చాటిన ఈ తెలుగు ధార కూడా పోతన వారి భాగవతం లోనిదే..**

**"మందార మకరంద మాధుర్యమునదేలు**
**మధుపంబు పోవునే మదనములకు**
**నిర్మల మందాకినీ వీచికల దూగు**
**రాయంచ చనునే తరంగిణులకు**
**లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు**
**కోయిల చేరునే కుటజములకు**
**పూర్ణేందు చంద్రికా స్ఫురిత**
**చాకోరకంబరుగునే సాంద్రనీహారములకు**
**అంబుజోదర దివ్యపాదారవింద**
**చింతనామృత పానవిశేషమత్త**
**చిత్తమేరీతి నిరతంబు జేరునేర్చు వినుత**
**గుణశీల మాటలు వేయనేల!"**

భాగస్వాములు కాలేకపోతున్నారు. ప్రొఫెసర్ బోస్, ప్రొఫెసర్ రే ని చూడండి. వారి పరిశోధనలు సామాన్య ప్రజల ఉమ్మడి ఆస్తి కాకపోవటం అవమానకరం కాదా?".. అని గాంధీజీ అన్నారు.

ప్రపంచీకరణ మొదలయ్యాక తెలుగు ప్రాభవం క్షీణత వేగం పుంజుకుంది. పోటీ ప్రపంచం మధ్య తెలుగు భాషాపరిరక్షణలో మనం వెలవెలపోయాం. మారిన పరిస్థితులకనుగుణంగా శాస్త్ర, సాంకేతిక, సమాచార అవసరాలకు తగ్గట్టు తెలుగులో పదాలు కూడా కరువయ్యాయి. తెలుగు భాష ఇప్పటికీ నిలబడి ఉందంటే, అది పత్రికలు తదితర మాధ్యమాలు, సామాన్య ప్రజల వల్లే. ఉత్తరాంధ్ర,

## సోషల్ మీడియాకు ఇంతకంటే గొప్ప గైడ్‌లైన్స్ ఉంటాయా?

ఏది నిజమో, ఏది అబద్ధమో, ఏది ప్రధానమో, ఏది అప్రధానమో తెలుసుకునే లోగా మనల్ని విషయాలు ముంచెత్తే సోషల్ మీడియా యుగానికి కూడా తగ్గ ఈ తెలుగు పద్యం శతాబ్దాల కిందటిది. ఆధునిక సామాజిక మాధ్యమాలకు ఇంతకంటే మెరుగైన గైడ్‌లైన్స్ ఏముంటాయి. గమనించండి:

**"వినదగు నెవ్వరు చెప్పిన**
**వినినంతనె వేగపడక వివరింపదగున్**
**కనికల్ల నిజము తెలిసిన**
**మనుజుడెపో, నీతిపరుడు మహిలో సుమతీ!"**

.. **"ఉప్పుగప్పురంబు నొక్కపోలికనుండు చూడచూడ రుచుల జాడవేరు.."** అనే వేమన పద్యాన్ని కూడా ఇదే సందర్భంలో చెప్పుకోవచ్చు.

## విజ్ఞానం చమత్కారంగా

వారాల పేర్లను, సాగు సంగతులు, ఆహారపు అలవాట్లతో కలిపి చెప్పే చక్కని చమత్కారపు తెలుగు పద్యమిది:

**"ఆదివారం నాడు అరటి మొలచింది**
**సోమవారం నాడు సుడివేసి పెరిగింది**
**మంగళవారం నాడు మారాకు తొడిగింది**
**బుధవారం నాడు పొట్టిగెల వేసింది**
**గురువారం నాడు గుబురులో దాగింది**
**శుక్రవారం నాడు చూడగా పండింది**
**శనివారం నాడు చకచకా గెలకోసి**
**అందరికీ పంచితిమి అరటి అత్తములు**
**అబ్బాయి అమ్మాయి అరటి పండ్లివిగో"**

రాయలసీమ, తెలంగాణ, దక్షిణ కోస్తాంధ్రల యాసల్లో తేడా ఉన్నా, ఆ ప్రాంతాల్లోనూ అనేక ఉపయాసలున్నా తెలుగును వారే బతికిస్తున్నారు. త్రిలింగ, తెలింగ, తెనుగు, తెలుగు, ఆంధ్ర, తెలంగాణ.. పేరేదైనా అవి తెలుగు భాషను, తెలుగువారు నివసించే ప్రాంతాల్ని సూచించేవే. ఎల్లలు లేని భాషగా పరిపుష్టమైన తెలుగుకున్న సహజ శక్తి వల్లే మాట్లాడే భాషగా అది దేశంలోని ఇతర రాష్ట్రాల్లో, ప్రపంచవ్యాప్తంగానూ ఇంకా గుర్తింపు గల స్థాయిలోనే కొనసాగుతూ ఉంది. కానీ తెలుగుభాష భవిష్యత్తుపై అనుమానాలు మాత్రం పెరుగుతున్నాయి తప్ప తగ్గటం లేదు.

ఇంతకుముందే చెప్పుకున్నట్లు.. తెలుగు అంతరించిపోదుగానీ, మనం ఏమాత్రం ప్రయత్నం చేయకుండా ఉదాసీనంగానే వ్యవహరిస్తే మాట్లాడేవారి సంఖ్య తగ్గటంతోపాటు కేవలం కొన్ని సందర్భాల్లో మాట్లాడే భాషగానే పరిమితమయ్యే ప్రమాదముంది. ఇంగ్లీషులో తెలుగును ఎక్కువగా కంపోజ్ చేసే తరం వల్ల, తెలుగు రాయటం ఇంకా తగ్గిపోతుంది. పాఠశాల విద్యలో మాతృభాష ప్రాధాన్యతను తగ్గిస్తే, పైచదువుల్లో ఉపాధికి అవసరమైన రంగాల్లో తెలుగు పదాలు కొరవడితే తెలుగు చదవటం కూడా తగ్గిపోతుంది. దేశంలోని అత్యధికులు సంభాషించే మాతృభాషల్లో తెలుగు ఇప్పటికే మూడోస్థానం నుంచి నాలుగో స్థానానికి పడిపోయింది. తెలుగు స్థానాన్ని మరాఠీ భర్తీ చేసి మూడో స్థానానికి చేరుకుంది. 2011 జనాభా గణనలో దేశంలోని మాతృభాషల వివరాలను బట్టి.. ప్రస్తుతం దేశ జనాభాలో 96.71 శాతం మంది రాజ్యాంగం గుర్తించిన 22 భాషల్లో ఏదో ఒక దాన్ని తమ మాతృభాషగా నమోదు చేసుకున్నారు. మిగతా 3.29 శాతం మంది ఇతర భాషలను ఎంపిక చేసుకున్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 7.19 శాతం మంది తెలుగును తమ మాతృభాషగా ఎంచుకోగా 2011 నాటికి ఈ సంఖ్య 6.93 శాతాని (08,11,27,740)కి తగ్గింది. మరాఠీ మాతృభాషగా ఎంపిక చేసుకున్నవారు 7.09 శాతానికి పెరిగారు. తెలుగు మాట్లాడేవారు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఎక్కువగా ఉన్నారు.

కేవలం గతమెంతో ఘనకీర్తి ఉండటం వల్ల తెలుగు వైభవ పరిరక్షణ సాధ్యం కాదు. వేల ఏళ్ల చరిత్ర ఉన్నప్పటికీ, శాశ్వత భావాలకు నెలవైనప్పటికీ, దేవభాష అయినప్పటికీ సంస్కృత భాష పరిమితమైపోయిందని మనం గుర్తించాలి. వాస్తవానికి ఉదాత్త భావాల్ని అనేకం తొలిదశలో తెలుగుకు కూడా అందించిన భాష సంస్కృతం! తెలుగు, నన్నయల ప్రత్యేకతలు ఉట్టిపడుతున్నప్పటికీ మహాభారతం సంస్కృత మూలం నుంచే వచ్చి తెలుగునాట ఇంటింటి కావ్యమైంది. సంస్కృతం నుంచి వేలాది పదాలు తెలుగు సహా ఇతర భాషల్లోకి వచ్చి చేరాయి. అయినా కూడా సంస్కృతం ప్రజల రోజువారీ వినియోగ భాష కాకపోవటం వల్ల మ్యూజియం భాష స్థాయికి క్షీణించిపోయింది. అందుకే తెలుగుకు పునరుజ్జీవనం సాధించటానికి కేవలం రొమాంటిసిజంతో కాకుండా.. వాస్తవిక దృష్టితో నిర్మాణాత్మక ప్రయత్నం చేయాలి. వేల ఏళ్ల చరిత్ర కలిగి సార్వజనీన, సార్వకాలీన భావాలకభాండాగారంగా ఘనకీర్తిని సొంతం చేసుకున్న తెలుగు నిరంతరం వెలగటానికి.. ప్రతి తరం మాతృభాషకు చెయ్యెత్తి జైకొట్టేలా భాష ప్రజాస్వామిక విస్తరణ బహుముఖంగా జరుగుతుండాలి. మా తాతలు నేతులు తాగారు, మా మూతులు వాసన చూడండి.. అంటే కాలం నవ్వి ముందుకు సాగిపోతుంది. కాలానుగుణంగా మారగల, ప్రజల సృజనాత్మకతను, ఇతర భాషల పదాల్ని ఇముడ్చుకోగల సామర్థ్యాన్ని ప్రదర్శిస్తుంటేనే తెలుగు తన అర్హతకు తగ్గట్టు కాలాతీత భాషగా వెలుగొంద గలుగుతుంది.

మనకు ఇంగ్లీషు పట్ల ఆసక్తికి ఉపాధి అవకాశాలతోపాటు దోహదం చేసే ఇంకో అంశం.. ఆ భాషలో అందుబాటులో ఉన్న సమాచారం, భావాలు! ఎంత సంక్లిష్ట భావాన్నయినా వ్యక్తం చేయగలిగిన రీతిలో ఇంగ్లీషులో భాషాభివృద్ధి ఉంది. ఇంగ్లీషు నుంచి తెలుగులోకి గతంలో గొప్ప అనువాదాలు జరిగాయి. తెలుగు మాతృక, ఇంగ్లీషే అనువాదం అనిపించేలా ఆ తర్జుమాలు జరిగాయి. కానీ శాస్త్ర సాంకేతిక రంగాల విస్తరణ, ప్రపంచీకరణతో ఎదురయ్యే సంక్లిష్టతలకు మన భాష సన్నద్ధం కాకపోవటం వల్ల క్రమంగా తెలుగు అనువాదాలు పలు సందర్భాల్లో పేలవంగా, అసమగ్రంగా ఉంటున్నాయి. ఉన్నత విద్యకు సంబంధించిన అంశాలను అలా ఉంచి, సాహిత్య రచనల్నే తీసుకున్నా.. ఏ ప్రక్రియలోనైనా వీటి అనువాదంలో తెలుగు నేటివిటీని తేవాలని ప్రయత్నించినప్పుడు ఇంగ్లీషు మాతృకలోని టోన్ సంతృప్తికరంగా ఉండటం లేదు. ఇంగ్లీషు నుంచి యథాతథంగా చేస్తే కృతకంగా, ఎబ్బెట్టుగా అనిపిస్తోంది. ఏ భాష నుంచైనా ఇలాంటి అనువాద సమస్యల్ని

### కూనలమ్మ పదాలు

అండం నుంచి బ్రహ్మాండం వరకు
తెలుగుకున్న శక్తిని ఎంత సామాన్యమైనరీతిలో
తెలియచెబుతున్నాయి ఆరుద్రవారి కూనలమ్మ పదాలు:

**"ఇజము నెరిగినవాడు నిజము చెప్పనినాడు ప్రజలకు జరుగును కీడు ఓ కూనలమ్మ"**

**"కూరుచుండిన కొమ్మ కొట్టుకొను వాజ్జమ్మ హితము వినదు కదమ్మ ఓ కూనలమ్మ"**

**"నిజము నిలువని నీడ నీతి యన్నది చూడ గాజు మెంకుల గోడ ఓ కూనలమ్మ"**

**"చెప్పి దేవుని పేరు చెడుపు చేసెడి వారు ఏల సుఖపడతారు ఓ కూనలమ్మ"**

### కాచివడపోసిన జీవిత పాఠాలు మన తెలుగు సామెతలు

**ఎన్నో భావాల్ని, అనుభవాల్ని, తరతరాల సాంస్కృతిక ధోరణుల్ని హాస్య రసంతో కాచివడపోసిన జీవిత పాఠాలు మన తెలుగు సామెతలు. ఛాందస భావాలతో అవిద్యను పెంచి పోషించిన సమాజంలో అత్యధిక సంఖ్యాక ప్రజల నాల్కలపై నానుతూ జ్ఞాన గుళికల్లా వారి రోజువారీ జీవితానికి ఇవి దిశానిర్దేశాలంటే అతిశయోక్తి కాదు:**

**"ఇచ్చే వాడిని చూస్తే చచ్చేవాడైనా లేస్తాడట".. ఈ సామెత వింటే ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రజల జీవితాలతో చెలగాట మాడుతున్న మన నేతల అనుచిత తాత్కాలిక తాయిలాలు గుర్తుకురావడంలా!**

**"అయ్యవారిని చేయబోతే కోతి అయినట్లు".. ఈ రస గుళికను వింటే, మన చట్టసభల్లో విధానాల రూపకల్పన, వాటిని పాలనా యంత్రాంగం అమలు చేసే తీరు స్ఫురిస్తోంది కదూ!**

**ఇలా అసంఖ్యాకంలో ఇంకొన్ని..**

**"మొగుడ్ని కొట్టి మొగసాలకెక్కినట్లు.."**

**"తల్లికి గంజి పోయనివాడు పినతల్లికి చీర పెడతానన్నట్లు.."**

**"తోటివాడు తొడ కోసుకున్నాడని మనం మెడ కోసుకున్నట్లు.."**

**"మాంసం తిన్నామని బొమికలు మెడలో వేసుకుంటామా.."**

**"కుడుములు మింగేవాడికి అప్పడాలు ఒక లెక్కా.."**

**వీటితోపాటు తమాషా ప్రశ్నలు, పొడుపు కథలు, మాటల్లో కిటుకులు లాంటి చమక్కులు తెలుగులో కోకొల్లలు.**

పరిష్కరించేలా తెలుగు భాషాభివృద్ధి ఉండాలి. తెలుగు నుంచి ఇంగ్లీషులోకి అనువాదం చేసేటప్పుడు ఇలాంటి సమస్య తలెత్తదా? అనే గడుసు ప్రశ్నే ఉత్పన్నం కావటం లేదు. తెలుగు నుంచి అనువాదాల్ని చదవాలనే ఉత్సాహాన్ని ఇతర భాషల్లో వారికి రేకెత్తించేలా మనం సారస్వతాన్ని సృష్టించటం లేదు.

అన్ని రకాల రచనల్నీ స్థూలంగా సాహిత్యం అనుకుంటే.. తెలుగులో మంచి సాహిత్యం పుట్టాలంటే సామాజిక, రాజకీయపరమైన సంస్కరణల భావజాలం పెరగాలి. మనలో ప్రజాస్వామీకరణ భావాలు పరిణతి చెంది, రాజకీయాలు, పాలన, సమాజం వంటి ఉమ్మడి అంశాలలో సంఘటితంగా పనిచేసే శక్తి పెరగకుంటే సాహిత్యం పరిమితమైపోయి మొక్కుబడిగా తయారవుతుంది. ఉమ్మడి లక్ష్యాలు సాహిత్యాన్ని, భాషను ప్రజల సంపదగా ఎదిగేలా చేస్తాయి. రాజులు, భూస్వాముల కాలంలో ఉత్పత్తి అయ్యే సాహిత్యం ఎంత గొప్పగా రాసినా అందులోని విషయానికి పరిమితి ఉంటుంది. అదే ప్రజల నుంచి తీసుకుంటే విషయం అపరిమితం, అనంతంగా కొనసాగుతుంటుంది. 'తెల్లోడి పాలన పోయి మన దేశానికి స్వాతంత్ర్యం వస్తే మన కానిస్టేబుల్ పీడవిరగడవుతుందా?' అని గాంధీగారు రాకముందే గురజాడ 'కన్యాశుల్కం'లో ఒక పాత్ర అడిగిన ప్రశ్న.. స్వాతంత్ర్యం వచ్చినా ఇంకా మనకు సురాజ్యం రాలేదని వర్తమానంలో చేస్తున్న హెచ్చరికలాగానే ఉంటుంది. ఇలాంటి ప్రజాస్వామిక సంస్కరణ భావాలున్నప్పుడే ఏ ప్రక్రియలో చెప్పినా, ఇతర భాషల నుంచి దిగుమతి చేసుకోవటం, అనుకరించటమేకాకుండా సొంత భావాల్ని వ్యక్తం చేసే శక్తిగా తెలుగు ఎదుగుతుంది. కేవలం అనువాదమే అయితే తెలుగు మెషీన్ భాషగా, మనం మాట్లాడుకునే భాషగానే జారుడుమెట్లపై మిగులుతుంది. సరైన భావజాలంతో కూడిన సాహిత్యం వస్తుంటే.. భాషను పరిపుష్టం చేస్తూ, దిశానిర్దేశం చేస్తూ విస్తృతం చేస్తుంటుంది. అందుకే విషయ పరిజ్ఞానమున్న, ప్రజల్లోకి వారి వారి ఇంగితజ్ఞానం స్థాయిలోనే కొత్త కోణాల్ని, భావాల్ని ఇంకించగలిగే పుస్తకాలు తెలుగులో వచ్చేలా మనం ప్రోత్సహించాలి. ఆన్‌లైన్‌లోనో, ఆఫ్‌లైన్‌లోనో వాటిలో కొన్నిటినైనా చదవాల్సిన అవసరం తమకుందని ప్రతి ఇల్లూ అనుకునేలా చేయాలి. తర్జుమా ద్వారా వాటి కోసం ప్రపంచం ఎదురుచూసేలా చేయాలి. మానవ తర్జుమాకు సాటిరాకపోయినా, ఎంతోకొంత ప్రామాణికంగా పుస్తకాల్ని ప్రపంచ భాషల్లోకి అనువదించే సాఫ్ట్‌వేర్ ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. సాంకేతికతను కూడా తెలుగువారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. కానీ భాషకు పటిమనిచ్చే సరకు తెలుగు పుస్తకాల్లో కనిపించటం కీలకం. ఈ మార్కెట్ డిమాండ్‌ను సృష్టించటం తెలుగు భాష పునరుజ్జీవనానికి ఎంతో కీలకం. ఆధునిక అవసరాలకనుగుణంగా తెలుగు పదాలతో నిఘంటువుల్ని రూపొందించి ఇతర భాషల నుంచి కూడా రచనలు తెలుగులోకి విరివిగా వచ్చేలా చేయాలి. ఇందుకో వ్యవస్థను ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంలో ఏర్పాటు చేసి నిష్ణాతులు దీర్ఘకాలిక కృషి చేసే వనరుల్ని అందించాలి. మరోవైపు, గ్రంథాలయాల్ని ఆధునీకరించి యువతకు నైపుణ్యాల శిక్షణ, వలంటీర్లుగా సామాజిక సేవా కార్యక్రమాలతో అనుసంధానమయ్యే అవకాశాలు వంటి వాటితో బహుముఖంగా, బహుళ ప్రయోజనకరంగా విస్తరించాలి.


కరోనాలాంటి విపత్తు వచ్చినప్పుడు తెలుగు భాష పట్ల మనకున్న ఆర్తి, తెలుగు భాషకున్న శక్తి ఒక సంకేతంలా బయటికొచ్చాయి. అది వ్యవస్థీకృతంగా నిలదొక్కుకోవాలంటే, పెద్దలిచ్చిన సాహితీ నిధిని మనం ఆచరణాత్మకంగా, సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించుకుంటూ డిజిటల్ పౌరసత్వానికి తగ్గట్లు తెలుగుకు పునరుజ్జీవనం కలిగించాలి. మనం ఉదాసీనతను వీడి నిర్మాణాత్మక క్రియాశీలతను ప్రదర్శిస్తే చాలు.. కాలాతీతంగా సమగ్ర మానవ జీవితాన్ని వ్యక్తం చేయగల తెలుగుభాష తేలిగ్గా పునరుజ్జీవనం పొందుతుంది, తరగని పెన్నిధిగా మన భవిష్యత్ తరాల సొంతమవుతుంది. ఎల్లలు లేని తెలుగు - ఎప్పటికీ వెలుగు.. ఇది వట్టి ఆకాంక్ష కాదు, మన ఆచరణతో ముడిపడిన అక్షర సత్యం.

# గాంధీజీ, కాపీరైట్

1909లో గాంధీ తన తొలి పుస్తకం 'హింద్ స్వరాజ్'ను ప్రచురించినప్పుడు, ఆ పుస్తక ముఖచిత్రంపై 'నో రైట్స్ రిజర్వ్‌డ్' (పుస్తక హక్కులు అందరివీ) అని ఉన్నది. ఆ దశలో కాపీరైట్‌ను గాంధీజీ విశ్వసించేవారు కాదు. ఆ తరువాత ఆయన కాపీరైట్‌పై ఒక ఆచరణీయ వైఖరిని పెంపొందించుకున్నారని న్యాయశాస్త్ర పండితుడు శ్యామ్‌కృష్ణ బాల్‌గణేష్ తన వ్యాసం 'గాంధీ అండ్ కాపీరైట్ ప్రాగ్మాటిజమ్' (కాలిఫోర్నియా లా రివ్యూ, 2013)లో పేర్కొన్నారు.

ప్రచురణకర్త ఆర్.ఇ హాకిన్స్ ఒక అసాధారణ వ్యక్తి. ఎవరికీ, ముఖ్యంగా ఈ తరానికి, అంతగా తెలియని ఈ ఆంగ్లేయుడు భారతదేశాన్ని తన స్వగృహంగా చేసుకున్నారు. ఢిల్లీలోని ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేయడానికి ఆయన 1930లో మన దేశానికి వచ్చారు. సహాయ నిరాకరణోద్యమ కాలంలో ఆ పాఠశాల మూతపడింది. హాకిన్స్, ముంబయిలోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ (ఓయూపీ)లో చేరారు. 1937లో జనరల్ మేనేజర్ అయ్యారు. దరిమిలా మూడు దశాబ్దాలపాటు ఓయూపీ భారతీయ ప్రచురణలను విజయవంతంగా, లాభదాయకంగా నిర్వహించారు. పాఠ్యగ్రంథాలు, నిఘంటువులతోపాటు సలీమ్ అలీ, వెర్రియర్ ఎల్విన్, జిమ్ కోర్బెట్ మొదలైన రచయితల పుస్తకాలను ఆయన ప్రచురించారు.

మహాత్మాగాంధీని హాకిన్స్ ప్రగాఢంగా అభిమానించేవారు. ముంబయికి వెళ్లిన తరువాత ఆయన పూర్తిగా ఖద్దరు దుస్తులే ధరించసాగారు. బాల బాలికల కోసం గాంధీజీ ఆత్మకథ సంక్షిప్త ప్రతిని రూపొందించేందుకు మహాదేవ్ దేశాయి (మహాత్ముని కార్యదర్శి)ని ప్రేరేపించారు. గాంధీ, హాకిన్స్‌ల మధ్య నడిచిన కొన్ని ఉత్తర ప్రత్యుత్తరాలు నా దృష్టికి వచ్చాయి. అవి చాలా ఆసక్తికరమైన లేఖలు. క్విట్ ఇండియా ఉద్యమానికి శంఖారావం పూరించిన గాంధీజీని అరెస్ట్ చేసి పూణేకు తరలించినప్పుడు హాకిన్స్ ముంబయిలో ఉన్నారు. ఐరోపాలో ద్వితీయ ప్రపంచ యుద్ధం ఉధృతంగా సాగుతున్న కాలమది. బ్రిటిష్ పత్రికలు గాంధీని అపఖ్యాతిపాలు చేయడానికి సకల విధాల ప్రయత్నించాయి. బ్రిటిష్ పత్రికల ఈ ధోరణి హాకిన్స్‌కు మనస్తాపం కలిగించింది. మహాత్ముడు, ఆయన భావాల గురించి వాస్తవాలు తెలియజేయడానికై ఆయన రచనల సంకలనం నొకదాన్ని తీసుకురావడానికి హాకిన్స్



సంకల్పించారు.

1909లో గాంధీ తన తొలి పుస్తకం 'హింద్ స్వరాజ్'ను ప్రచురించినప్పుడు, ఆ పుస్తక ముఖచిత్రంపై 'నో రైట్స్ రిజర్వ్‌డ్' (పుస్తక హక్కులు అందరివీ) అని ఉన్నది. ఆ దశలో కాపీరైట్‌ను గాంధీజీ విశ్వసించేవారు కాదు. ఆ తరువాత ఆయన కాపీరైట్‌పై ఒక ఆచరణీయ వైఖరిని పెంపొందించుకున్నారని న్యాయశాస్త్ర పండితుడు శ్యామ్‌కృష్ణ బాల్‌గణేష్ తన వ్యాసం 'గాంధీ అండ్ కాపీరైట్ ప్రాగ్మాటిజమ్' (కాలిఫోర్నియా లా రివ్యూ, 2013)లో పేర్కొన్నారు. 1920వ దశకం తుది సంవత్సరాల నుంచీ గాంధీజీ తన రచనలపై అన్ని హక్కులు పూర్తిగా నవజీవన్ ట్రస్ట్‌కు ఇచ్చి వేయడం జరిగింది. 1943లో గాంధీజీ రచనల సంకలనం నొకదాన్ని తీసుకురావడానికి హాకిన్స్ సంకల్పించినప్పుడు మహాత్ముడు జైలులో ఉన్నారు. ఓయూపీ తీసుకువచ్చే సంకలనానికి మీ రచనలను ఆర్ కె ప్రభు అనే పాత్రికేయుడు ఎంపిక చేస్తారని గాంధీకి రాసిన ఒక లేఖలో హాకిన్స్ పేర్కొన్నారు. హాకిన్స్ లేఖను జైలు అధికారులు గాంధీజీకి చేరనివ్వలేదు. దీంతో ఆయన నవజీవన్ ట్రస్ట్ వారికి రాశారు. అయితే గాంధీ రచనల సంకలనం తీసుకురావడానికి ఓయూపీకి అనుమతినివ్వడానికి నవజీవన్ ట్రస్ట్ నిరాకరించింది. 'కాపీరైట్ అనేది ఒక సహజ అంశం కాదు గనుక తన సంపాదకత్వాన వెలువడే జర్నల్స్‌లో వెలువడే తన రచనలు దేశం ఉమ్మడి ఆస్తి' అని మహాత్మాగాంధీ అన్నారు. ఈ విషయాన్ని నవజీవన్ ట్రస్ట్‌కు

రాసిన లేఖలో హాకిన్స్ ఉటంకించారు. 'గాంధీజీ భావాలు, అభిప్రాయాలను పాశ్చాత్యులకు, ఆయన సొంత దేశస్తులకు విపులంగా తెలియజేసేందుకు ఈ సంకలనాన్ని ఉద్దేశించామని, ప్రస్తుత సందర్భంలో అటువంటి సంకలనం అవసరం చాలా ఉందని తాము భావిస్తున్నామని' హాకిన్స్ రాశారు. అయినప్పటికీ నవజీవన్ ట్రస్ట్ వారు అనుమతి నివ్వలేదు. 1944 మే లో జైలు నుంచి గాంధీజీ విడుదలయ్యారు. మహాదేవ్ దేశాయి మరణించడంతో ప్యారేలాల్ నయ్యర్ మహాత్ముని కార్యదర్శి అయ్యారు. నవజీవన్ ట్రస్ట్‌తో తన ఉత్తర ప్రత్యుత్తరాల ప్రతులను జతచేస్తూ ప్యారేలాల్‌కి హాకిన్స్ ఒక లేఖ రాశారు. 'మహాత్మాగాంధీ తన రచనలకు కాపీరైట్ ఉందని భావిస్తూ, మేము ప్రచురింపదలచిన సంకలనం విషయమై ఏమైనా అభ్యంతరాలు ఉంటే మేము అసలు ఆ పుస్తక ప్రచురణను విరమించుకుంటాము. అయితే తన రచనలపై అందరికీ హక్కులు ఉన్నాయని ఆయన భావించిన పక్షంలో ఆ విషయాన్ని స్పష్టం చేస్తూ ప్రతిపాదిత సంకలనం ప్రచురణకు అనుమతినివ్వాలి. ప్రస్తుత సందర్భంలో ఈ ప్రతిపాదిత సంకలనం అవసరం ఎంతైనా ఉందని మేము భావిస్తున్నాము. ముఖ్యంగా ఇంగ్లాండ్, అమెరికాలలో గాంధీజీ గురించి ఎన్నో తప్పుడు కథనాలు, దురభిప్రాయాలు వ్యాప్తిలో ఉన్నందున ప్రతిపాదిత సంకలనం వాటిని తొలగించగలదని మేము భావిస్తున్నామని' హాకిన్స్ ఆ లేఖలో పేర్కొన్నారు. 1944 జులైలో హాకిన్స్‌కు రాసిన ఒక లేఖలో ప్రతిపాదిత సంకలనాన్ని ఓయూపీవారు ప్రచురించుకోవచ్చని చెప్పారు. అయితే తన రచనలపై నవజీవన్ ట్రస్ట్‌కు గల ప్రచురణ హక్కులను అంగీకరించాలని, ఆ సంస్థకు 100 ప్రతులు ఉచితంగా ఇవ్వాలని, ఆ సంస్థ తన సొంత ఇంగ్లీష్ ఎడిషన్ తీసుకురావడానికి ఆమోదించాలని, ఆ ఇంగ్లీష్ ఎడిషన్‌కు వివిధ భారతీయ భాషలలో జరిగే అనువాదాలపై హక్కులు నవజీవన్ ట్రస్ట్‌కే ఉంటాయని గాంధీజీ స్పష్టం చేశారు. నవజీవన్ ట్రస్ట్ ప్రత్యేక ఇంగ్లీష్ ఎడిషన్ తీసుకురావడానికి ఆమోదించాలనే అభ్యర్థనకు మినహా మిగతా వాటన్నిటికీ హాకిన్స్ అంగీకరించారు. నవజీవన్ ట్రస్ట్ సైతం ఇంగ్లీష్ ఎడిషన్ తీసుకువస్తే తమ ప్రతిపాదిత సంకలనానికి భారతీయ మార్కెట్‌లో అమ్మకాలు ఉండకపోవచ్చని హాకిన్స్ అభిప్రాయపడ్డారు. హాకిన్స్ లేఖకు గాంధీజీ ఇలా ప్రతిస్పందించారు: 'ఆర్ కె ప్రభు ఎంపిక చేసే నా రచనల సంకలనాన్ని మీ ప్రఖ్యాత సంస్థ ప్రచురించడానికి నవజీవన్ ట్రస్ట్, ఆ మాటకొస్తే నేను సైతం ఆమోదించడానికి ఏకైక ప్రేరణ, ఆ రచనలకు భారత్ వెలుపల విస్తృతస్థాయిలో ప్రచారం లభించగలదని భావించడమే. కనుక మీరు నవజీవన్ ట్రస్ట్ వారు చౌక భారతీయ ఎడిషన్‌ను తీసుకురావడాన్ని ఆమోదించి తీరాలి'. 1944 సెప్టెంబర్‌లో గాంధీజీ బొంబాయి వచ్చారు. ప్రచురణకర్త హాకిన్స్, సంకలనకర్త ఆర్ కె ప్రభు ఆయన్ని కలుసుకున్నారు. 'ప్రతిపాదిత సంకలనం ప్రచురణ విషయమై ఏర్పడిన సమస్యకు పరిష్కారం కనుగొనగలిగితే నేను చాలా సంతోషిస్తానని' ఆ సమావేశానికి ముందు వారికి రాసిన లేఖలో గాంధీజీ పేర్కొన్నారు. గాంధీజీతో సమావేశమనంతరం నవజీవన్ ట్రస్ట్ వారికి హాకిన్స్ రాసిన లేఖను బట్టి వారు ఒక పరిష్కారాన్ని కనుగొన్నట్టు విశదమవుతుంది. ఓయూపీ ప్రచురణకర్త ఇలా రాశారు: 'ఈ మధ్యాహ్నం జరిగిన సంభాషణల్లో అంగీకరించిన షరతులకు సంబంధించి మీకు రాయమని గాంధీ కోరారు. ఆ షరతులివి: ఓయూపీ ఎడిషన్ ముద్రించిన ప్రతిసారీ 100 ప్రతులను నవజీవన్ ట్రస్ట్ ఉచితంగా ఇవ్వడం (ప్రతి ముద్రణలోనూ నవజీవన్ ట్రస్ట్ అనుమతితో ప్రచురిస్తున్నట్టు స్పష్టంగా పేర్కొనాలి), నవజీవన్ ట్రస్ట్ వారు తమ సొంత ఇంగ్లీష్ ఎడిషన్‌ను ప్రచురించుకోవడానికి స్వేచ్ఛ ఉంటుంది. ఆ పుస్తకానికి భారతీయ భాషలలో అనువాదాలపై పూర్తి హక్కులు ట్రస్ట్‌కే ఉంటాయి. అయితే అన్ని విదేశీ ఎడిషన్‌లపై ఓయూపీకి మాత్రమే సంపూర్ణ హక్కులు ఉంటాయి'. హాకిన్స్ ఎంతో శ్రద్ధాసక్తులతో తలపెట్టిన గాంధీజీ రచనల సంకలనం అంతిమంగా 1945 మార్చిలో వెలువడింది. 'ది మైండ్ ఆఫ్ మహాత్మాగాంధీ' అన్న సంకలనానికి ఆర్ కె ప్రభు, ఆయన సహచర పాత్రికేయుడు యు.ఆర్ రావులు సంపాదకత్వం వహించారు. హాకిన్స్, గాంధీల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు ఆ ఇరువురి వ్యక్తిత్వాల విశిష్టతకు అద్దం పడతాయి. ఆంగ్ల భాషా ప్రజల దేశాలలో మహాత్మాగాంధీ భావస్రవంతికి మరింత విస్తృత ప్రాచుర్యం కల్పించాలని, ఆయన మహోన్నత వ్యక్తిత్వాన్ని పాశ్చాత్యులకు విపులంగా తెలియజేయాలని హాకిన్స్ చిత్తశుద్ధితో కోరుకున్నారు. అదే సమయంలో తమ సంస్థ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ప్రయోజనాలను పరిరక్షించడానికి ఆయన దృఢవైఖరితో వ్యవహరించారు. తన రచనల సంకలనం ప్రచురణ విషయంలో హాకిన్స్‌ను గాంధీజీ పూర్తిగా విశ్వసించారు. అదే సమయంలో నవజీవన్ ట్రస్ట్ ప్రయోజనాలను ఆయన కాపాడారు. గాంధీజీ మరణించిన అరవై సంవత్సరాల అనంతరం ఆయన రచనలపై కాపీరైట్ గడువు ముగిసింది. 'ది మైండ్ ఆఫ్ మహాత్మాగాంధీ'ని ఇప్పుడు మళ్లీ ప్రచురించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆ పున:ప్రచురణ జాతీయోద్యమ పాత్రికేయులు ఆర్.కె ప్రభు, యు.ఆర్ రావులకు, భారతదేశ ప్రేమికుడు అయిన ఆంగ్లేయుడు ఆర్.ఇ హాకిన్స్‌కు సముచిత నివాళి అవుతుంది.

**(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)**

# గాంధీ వ్యూహాలు.. నేటి తరానికి పెద్ద పాఠాలు: పద్మనాభయ్య


ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ హోదాకు గౌరవం తెచ్చిపెట్టిన కొందరిలో ముఖ్యుడు కె.పద్మనాభయ్య. కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా ఆయన సేవలు ప్రత్యేకం. పోలీసు వ్యవస్థ సంస్కరణలతోపాటు పలు జాతీయ కమిటీల్లో పద్మనాభయ్య పాత్ర ప్రత్యేకమైంది. అందుకే ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2008లో 'పద్మభూషణ్' పురస్కారంతో సత్కరించింది. ప్రస్తుతం పద్మనాభయ్య హైదరాబాద్‌లో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. "గాంధీ ఆలోచనలు, అనుసరించిన ఉద్యమ వ్యూహాలు, ఎత్తుగడలు నేటి తరానికి పాఠాలు" అంటారు ఆయన. మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా బాపూజీ శాంతిపథంపై తన అనుభవాలను, అభిప్రాయాలను ఆయన ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..


## రాజకీయ వ్యవస్థకు వన్నె తెచ్చారు గాంధీ

భారతదేశ రాజకీయ వ్యవస్థకు విలువలను పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మాగాంధీ. ఆయన లేకపోతే విలువలకే విలువ లేదు. నీతి, నిజాయతీ, సత్యాన్వేషణ, నిరాడంబరత, నైతికత వంటి విలువలను బోధించటంతోపాటు ఆచరించిన మహానుభావుడాయన. కేవలం దేశాన్ని మాత్రమే కాదు ప్రపంచాన్నే బాపూజీ మార్చారు. చంపారన్‌లో ఒక్కరు కూడా గాంధీకి తెలియదు. అలాంటి పరిస్థితుల్లో ఆయన అక్కడ ఆంగ్లేయుల దోపిడీకి వ్యతిరేకంగా రైతులను కూడగట్టి ఏడాది పాటు ఉద్యమం చేశారంటే చిన్న విషయం కాదు! తర్వాత ఉప్పు సత్యాగ్రహం చేపట్టారు. బ్రిటీషోళ్లు అనేక రకాల వస్తువులపై పన్ను విధించారు. కానీ ఆయన ఉప్పునే ఎందుకు తీసుకున్నారు? అతిచిన్న వస్తువైన ఉప్పుపై కూడా ఆంగ్లేయులు పన్ను విధించారని ప్రపంచానికి తెలియజేయడం కోసం ఉప్పు సత్యాగ్రహాన్ని మహాత్ముడు చేపట్టాడు. అలా సహాయ నిరాకరణోద్యమం, క్విట్ ఇండియా, విదేశీ వస్తు బహిష్కరణ వంటి మహాత్ముడు చేపట్టిన ప్రతి ఉద్యమంలోనూ గాంధీజీ అవలంబించిన వ్యూహాలు, ఎత్తుగడు అసాధారణమైనవి. ఆయన్ను 'జాతిపిత' అని ఊరికే అనలేదు. వాటిని నేటి తరం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. నేను ప్రత్యేకంగా ఎంబీఏ తదితర అడ్మినిస్ట్రేటివ్ విద్యార్థులకు మహాత్ముడు చేపట్టిన ఉద్యమ రీతులను అధ్యయనం చేయాల్సిందిగా సూచిస్తుంటాను.

## నా ఆచరణ..

ఒక ఐఏఎస్ అధికారిగా నా విధి నిర్వహణలో చాలామటుకు





గాంధీ సిద్ధాంతాలను ఇముడ్చుకున్నాననే అనుకుంటున్నాను. ఒక పాలసీని రూపొందించే సమయంలోనూ కామన్ మ్యాన్ గురించి ఆలోచించాలనే మహాత్ముడు బోధించిన సూత్రాన్ని నేను పాటించాను. హోంశాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న రోజుల్లో.. సామాన్యుల పట్ల పోలీసుల ప్రవర్తనలో కొన్ని మార్పులు తీసుకొచ్చేందుకు పనిచేశాను. ప్రతి వ్యక్తి అవసరాలకు సరిపడా వనరులను ప్రకృతి అందిస్తుంది. అంతేకానీ, ప్రతి వ్యక్తి దురాశకు సరిపడా వనరులను మాత్రం అందించలేదు అని గాంధీజీ ఆనాడే చెప్పారు. ఆ మాటల్ని పాటించాను.

నేను నాగాలాండ్‌లోనూ కొంతకాలం పనిచేశాను. అప్పుడు అక్కడ నాగా నేషనల్ మూవ్‌మెంట్ పెద్దఎత్తున జరుగుతోంది. ఆ ఉద్యమాన్ని అణచివేసేందుకు ఆర్మీని ఆశ్రయించాం. అయినా పరిస్థితి సద్దుమణగలేదు. చివరికి పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో నేను జోక్యం చేసుకుని మహాత్మాగాంధీ ఉపదేశించిన శాంతియుత మార్గంలో సమస్యను పరిష్కరించేందుకు పూనుకున్నాను. సామరస్య వాతావరణంలో స్థానిక ఉద్యమకారులతో చర్చలు జరిపాను. అందులో నా అభిప్రాయాలను చెప్పడం మాత్రమే కాకుండా, వాళ్లు చెప్పిన మాటలను వినడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాను. అలా 1996 నుంచి 2009 వరకు ఈ అంశం మీద పనిచేశాను. తుదకు విజయం సాధించాను. నాగా సమస్యకు అంతిమ పరిష్కారం అయితే ఇంకా అందలేదు. కానీ, ఘర్షణ వాతావరణాన్ని నిలువరించ గలిగాను. అందుకు కారణం నేను గాంధీ సిద్ధాంతాల ద్వారా సమస్యను హ్యాండిల్ చేయడమే! తర్వాత నన్ను చాలామంది 'మీ విజయ రహస్యం' ఏంటీ అనడిగారు. అందుకు నేను చెప్పిన సమాధానం శాంతియుతంగా చర్చించడం, అవతలవాళ్లు చెప్పేది వినడం, అంతకన్నా ఎక్కువగా సహనం కలిగిఉండటం అని. నాగాలాండ్‌లో శాంతిని నెలకొల్పేందుకు అక్కడ ఆశ్రమం నెలకొల్పిన గాంధీ శిష్యుడు నట్వర్ థక్కర్ సహాయం తీసుకున్నాను. నేటికీ గాంధీ మార్గం అనుసరణీయం అనడానికి ఇదొక ఉదాహరణ.

డాక్టర్ తుర్లపాటి కుటుంబరావు

# అంబేద్కర్ - గాంధీ - రాజ్యాంగ రచన

**'రాజ్యాంగ రచన పూర్తి కాకుండానే గాంధీజీ మృతి చెందడం దురదృష్టం. ఆయన జీవితాంతం పోరాడిన అస్పృశ్యతను మన రాజ్యాంగంలో శిక్షార్హమని పేర్కొనటం, దాన్ని ఆదేశిక సూత్రాలలో చేర్చడం పట్ల ఆయన తన ఆనందాన్ని వ్యక్తం చేశారు' అని డాక్టర్ అంబేద్కర్ అన్నారు.**




డాక్టర్ అంబేద్కర్‌ను నవ భారత రాజ్యాంగ నిర్మాతగా ఆహ్వానించడం అప్పటి ప్రధాని నెహ్రూకు, ఉప ప్రధాని సర్దార్ పటేల్‌కు ఇష్టం లేదంటే ఆశ్చర్యం కలగవచ్చు. వారిద్దరికీ బ్రిటిష్ రాజ్యాంగవేత్త సర్ ఐవర్ జెన్నింగ్స్ అంటే ఇష్టం! ఇద్దరూ కలిసి, ఈ విషయంలో మహాత్మాగాంధీ అభిప్రాయం తెలుసుకోవడానికి వెళ్లారు. వీరి అభిప్రాయం విని, ఆయన విస్తుపోయారు. 'మనం బ్రిటిష్ సామ్రాజ్యవాదులను ఈ దేశం నుంచి పంపించివేయడానికి ఒక మహోద్యమమే 'క్విట్ ఇండియా' అంటూ నడిపాం. అలాంటిది మనమిప్పుడు మన భారత రాజ్యాంగ రచనకు ఆ బ్రిటిష్ రాజకీయవేత్తను ఆహ్వానిస్తే, లోకం నవ్విపోదా' అని బాపూజీ అనేసరికి, 'అయితే ఎవరిని ఆహ్వానిద్దాం' అంటూ వారు ఆయనను ఎదురు ప్రశ్నించారు. 'బ్రిటన్‌లో ఉన్నప్పుడు డాక్టర్ అంబేద్కర్ అక్కడి అంతర్జాతీయ లైబ్రరీలో వివిధ దేశాల రాజ్యాంగాలను పుక్కిటపట్టారు. మన దేశీయుడు, హరిజన నాయకుడైన అంబేద్కర్‌ను రాజ్యాంగ రచనకు ఆహ్వానిస్తే మనకు కూడా గౌరవం కదా' అని జాతిపిత అనేసరికి పటేల్, నెహ్రూలిద్దరూ విస్తుపోయారు! అంబేద్కర్ అంటే నెహ్రూకు ఇష్టం లేదు. పటేల్‌కు కూడా. కానీ, ఏమి చేస్తారు? సాక్షాత్తు మహాత్మాగాంధీ ఆదేశమది! అలా నవ భారత రాజ్యాంగాన్ని దళితుల నుంచి వచ్చిన ఒక మహానాయకుడు రచించే అవకాశం మనకు కలిగింది!

1951 సంవత్సరాంతంలో నా జీవితంలో మరపురాని, గర్వకారణమైన సంఘటన ఒకటి జరిగింది. అదే, నవ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌తో ఇంటర్వ్యూ. స్వతంత్ర భారత తొలి ప్రభుత్వంలోని తన న్యాయశాఖ మంత్రి పదవికి కూడా ఆయన రాజీనామా చేశారు. అప్పటిలో తూర్పు గోదావరి జిల్లాలోని రాజోలులో జరుగుతున్న నిమ్నజాతుల మహాసభలో పాల్గొనడానికి వెళు తూ మార్గం మధ్యలో గన్నవరం (కృష్ణా జిల్లా) ట్రావెలర్స్ బంగ్లాలో అంబేద్కర్ ఆగారు. అప్పుడు నేను 'ఆంధ్రపత్రిక' దినపత్రికకు గన్నవరంలో ప్రత్యేక విలేకరిని. నవ భారత రాజ్యాంగ నిర్మాత గన్నవరం వస్తున్నారంటే, ఎక్కడలేని సంచలనం. ఇప్పటి వలె అప్పట్లో తీవ్రమైన భద్రతా ఏర్పాట్లు, పోలీసుల హడావుడి ఏమీ వుండేవి కావు. అందువల్లనే 1951 చివరలో సాక్షాత్తు దేశ ప్రధాని నెహ్రూను విజయవాడ రైల్వే స్టేషన్‌లో సులభంగా కలుసుకుని, స్వయంగా మాట్లాడగలిగాను.

బాబాసాహెబ్‌ను గన్నవరం ట్రావెలర్స్ బంగ్లాలో కలుసుకుని, నన్ను నేను పరిచయం చేసుకున్నాను. నవ భారత రాజ్యాంగాన్ని రచించడంలో ప్రధాన పాత్ర తీసుకున్నందుకు ఆయనను అభినందించగా, ఆయన చిరునవ్వు నవ్వారు. 'మీరు రచించిన రాజ్యాంగం ప్రకారం జరిగే తొలి ఎన్నికల వరకైనా (1952) మీరు కేంద్రంలో న్యాయశాఖ మంత్రిగా ఉంటే బాగుండే'దని నేను అనగా, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన హిందూ కోడ్ బిల్లులో తనకు నచ్చని అంశాలు అనేకం ఉన్నాయని, ఆ విషయంలో ప్రధాని నెహ్రూతో తనకు తీవ్ర విభేదాలు ఏర్పడ్డాయని, అందువల్లనే తాను రాజీనామా చేయవలసి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. 'నవ భారత రాజ్యాంగ రచనా బాధ్యతను మీకు అప్పగించాలని ప్రధాని నెహ్రూకు సూచించిన మహాత్మాగాంధీకి భారతజాతి కృతజ్ఞత చెప్పాలి' అని నేను అనగా, ఆయన చిరునవ్వుతో ఇలా చెప్పారు: 'రాజ్యాంగ రచన పూర్తి కాకుండానే గాంధీజీ మృతి చెందడం దురదృష్టం (స్వాతంత్ర్యం వచ్చిన అయిదున్నర నెలలకే గాంధీజీ హత్య జరిగింది). ఆయన జీవితాంతం పోరాడిన అస్పృశ్యతను మన రాజ్యాంగంలో శిక్షార్హమని పేర్కొనటం, దాన్ని ఆదేశిక సూత్రాలలో చేర్చడం పట్ల ఆయన తన ఆనందాన్ని వ్యక్తం చేశారు' అని డాక్టర్ అంబేద్కర్ అన్నారు (భారత రాజ్యాంగ పరిషత్తు ప్రథమ సమావేశం 1946 డిసెంబర్‌లో జరిగింది. 1947లో ఒక ప్రక్క రాజ్యాంగ రచన జరుగుతుండగానే స్వాతంత్ర్య ప్రదానం కూడా జరిగింది). ఆయన ఇక రాజోలు వెళ్లవలసి వచ్చింది. అందువల్ల ఆయనకు 'థ్యాంక్స్' చెప్పి, నేను వచ్చి వేశాను.

# స్వాతంత్ర్యం పక్కదారి పడుతోందని గాంధీజీ తొలినాళ్లలోనే గుర్తించారు

ఆయన వయస్సు 99 ఏళ్లు. పేరు వి.కల్యాణం. గాంధీజీ చివరి వ్యక్తిగత కార్యదర్శి. మహాత్ముడి 150వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయనతో వివిధ పత్రికల ప్రతినిధులు, ఫ్రీలాన్సర్లు జరిపిన ఇంటర్వ్యూల్లోని కొన్ని అంశాలివి. గాంధీజీని మొదటిసారి కలిసిన తీరు, బాపూ భావాలు, ప్రస్తుత పరిస్థితులపై ఇందులో వెంకిట కల్యాణం స్పందించారు. అవి ఆయన మాటల్లోనే..



మాది సంపన్న కుటుంబమే. ఆంగ్లేయుల హయాంలో మంచి ఉద్యోగం చేస్తున్నా. నా పనులు నేనే స్వయంగా చేసుకుంటా. నిరాడంబర జీవితాన్ని గడపాలనేది నా కోరిక. నాకు గాంధీ ఆశయాలు బాగా నచ్చాయి. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని వారి ఆశ్రమంలో చేరా. అది 1943వ సంవత్సరం అనుకుంటా. జైలుకు వెళ్లిన గాంధీ అనారోగ్యానికి గురయ్యారు. ఆంగ్లేయుల వైద్య పరీక్షలకు సహకరించలేదు. అందువల్లే ఆయన్ను విడుదల చేశారు. ఆశ్రమానికి వచ్చిన గాంధీకి ఎవరూ తోడు లేరు. ఎందుకంటే ఆయనతో ఉన్న వారందరినీ జైల్లో బంధించారు. అప్పుడే ఆయనతో మాట్లాడే అవకాశం లభించింది.

'క్లర్కుగా నీకు ఎంత జీతం ఇచ్చేవారు?' అని బాపూ అడిగారు. రూ.250 అని చెప్పాను. 'నేనంత ఇవ్వలేను. నెలకు రూ.60 అయితే చెల్లించగలను' అన్నారు. 'నాకు అది కూడా వద్దు. మూడు పూటలా అన్నం పెట్టి, తలదాచుకోడానికి కాస్తంత జాగా ఇస్తే చాలు' అన్నాను. అలా గాంధీజీ వ్యక్తిగత కార్యదర్శిగా చేరా. వార్ధాలోని సేవాగ్రామ్‌లో అడుగుపెట్టేసరికి నా వయసు 21 ఏళ్లు.

## ఆంగ్లేయుల విధానాలను తప్పుపట్టలేదు

వాస్తవానికి గాంధీ ఏనాడూ ఆంగ్లేయుల పాలనా విధానాన్ని తప్పుబట్టలేదు. 'వెరీగుడ్ అడ్మినిస్ట్రేషన్' అని బ్రిటీష్‌వారిని అభినందించేవారు. పలువురు ఆంగ్లేయులు కూడా ఆయనతో స్నేహపూర్వకంగా మెలిగేవారు, గౌరవించేవారు. అయితే తెల్లదొరలకు ప్రత్యామ్నాయంగా, స్వపరిపాలన చేసుకోవాలన్నదే గాంధీజీ లక్ష్యం. ఎందుకంటే దేశంలోని గ్రామాల్లో విద్యుత్, రోడ్లు లేవు. టెలిఫోన్, టెలిగ్రామ్, వైద్య సౌకర్యాలు లేవు. గ్రామంలో ఎవరికైనా జబ్బులొస్తే.. టౌనుకు వచ్చి చికిత్స పొందాలంటే నడిచిరావాలి. లేదంటే ఎద్దులబండిలో రావాలి. అతను ఆస్పత్రికి చేరుకునేందుకు ఇంకో రెండు రోజులవుతుంది. ఇంతలో చనిపోతాడు. ఇలాంటి ఎన్నో సమస్యల పరిష్కారానికి స్వపరిపాలన చాలా ముఖ్యమని ఆయన పోరాడారు. గ్రామాల్లో సదుపాయాలను కల్పించాలని కంకణం కట్టుకున్నారు. కానీ ఇప్పుడు దేశంలో అవినీతి పెచ్చుమీరింది. అర్ధరాత్రి కాదు కదా, నేడు పగటిపూటే మహిళలు వీధుల్లో తిరగలేని పరిస్థితి. ఇన్నేళ్ల స్వాతంత్ర్యంలో మౌలిక వసతులకు నోచుకోని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. విద్య, వైద్యం సంతలో సరుకుల్లా కొనుక్కోవాల్సిన దుస్థితి. అందుకే నాకు ఇప్పుడు ఆంగ్లేయుల పాలనే బాగుంది అనిపిస్తుంది. పరిపాలన విషయంలో బ్రిటిషర్లు చాలా ఆదర్శనీయులు. వాళ్లు చట్టాలను కఠినంగా అమలు చేసేవారు.

## దేశ విభజనను గాంధీజీ వ్యతిరేకించారు

దేశ విభజనను బాపూజీ తీవ్రంగా వ్యతిరేకించారు. తొలుత మహమ్మద్ అలీ జిన్నాను ప్రధానిని చేయాలని ఆయన ప్రతిపాదించారు కూడా. గాంధీ కోరిన విధంగా జిన్నా ప్రధాని అయివుంటే నేడు భారతదేశం ప్రశాంతతకు నిలయంగా ఉండేది.

## ఈ ఘోరాల్ని చూడలేకపోతున్నా.. నన్ను తీసుకెళ్లిపో అని ప్రార్థించేవారు

గాంధీ చెప్పిన విషయాల్లో దేన్నీ స్వతంత్ర భారత పాలకులు పాటించలేదు. అందువల్లే ఆయన తట్టుకోలేకపోయారు. దయచేసి నన్ను వీరి నుంచి తీసుకెళ్లిపో అని దేవుని

ప్రార్థించేవారు కూడా. చివరిరోజుల్లో ఈ సమాజాన్ని చూసి చాలా ఆవేదన పడ్డారు. మనం పొందిన స్వాతంత్ర్యం పక్కదారి పడుతోందని చింతించారు. ఇప్పుడాయన బతికే ఉంటే చాలా బాధపడేవారు.

### జీతాలు తగ్గించమన్నారు

స్వాతంత్ర్యం వచ్చాక గ్రామాల్లో వసతులు కల్పించడానికి ఆర్థికపరమైన సమస్య ఎదురైంది. ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు ఉద్యోగుల జీతాలను తగ్గించమని గాంధీ చెప్పారు. దాన్ని ఆచరించలేదు. ఓ పేదవాడు తన కష్టాలను మరిచిపోయేందుకు తాగడం మొదలుపెట్టాడు. దీంతో అతని కుటుంబం నడిరోడ్డున పడింది. ఉన్న డబ్బు పోయింది. ఆ కుటుంబం ఆకలితో అల మటించి పోయింది. ఇతన్ని గాంధీ నిశితంగా పరిశీలించారు. గుర్రపు పందేలు, లాటరీ టికెట్లు మరింత దారుణ పరిస్థితికి నెట్టాయి. వాటిని ఆనాడే గాంధీ ఆపేయమని చెప్పారు.

అప్పట్లో ప్రజాప్రతినిధులకు నెలకు రూ.400 జీతం ఇవ్వమని గాంధీ చెప్పారు. ఇప్పుడు ఇస్తున్నది రూ.4,00,000 పైగానే! అంతేకాకుండా వీరికి ఉచిత ఇల్లు, కరెంటు, ఇన్సూరెన్సు, వైద్యం.. ఇలా అంతా ఉచితమే. ఇంతకీ, వాళ్లు ఏం సాధించారని? ఇక్కడ చెన్నైలో నేనుంటున్న కార్పొరేషన్‌లో ఎంతోమంది పారిశుద్ధ్య కార్మికులున్నారు. వారు ఈ వీధిని సరిగ్గా శుభ్రం చేయరు. ప్రతిరోజూ నా వీధిని నేనే శుభ్రం చేస్తా. తెల్లవారుజామున 3 గంటల నుంచి ఈ ప్రాంతాన్ని నేనే ఊడుస్తా. దాదాపు 80 సంవత్సరాలుగా, గాంధీ వద్ద చేరకముందు నుంచి ఇలా చేస్తున్నా. స్వచ్ఛభారత్‌ను నేను 1947లోనే ఆరంభించా! అప్పట్లోనే నెహ్రూ నాకు ఎంపీ పదవి ఇస్తానన్నా తిరస్కరించా.

### దేశం కోసం కడుపుకట్టుకుని సైతం..

గాంధీ ఉప్పు లేకుండా ఎన్నో రోజులపాటు భోజనం చేశారు. ఆయన బీన్స్, కాలీఫ్లవర్ వంటివి తినేవారు కాదు. ఎప్పుడూ గుమ్మడికాయ కూరే. ఇదంతా ఆయన దేశం కోసం చేసిందే. తన కోసం కాదు. చాలా పేద కుటుంబాలు తమ పిల్లలను చదివించలేని స్థితిలో ఉన్నాయని తెలుసుకున్న ఆయన తన నలుగురు పిల్లలనూ పాఠశాలకు పంపలేదు. ఆశ్రమంలోనే పెంచారు.

### నెహ్రూ ఆనాడే అడ్డుకోవాల్సింది

ఓసారి నెహ్రూ వద్దకు ఓ ఎంపీ వెళ్లి.. 'సార్, అవినీతి ప్రారంభమవుతోంది. మన ప్రజాప్రతినిధి అవినీతికి పాల్పడుతున్నారు. ఎందుకు చర్య తీసుకోరు' అని అడిగారు. అందుకు నెహ్రూ.. 'ఎవరూ ఆ చిన్న అవినీతిని పట్టించుకోవడం లేదు. మీరూ పట్టించుకోకండి' అని అన్నారు. 'సార్.. అవినీతి చిన్నదైనా, అది పెరుగుతూనే ఉంటుంద'ని చెప్పి వెళ్లిపోయారు. నెహ్రూ నిజాయితీపరుడే. కానీ ఆయన హయాంలో జరిగే ఆ తప్పును ఆరంభంలోనే తుంచివేసుంటే ఇప్పుడు అవినీతి, అక్రమాలు ఇలా మహావృక్షంలా మారేవి కావు. 1947 నవంబర్‌లో ఢిల్లీకి వచ్చినప్పుడు వందలాది ఫిర్యాదులు గాంధీకి వచ్చాయి. ప్రజాప్రతినిధులు, మంత్రులు దౌర్జన్యం చేస్తున్నారని, అవినీతికి పాల్పడుతున్నారని వాటి ద్వారా విన్నవించుకున్నారు. కానీ గాంధీ మాటలను అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదు. ప్రజల సొమ్మును దుబారా చేయవద్దని ఆయన గట్టిగా సూచించారు. సుపరిపాలన కోసం బాపూ సూచించిన ప్రతి సలహానూ ఆనాటి నేతలు బుట్టదాఖలు చేశారు. దేశం ఆయన్ను అప్పుడే పక్కనబెట్టేసింది.

### గాడ్సే దేశభక్తుడే కావచ్చు కానీ..

గాడ్సే దేశభక్తుడే కావచ్చు కానీ, హిందూత్వవాది. భారతదేశంలో కేవలం హిందువులే ఉండాలనేది అతని అభిమతం. బాపూజీ మాత్రం హిందు, ముస్లిం, క్రైస్తవులంతా అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని గాఢంగా కోరుకున్నారు. ఈశ్వర్, అల్లా, జీసస్ అంతా ఒక్కడే అని విశ్వసించారు. మనుషులుగా మనమంతా ఒక్కటే అని పిలుపునిచ్చారు. గాడ్సే తొలి హత్యాప్రయత్నంలోనే గాంధీని చంపలేదు. అంతకుముందు ఐదుసార్లు మహాత్ముడిపై హత్యాయత్నం జరిగింది. అయితే, అవన్నీ విఫలమయ్యాయి. ఆ ఘాతుకాలకు ఒడిగట్టినవారంతా గాడ్సే బృందానికి చెందినవారే. గాంధీజీ హత్య జరిగినప్పుడు అక్కడే ఉన్నాను. మహాత్ముడు నేలకొరిగేప్పుడు 'హే రాం' అన్నాడనేది నిజం కాదు.

### గాంధీ విలువల్ని వదిలేసి ఉత్సవాలపై హడావుడి

సత్యశోధన, అహింస, నిజాయతీ వంటి విలువలకు ప్రతిరూపంగా నిలిచిన మహాత్మాగాంధీని భారతదేశం ఏనాడో మర్చిపోయింది. ఈ ఏడాది మహాత్ముడి 150వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుతామని ప్రభుత్వాలు హడావుడి చేస్తున్నాయి. నిజంగా బాపూజీపై అంత ప్రేమ ఉంటే, ఈ డెబ్భై ఏళ్లూ పాలకులు ఏం చేసినట్లు? బాపూజీ పాటించిన విలువలను ఒక్క నాయకుడైనా ఆచరిస్తున్నాడా? దురదృష్టవశాత్తూ స్వాతంత్ర్యానంతరం కొలువుదీరిన ప్రభుత్వాలన్నీ సమర్థమైన పాలనను అందించలేకపోయాయి.

### యువతలో ఆలోచన పెరగాలి

ఈ ప్రజాస్వామ్య దేశంలో చదువుకున్నవారు ఓటు వేసేందుకు ముందుకు రావడం లేదు. ఓటు వేయడాన్ని కర్తవ్యంగా భావించడం లేదు. కొందరు ఓటు వేస్తున్నారే తప్ప తమ భవిష్యత్తును ఆలోచించడం లేదు. అందువల్లే చదువుకున్న ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు వేయాలి. యువత సమాజం గురించి ఆలోచించాలి. ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారో గమనించాలి.

✦

# బాపూని సరిగ్గా అర్థం చేసుకుంటే, సంఘటితంగా పోరాడితే.. మన జాతికి పట్టిన పీడని తొలగించటం చిటికెలో పని

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

గాంధీ జయంతి రోజున ఆనవాయితీగా నేతలు రాజ్‌ఘాట్‌ను దర్శించారు. బాపూజీకి నివాళి అర్పించారు. అంతటితో తృప్తిపడి మళ్లీ వచ్చే ఏడాదిదాకా రోజూ తమ నిర్ణయాల ద్వారా, చేష్టల ద్వారా బాపూను హత్య చేస్తుంటారు. 1947లో స్వతంత్రం వచ్చిన రోజున బాపూ రాజధానిలో సంబరాలలో పాలుపంచుకోలేదు. ఎక్కడో 1500 కిలోమీటర్ల దూరంలో కలకత్తాలో బాధాసర్పదష్టుల ఆర్తిని పంచుకున్నారాయన. అధికారం మార్పిడి జరిగిందని రాజకీయులు చిందులేస్తుంటే, నిజమైన స్వతంత్రం రాలేదని వాపోయారాయన. ఇటీవల ఓ విందులో ఓ మాజీ క్యాబినెట్ కార్యదర్శి ఒక ఉదం తం చెప్పారు. 1996-97లో దేవెగౌడ ప్రభుత్వంలో గుజ్రాల్ విదేశాంగ మంత్రిగా పని చేశారు. ఆ రోజులలో ఆయన తమ్ముణ్ని విద్యుత్‌శాఖ అధికా రులు అదేపనిగా వేధించారట. లంచం ఇవ్వకపోతే విద్యుత్ ఎక్కువగా వాడుకున్నట్లు చూపుతామని బెదిరించారు. మీటరులో చూపినదాన్ని బట్టి బిల్లు వేసేటప్పుడు ఇంకా వినియోగంలో ఎక్కువ తక్కువలేమున్నాయని ఆయన అమాయకంగా అడిగాడట! "ఏముందీ, మీటరును కావాలని చెడగొట్టారని, విద్యుత్తును చౌర్యం చేస్తున్నారని కేసు బనాయిస్తాం, నేరస్తుడిగా చిత్రించి మీ భరతం పడతాం" అని ఆయనకు గీతోపదేశం చేశారట! సరే- అన్న గారు కేంద్రంలో పలుకుబడిగల మంత్రి గదా అని గుజ్రాల్‌ను శరణు వేడుకున్నారట ఆయన. అయినా సాక్షాత్తు కేంద్రమంత్రి ఏమీ చేయలేక చతికిల బడ్డారట! ఆ తరవాత ప్రధానమంత్రిగా ఆయనే 5 నిమిషాలలో ఐదో వేతన సంఘం నివేదికను కేంద్రమంత్రివర్గంతో ఆమోదింపజేసి అదే ఉద్యోగుల జీతభత్యాలను పెంచారనుకోండి! అది వేరే సంగతి.



### స్వాతంత్ర్య ఫలాలు ఎవరికి?

స్వతంత్ర ఫలాలు కేవలం నాలుగు వర్గాలకు మాత్రమే అందాయి. మొదటిది, అధికారాన్ని చేతబట్టి దాన్ని తమ అహంకారాన్ని తృప్తిపరచుకోవటానికి, అందినంత మేరకు దోచుకోవటానికి అలవాటుపడ్డ రాజకీయవేత్తలకు. ఒకసారి రాజకీయంలో ఓ మెట్టెక్కితే ఇక డబ్బును గురించి భయమే అక్కరలేదు! బీదరికంలో ఉన్న నేతలుగాని, డబ్బును గురించి, తమ పిల్లల భవిష్యత్తును గురించి ఆలోచించే అవసరం ఉన్న నాయకులుగాని చాలా అరుదు. నిజాయతీగా రాజకీయం నడిపే వారున్నారు. కాని ఉన్నకొద్దికీ వారి పాత్ర తెరమరుగైపోతున్నది. కోట్లు సంపాదించి లక్షల్ని ఓట్ల కోసం ఖర్చుచేయకపోతే దద్దమ్మలుగా, దేనికీ పనికిరానివాళ్లుగా మిగిలిపోతున్నారు. అలాగే మంత్రుల అట్టహాసాలకు, అధికార దర్పానికి అంతులేదు. 25 సంవత్సరాల క్రితం ముఖ్యమంత్రులు కూడా కేవలం ఒక్క కారుతో ప్రయాణం చేసేవారు. వెనక, ముందు హడావుడి ఉండేది కాదు. ఇప్పుడో మంత్రి వెళుతున్నారంటే ఎంతో కోలాహలం, అట్టహాసం. ఇక ముఖ్యమంత్రయితే ఓ మహారాజు కిందే లెక్క. వీళ్లకు ఓట్లు వేసి గద్దె మీద కూర్చోబెట్టిన పౌరులు ఈ నేతలకు చీమలలాగా, పురుగుల లాగా కనిపిస్తారు. ఇక స్వతంత్రం వల్ల లబ్ధి పొందిన రెండో వర్గం ప్రభుత్వోద్యోగ వర్గం. 1947 నాటికి ప్రభుత్వోద్యోగం అంటే ఎంతో భయం, గౌరవం, పరపతి ఉండేవి. వలస పాలన వల్ల, తెల్లవాడంటే ఉన్న అసాధారణ భయభక్తుల వల్ల, శతాబ్దాల పర్యంతం కొనసాగిన భావదాస్యం వల్ల, అధికారానికి దాసోహమనే సంస్కృతి వల్ల, 'ప్రభుత్వోద్యోగి' అనగానే వల్లమాలిన గౌరవం ఆనాటికే ఉంది. గత 53 సంవత్సరాలలో మన పాలకుల నిర్వాకం పుణ్యమా అని ప్రభుత్వోద్యోగ యంత్రాంగం మరింత బలపడింది. పూర్వం అంతటి భక్తి, గౌరవం తగ్గి ఉండవచ్చు. కాని భయం పెరిగింది. పాలకులు దేశంలో అక్షరజ్ఞానం పెరగకుడా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. దేశ జనాభాలో కేవలం 2.74 శాతం మాత్రమే నెల జీతం పుచ్చుకునే ఉద్యోగులు కావటం వల్ల, నూటికి 92 మంది అవ్యవస్థీకృత రంగంలో పనిచేస్తూ రెక్కాడితేగాని డొక్కాడని స్థితిలో ఉండటం వల్ల 'ఉద్యోగి' అనగానే అపారమయిన హోదా వచ్చింది. ఆ ఉద్యోగమే ఇంకా వలస వాసనలు వీడని సర్కారులో అయితే ఇక వారి విలాసం చెప్పనక్కరలేదు. దానికితోడు సమాజానికి మంచి చేయటం చేతకాని, లేదా ఇష్టం లేని నాయకులు ప్రజలను చేయిచాచి అర్థించే యాచకులుగా మార్చారు. ప్రజల స్థాయిని, విద్యను, సంపద సృష్టించే శక్తిని పెంచలేని ప్రభుత్వాలు ప్రజాధనంలో కొంతభాగం దోచుకుని, ఏదోవిధంగా ఓట్ల వేటలో జనాకర్షణ కోసం కొంత భాగాన్ని మళ్లీ అదే ప్రజలకు దానమిస్తున్నట్లుగా నటించటం ప్రారంభించాయి. దాంతో ఉద్యోగిది ఇచ్చే చెయ్యి, పౌరుడిది పుచ్చుకునే చెయ్యి అయిపోయింది. యజమాని కావలసిన పౌరుడు బానిసగా మారాడు, సేవకుడు కావలసిన ఉద్యోగి పల్లకీ ఎక్కి కూర్చున్నాడు! ఇలా ఉద్యోగవర్గం ప్రాముఖ్యం మరింత పెరిగింది. అందుకే ప్రభుత్వోద్యోగాలంటే ప్రపంచంలో ఎక్కడాలేని గిరాకీ మన దేశంలో ఉంది. ఎన్నో దేశాలలో ప్రభుత్వంలో పనిచేయాలన్నా, రాజకీయంలోకి వెళ్లాలన్నా వ్యక్తిగత జీవనంలో ఎన్నో కోల్పోవాలి. అక్కడ ఓ ప్రభుత్వాధికారి ఓ చిన్న వ్యాపారి కన్నా, ఓ డాక్టరు కన్నా, ఓ ప్రైవేట్ కంపెనీలో మేనేజర్ కన్నా ఏ రకంగానూ ప్రత్యేక వ్యక్తి కాదు. మనకు ఉన్నతాధికారి అంటే దివి నుంచి భువికి దిగివచ్చిన దేవతామూర్తి! ఇక ఈ 50 ఏళ్లలో బలపడిన మూడో వర్గం ప్రభుత్వంతో లావాదేవీలలో లాభపడిన సంపన్నులు. ఓ దేశం ప్రగతి పథాన నడవాలంటే సంపదను సృష్టించి, ప్రజల అవసరాలను తీర్చటానికి వస్తువులను, సేవలను ఉత్పత్తి చేసేవారు కావాలి. ఆ విధంగా నిజమైన సంపద సృష్టించి, నాణ్యమయిన

వస్తువులను చౌకగా అందించి, తాము లాభపడి సంపన్నులయితే సమాజం లాభపడుతుంది. అలాకాక ప్రభుత్వంవారి అధికార దుర్వినియోగం పుణ్యమా అని, అన్ని ఆర్థిక అధికారాలు 40 ఏళ్లకిపైగా ప్రభుత్వం గుప్పిట్లో పెట్టుకున్న కారణాన, డబ్బు పెద్దఎత్తున సంపాదించాలంటే శక్తిసామర్థ్యాలు కాక ప్రభుత్వం అండ చాలామందికి అవసరమయింది. కాంట్రాక్టులు, టెండర్లు, లైసెన్సులు, పర్మిట్లు- ఇలా ఏ చిన్న విషయమయినా సరే ప్రభుత్వ ప్రమేయం లేకుండా నిర్ణయించటం అసాధ్యమయింది. ఏ వ్యాపారంలోనైనా సరే మనుగడ సాగించాలంటే పాలకుల అడుగులకు మడుగులొత్తాలి, పైవాళ్ల కనుసన్నలలో మెలగాలి, వాళ్ల రాజకీయ వ్యూహానికి వత్తాసు పలకాలి, వాళ్ల ఓట్ల వేటకు నోట్ల కట్టలనిచ్చి సహకరించాలి. లేదంటే, సొంత కాళ్ల మీద నిలబడి వ్యాపారాన్నో, పరిశ్రమనో నడుపుతానంటే ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కోవలసిందే. అదృష్టవశాత్తూ ఎందరో నిజాయతీగా, ఆత్మగౌరవంతో, పాలకుల ముందు తలవంచకుండా సంపద సృష్టించారు, ఈ దేశాన్ని నిలబెట్టారు. కాని మరెందరో ప్రభుత్వాల నియంత్రణ వల్ల, అంతులేని అవినీతి వల్ల బలయిపోయారు. అధికారంలో ఉన్నవాళ్ల ప్రాపకం పొందిన వాళ్లు కోటీశ్వరులయ్యారు. సంపద సృష్టించకుండా డబ్బు సంపాదించుకున్నారు. అనార్జిత విత్తాన్ని గాంధీజీ పాపంగా భావించారు. సంపద సృష్టించి డబ్బు సంపాదించటం దేశభక్తికి నిదర్శనం. కాని ప్రజాధనాన్ని దోచుకోవటంలో తోడుదొంగలవటం, ఆరోగ్యమైన పోటీ లేకుండా గుత్తాధిపత్యాన్ని నిలుపుకోవటం, అధికార ప్రాపకంతో నిలవటం, లంచంతో వ్యాపారం పెంచుకోవటం జాతిని నిర్వీర్యం చేస్తాయి. దాని పర్యవసానం సామాన్యుల దోపిడీ, బీదల కడగండ్లు, అవసరానికి దొరకని వస్తువులు, సరిగా అందని సేవలు, నాణ్యతలేని సామాగ్రి, అధిక ధరలు - ఇవన్నీ ఇన్నేళ్లుగా ప్రజలకు రోజువారీ అనుభవాలే.

ఇక స్వతంత్ర భారతంలో బలపడిన నాలుగో వర్గం- వీధి గూండాలు. దేశంలో చట్టబద్ధపాలన పూర్తిగా కరవయిపోయింది. తెల్లవాళ్ల పాలనలో ఎన్ని లోపాలున్నా చట్టప్రకారం పనులు జరుగుతాయనే విశ్వాసం ఉండేది. చట్టానికి ఎవరూ అతీతులుకారనే భయం ఉండేది. అందుకే గాంధీజీకి శిక్ష వేసే మేజిస్ట్రేటు- "నేను చట్టానికి బందీని కాబట్టి, మీరు చేసింది చట్టరీత్యా నేరం కాబట్టి, విధిలేక మీకు శిక్ష వేస్తున్నాను. కాని ప్రభుత్వం సత్యాసత్యాలను గుర్తించి, ఈ చట్టంలోని లోపాలను అర్థం చేసుకుని, మీ శిక్షను మాఫీ చేస్తే నాకంటే సంతోషించే వ్యక్తి ఉండడు" అని ధైర్యంగా అనగలిగారు! ఉగ్రవాదానికి పాల్పడ్డ వాళ్లను కూడా 'ఎన్‌కౌంటర్' పేరుతో ఆనాడు పెడరెక్కలు విరిచి బందీలుగా కాల్చి చంపలేదు. భగత్‌సింగ్ లాంటి వాళ్లను కూడా కోర్టు ముందు పెట్టి సాక్ష్యాలు చూపి, తమ చట్టం దృష్టిలో నేరస్తుడిగా నిరూపించి ఉరి తీశారు. ఆ చట్టాలు వలస పాలనను పోషించేవన్న మాట వాస్తవం. 'చట్టబద్ధ పాలన' అనేది నాగరికతకు మూలం అని వలస పాలకులు కూడా అంగీకరించవలసి వచ్చింది. అందుకే కేవలం లక్షమందిలోపున్న తెల్లవాళ్లు ఈ దేశాన్ని ఎంతో ప్రశాంతంగా పాలించగలిగారు. కాని మన నల్లదొరల పాలనలో బడితె ఉన్నవాడిదే బర్రె అయిపోయింది. పాలన వ్యవస్థలో న్యాయం జరుగుతుందన్న విశ్వాసం కాలక్రమేణా అంతరించింది. రాజకీయాధికారం, లేకపోతే లంచం, అదీ లేకపోతే కండబలం - ఇవే ఏ పని కావాలన్నా మార్గాలయ్యాయి. కోర్టుల్లో న్యాయం కావాలంటే లక్షల ఖర్చు, ఏళ్ల తరబడి పడిగాపులు తప్పవు. రాజ్యాంగంలో విస్పష్టంగా పేర్కొన్న విధుల నిర్వహణకే అవరోధాలు లెక్కకుమించి ఉన్నాయి. 'పంచాయతీ ఎన్నికలు విధిగా గడువులోనే జరిపితీరాలి' అని రాజ్యాంగం నిర్దేశిస్తే దాన్ని ఉల్లంఘించటానికి ప్రభుత్వాలకు ఏ రకమైన సిగ్గు, తలవంపు లేవు. రాజ్యాంగ విరుద్ధమయిన ఆర్డినెన్సులను నివారించటానికి గవర్నర్లకు ఎలాంటి ధైర్యం, చిత్తశుద్ధి లేవు. ఒక్క క్షణంలో చూసి నిర్దిష్టంగా ఆదేశం ఇవ్వవలసిన అంశంలో నెలల తరబడి జాప్యం చేసి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కటానికి అత్యున్నత న్యాయస్థానానికి ఎలాంటి బెరుకూ లేదు! అలాంటప్పుడు రోజువారీ జీవనంలో సామాన్యుడికి చట్టబద్ధ పాలన, న్యాయం అందటం ఎంత కష్టమో ప్రత్యేకంగా వివరించనక్కర లేదు. అందుకే సామాన్యుడు గూండాల చేతుల్లో చిక్కుకుని గిజగిజ వణికిపోతున్నాడు. గూండాలు న్యాయ నిర్ణేతలయ్యారు, కోట్లకు పడగలెత్తారు, చట్టాన్ని శాసిస్తున్నారు, రాజకీయాన్ని నడుపుతున్నారు, పదవులెక్కుతున్నారు, జాతి జవజీవాలను హరిస్తున్నారు.

## జాతికి పట్టిన పీడ


ఇలా స్వతంత్రం నిర్వీర్యమయిపోయింది. బాపూ నిర్వచనం ప్రకారం నిజమైన స్వరాజ్యమంటే కేవలం కొద్దిమంది 'పెద్దలు' గద్దెనెక్కి అధికారం చెలాయించటం కాదు.. లక్షలమంది సామాన్యులు ఆ అధికార దుర్వినియోగాన్ని ఎదిరించే శక్తిని సంతరించుకోవటం! కాని వాస్తవం మనల్ని వెక్కిరిస్తోంది. బాపూ దృష్టిలో పాలకులు ఏం చేసినా అత్యంత దీనస్థితిలో ఉన్న సామాన్యుడు తన కాళ్ల మీద తాను నిలబడే శక్తి రావాలి, అతడి కన్నీళ్లు తుడవగలగాలి, అతనికి తన జీవితం మీద పట్టు పెరగాలి, అతడో వ్యక్తిగా, హుందాగా బతకగలగాలి. నేటి పరాధీనత బాపూ ఆశలని వమ్ము చేసింది. నిజంగా బాపూను స్మరించే అర్హత మన నేతలకు ఉండాలంటే ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఐదేళ్లకో, అంతకంటే తరచుగానో వచ్చే ఎన్నికలలో తాత్కాలిక ఆవేశానికో, భ్రమలకో, ప్రచారానికో, డబ్బుకో, కుల మత వివక్షలకో లొంగిపోయి ఓట్లు వేయటమే ప్రజాస్వామ్యంగా భావిస్తే ఆ ఉదాసీనత జాతిని పతనం చేస్తుంది. ఓసారి మనం ఓట్లతో గద్దెనెక్కించాక ఐదేళ్లదాకా జరిగే దోపిడీకి, అన్యాయానికి, అవమానానికి మౌనంగా తలవంచటం, లేదా కసికొద్దీ హింసకు, హత్యాకాండలకు పాల్పడటం స్వతంత్రం కాజాలదు. ప్రస్తుతం మన వ్యవస్థలో స్వతంత్రం పేరుతో జరుగుతున్నది చట్టబద్ధ నిరంకుశత్వం, ప్రజాస్వామ్యం పేరుతో జరుగుతున్నది రాజ్యాంగబద్ధ దోపిడీ. ఈ నిరంకుశత్వాన్ని, దోపిడీని అంతం చేయాలంటే నిజమైన స్వతంత్రం కోసం పోరాడాలి. అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రజలను ప్రభువులుగా చేయాలి, ఎన్నికలను సమూలంగా సంస్కరించి నిజాయతీపరులు అధికారాన్ని చేపట్టేలా, మంచి చేసి జనహితం పెంచేలా చర్యలు చేపట్టాలి, పాలనలో దాపరికాన్ని తొలగించి ప్రజలకు సమాచారం అందేలా ఏర్పాటు చేయాలి, పాలకులను ప్రజలకు జవాబుదారిగా చేయాలి. అది నిజంగా బాపూజీకి అర్పించే ఘనమైన నివాళి. పాలన అంటే రాచరికం కాదు. ప్రజాస్వామ్యంలో పాలకులు ఖర్చు చేసి ప్రజల డబ్బును.. వినియోగించేది ప్రజలిచ్చే అధికారాన్ని.. పనిచేయవలసింది ప్రజలకు సేవలుకుగా! కానీ పిల్లి కళ్లు మూసుకుంటే ఎలుక పాలు తాగి వెక్కిరించి మరీ పోతుంది. ఆ తప్పు ఎలుకది కాదు, కళ్లు మూసుకున్న పిల్లిది. ఇప్పటికైనా కళ్లు తెరిస్తే, నిజంగా బాపూ జీవితాన్ని, ఆయన సందేశాన్ని అర్థం చేసుకుంటే, సంఘటితంగా, పరిజ్ఞానంతో నిలదీస్తే, మన జాతికి పట్టిన పీడని తొలగించటం చిటికెలో పని.

**(21వ శతాబ్దపు మొట్టమొదటి గాంధీ జయంతి రోజున జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా ఈనాడులో ప్రచురితమైన వ్యాసం)**

## సంకెళ్లను తెంచే వ్యవసాయ చట్టాలను వ్యతిరేకించేవారు

# రైతు బాంధవులెలా అవుతారు?: జేపీ సూటి ప్రశ్న

"కొత్త వ్యవసాయ చట్టాలపై జయప్రకాష్ నారాయణ్ చెప్పింది నమ్మక్కర్లేదు, మరొకరు చెప్పిందీ నమ్మక్కర్లేదు. వాస్తవాలు ముఖ్యం. నేను చెప్పేవి వాస్తవాలు అవునా, కాదా? చెప్పండి.. భారతదేశ విస్తీర్ణం ప్రపంచంలో 2.5% మాత్రమే అయినా మన దేశ వ్యవసాయ భూమి ప్రపంచంలో 12%- వాస్తవమా, కాదా? భారతదేశంలో వ్యవసాయంలో ఆదాయం తగ్గిపోతున్నది- వాస్తవమా, కాదా? భారతదేశంలో ప్రభుత్వ జోక్యం వల్ల మార్కెట్‌లో అతి తక్కువ రేటు రైతులకు వస్తోంది- వాస్తవమా, కాదా? సంకెళ్లు తొలగి 10 మందిలో అమ్మగలిగే అవకాశం ఉంటే ఉన్నంతలో మంచి రేటుకి అమ్ముకునే అవకాశం రైతుకి దొరుకుతుంది. వాస్తవమా, కాదా? విదేశీ వాణిజ్యంలో మనకు చోటులేకపోతే ఇంత పెద్ద దేశంలో మన రైతులు నష్టపోతున్నారు. వాస్తవమా, కాదా? ఒక్కసారి మన మత్స్యపరిశ్రమను చూడండి. చేపల పరిశ్రమలో కూడా




ఒడిదుడుకులుంటుంటాయి. రొయ్యలుగానీ, ఇంకోటిగానీ. కానీ మొత్తం మీద ఎప్పుడైతే ప్రభుత్వ జోక్యం లేదో, అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముకునే అవకాశం ఉందో అప్పుడు పండించిన పంటతో రైతులకు ఎకరాకు 3-4 లక్షల ఆదాయం వస్తుంది. మనం గర్వపడాలా? సంతోషపడాలా? ఈర్ష్యపడాలా? అరె, నాకు రొయ్యలంటే చాలా ఇష్టమండీ, వాడు రూ.10లకు ఇవ్వకుండా రూ.100లకు అమ్ముకుంటున్నాడండీ అని వాడ్ని నాశనం చేయటమే నా లక్ష్యమా? ఎందుకీ నటన ఒక పక్కన రైతు మాట చెబుతూ. రైతుకు మంచి రేటు వచ్చే ఏర్పాటు చెబితే దాన్ని ప్రోత్సహించాలా, మనం వ్యతిరేకించాలా? ఎవరికి నష్టం? రెండవది, రైతుల మీద, గ్రామీణ పేదల మీద ప్రధానంగా భారమేంటో ఒక్కసారి ఆలోచించండి. ఒకపక్క వ్యవసాయంలో రేట్లు రాకపోవటం, ఆదాయాలు హరించటం, చిన్న కమతాలు.. రెండోపక్క విద్య, ఆరోగ్యంలో ప్రభుత్వాల ఘోరవైఫల్యం. పిల్లల చదువుల కోసం నిరుపేదలు వేలకువేలు ప్రతి సంవత్సరం ఖర్చు చేస్తున్నారు. అది ప్రభుత్వం చెయ్యవలసిన పని. మీకు రైతుల మీద ప్రేమ ఉంటే, గ్రామీణ, దళిత ప్రజల మీద మమకారం ఉంటే ఎందుకయ్యా విద్యను, ఆరోగ్యాన్ని అంత దారుణంగా తయారుచేశారు? సిగ్గుందా అని నిలదీయండి. రోజూ నిలదీస్తున్నాను నేను. అదేం లేకుండా సందర్భంలేనివి తీసుకొచ్చి కొత్త వ్యవసాయ చట్టాలపై మాట్లాడుతున్నారు. వ్యవసాయరంగమే భారతదేశంలో ఆర్థిక సమస్యలకు పరిష్కారం కాజాలదు. ఈ చట్టాల వల్ల గ్రామీణ పేదల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని మెడ మీద తలకాయ ఉన్నవాడెవ్వడూ వాదించడు. వీటి వల్ల మార్కెట్‌లో కొంతవరకు రేటు న్యాయంగా అందే ఏర్పాటు జరుగుతుంది. ఎంత జాగ్రత్తగా మాట్లాడుతున్నానో చూడండి.. మార్కెట్‌లో కొంతవరకు రేటు న్యాయంగా అందే ఏర్పాటు జరుగుతుంది, కొంతమేరకు సంకెళ్లు తెగుతాయి. దశాబ్దాల పాపం కొంతమేరకు ప్రక్షాళన అవుతుంది. దక్షిణాఫ్రికా నుంచి గాంధీజీ భారతదేశానికి వచ్చాక జాతీయోద్యమంలో భాగంగా చేసిన మొట్టమొదటి ఉద్యమం చంపారన్ సత్యాగ్రహం. రైతులకు ప్రభుత్వం వేసిన సంకెళ్లు తెంచటానికే గాంధీ గారు ఈ పోరాటం చేశారన్న సోయి అయినా ఉండాలిగా మనకి. వ్యవసాయంలో రిటైల్ చైన్లు సహా ఇంకా చేయాల్సింది ఉంది. కాబట్టి ఈ మార్పులు చాలవు, కానీ ఇవి అవసరం. కాంట్రాక్ట్ వ్యవసాయంతో ఎటువంటి ఆంక్షలు లేని ఉల్లగడ్డలు రైతుకు, వినియోగదారునికి లాభసాటిగా ఉంటే.. ఆంక్షలను అమలు చేస్తున్న ఉల్లిగడ్డల విషయంలో రైతులు, వినియోగదారులూ ఇద్దరూ నష్టపోతున్నారు. కాస్త రేటు పెరగ్గానే నిషేధం విధిస్తూ రైతు నడ్డి విరుస్తున్నారు. వినియోగదారుల్లో డిమాండ్, పెట్టుబడిపై స్పష్టత, నిల్వ సౌకర్యాలు ఉంటే ధరలు నిలకడగా ఉంటాయనేది ఆర్థిక శాస్త్రంలో ప్రాథమిక సూత్రం. ఇది కూడా గుర్తించకుండా గుడ్డిగా వాదించటం రైతులకు, దేశ సామాజిక, ఆర్థిక వ్యవస్థలకు తీవ్ర నష్టం చేయటమే" అని కొత్త వ్యవసాయ చట్టాలపై ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేశారు. ఇటీవల పార్లమెంటు ఆమోదించిన 'వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపార వాణిజ్య ప్రోత్సాహక, సౌకర్యాల కల్పన (స్వేచ్ఛాయుత మార్కెట్), రైతుల సాధికారత, రక్షణ - ధరల హామీ, వ్యవసాయ సేవల ఒప్పందాలు (కాంట్రాక్టు వ్యవసాయం), నిత్యావసర వస్తువుల చట్ట సవరణ (నిల్వలపై పరిమితుల ఎత్తివేత)' చట్టాలపై రకరకాల విమర్శలు, ఆందోళనలు రైతులు, ఇతర ప్రజానీకంలో అయోమయాన్ని పెంచుతున్న నేపథ్యంలో ఆయా అంశాలపై ఓ వీడియో ఇంటర్వ్యూలో జేపీ మాట్లాడారు (సెప్టెంబర్ చివరి వారంలో). స్థూలంగా అందులోని వివరాలు..

**(?) నిజంగా ఈ కొత్త వ్యవసాయ చట్టాలు రైతులకు మేలుచేస్తాయా? నష్టపరుస్తాయా?**

**జేపీ:** లాభనష్టాల్ని చూసేముందు మనం ఇప్పుడు

ఆలోచించాల్సింది.. అసలు మన దేశంలో వ్యవసాయం పరిస్థితేంటి? ప్రపంచంలో ఎనిమిదవ వంతు వ్యవసాయ భూమి భారతదేశంలో ఉంది. దేశంలోని మొత్తం భూమి విస్తీర్ణం తీసుకుంటే, 32 లక్షల 80 వేల చదరపు కిలోమీటర్లు. అడవులు, పట్టణాలు, గ్రామాలు, ఆవాసాలు, నదులు, వంకలు, డొంకలు, సాగు భూమి.. మొత్తం అన్నీ కలిపి. దాన్లో సగం వ్యవసాయ భూమే. నిజానికి సగం కంటే ఎక్కువ ఉంది కొన్ని సందర్భాల్లో. ప్రపంచంలో ఎక్కడా కూడా ఒక పెద్ద దేశంలో సగం వ్యవసాయ భూమి ఉండటమనేది ఊహించటం కూడా సాధ్యం కాదు. అందువల్ల ప్రపంచంలో 2.5% భూమి మాత్రమే అయినా కూడా వ్యవసాయ భూమి ప్రపంచంలో 12% మనది. అమెరికాలో అడపాదడపా మన కంటే ఎక్కువగా, మనతో సమానంగా వ్యవసాయం చేసే భూమి ఉంటుంది. చైనా మన తర్వాత అతిపెద్ద దేశం వ్యవసాయంలో. మనకి 16 కోట్ల హెక్టార్ల భూమి వ్యవసాయంలో ఉంటే, చైనాకి 10 కోట్ల హెక్టార్ల వ్యవసాయ భూమి ఉంది. మనకంటే ఓ 40-50 శాతం తక్కువ. మన భూములు కూడా సారవంతమైనవి. ఉదాహరణకి గంగ వల్ల గానీ, గోదావరి వల్ల గానీ తీరప్రాంతాల్లో చుట్టూ ఒండ్రు మట్టి వగైరాలు శతాబ్దాల పర్యంతం కొట్టుకు వచ్చి సారవంతమైన భూములు ఏర్పడ్డాయి. చక్కటి వర్షపాతం.. కొన్ని సందర్భాల్లో ఒడిదుడుకులున్నా కూడా. ఈ సంవత్సరం చూడండి వర్షపాతం. మరి సంవత్సరం పొడవునా సూర్యకాంతి. చాలా దేశాల్లో సూర్యకాంతి ఉండదు. పంటలు పండించాలంటే కావలసింది సూర్యుడు కదా. వద్దన్నా కూడా ఎండ ఉంది. ఇవన్నీ ఉన్నా కూడా మన స్థానం ఈవేళ ప్రపంచ వ్యవసాయ వాణిజ్యంలో కేవలం 2.3%. ఉదాహరణకి పండ్లు, కూరగాయల్లో ప్రపంచంలో మనం నెంబర్‌వన్, టూ స్థానాల్లో ఉంటాం ఉత్పత్తిలో. కానీ ప్రపంచ మార్కెట్లో మన వాటా, మామిడిపళ్లు కావచ్చు, దానిమ్మ, కూరగాయలు కావచ్చు.. కేవలం 1.7%. అట్లాగే బొప్పాయి ఉత్పత్తిలో ప్రపంచంలో మనమే నెంబర్‌వన్. కానీ ప్రపంచ మార్కెట్‌లో మన స్థానం 3 శాతం. నిమ్మ.. ఉత్పత్తిలో మనం ప్రపంచంలో నెంబర్‌వన్. కానీ ప్రపంచ మార్కెట్‌లో మన స్థానం అరశాతం. 1 శాతంలో సగం. అలాగే ఆరెంజ్. బత్తాయిలు ప్రపంచంలో చాలా పెద్ద మార్కెట్ అయినా, మనం ఉత్పత్తిలో అగ్రగామి అయినా కూడా మన వాటా 0.3%. అంటే 1 శాతంలో మూడోవంతు కంటే తక్కువ. ఎందుకట్లా ఉంది? ఎందుకంటే, రైతుకి మనం సంకెళ్లు విధించాం. ఉత్పత్తి చేస్తున్నా కూడా సంకెళ్లు విధించాం. అమ్ముకునే స్వేచ్ఛ లేదు, నిల్వ చేసుకునే స్వేచ్ఛ లేదు, గిడ్డంగులు లేవు, మౌలిక సదుపాయాలు లేవు, అదనపు విలువ చేకూర్చే ప్రాసెసింగ్ ఇండస్ట్రీ దాదాపు లేదు, కొన్ని సందర్భాల్లో మన కాళ్లకు మనమే సంకెళ్లు వేసుకుని ఎగుమతుల్ని నిషేధించాం మూర్ఖంగా. ఉదాహరణకి ఇప్పుడు ఉల్లిపాయల ఎగుమతుల్ని నిషేధించారు. ఆర్నెల్ల క్రితం ఉల్లిపాయలు కిలో 2 రూపాయలకు అమ్ముడుపోయినై. మనం కూడా హైదరాబాద్‌లో మన ఇళ్ల వద్దే కిలో ఐదు, పది రూపాయలకు కొన్నాం. రైతుకి ఇంత నష్టం వాటిల్లుతున్నా ఒక్క ప్రభుత్వం పట్టించుకోలేదు. గమనించామా? కానీ ఇప్పుడు ఒక్క పదిరూపాయలు ధర పెరిగింది అనగానే, ఉల్లి ఎగుమతుల్ని నిషేధించారు. అంటే మన చట్టాలు, విధానాలు, పద్ధతులు అన్నీ కూడా రైతుల్ని ఎలాగ చావకొట్టాలె, రైతుకు రేటు రాకుండా ఎట్లా చెయ్యాలె, కానీ రైతుకి బంధువులుగా ఎట్లా నటించాలె అనే విధంగానే ఉన్నాయి. మళ్లీ రైతులు ఓట్లు కావాలిగా! ప్రతి పార్టీ, ప్రతి నాయకుడు మేము రైతుపక్షం, నేను రైతుని, రైతు కుటుంబం నుంచి వచ్చాను అని మాటలు.. చేతలన్నీ మాత్రం రైతు వ్యతిరేకమే. నేను గణాంకాలతో చెబుతున్నాను. అలాగే నాకు బాగా గుర్తుంది. 1984 సంవత్సరంలో పత్తి రేటు రూ.600 - 700 నుంచి కాస్త పెరిగి 1000 దాటి వస్తోంది. ఆ రోజుల్లో క్వింటాలుకు రూ.1500 మంచి రేటు. హమ్మయ్య, ఈ సంవత్సరం రైతులు బాగుపడతారు అనుకుంటుండగానే, ఆనాటి ప్రధానమంత్రి ఒక ప్రకటన చేశారు. ప్రపంచ దేశాల్లో మన కంటే రేటు ఎక్కువ ఉంది అప్పుడు. రేటు ఎక్కువ ఉన్నా కూడా భారతదేశానికి కొన్ని లక్షల బేళ్లు పత్తి దిగుమతి చేసుకుంటున్నాం అని ప్రకటన చేశారు. పత్తి ఇంకా ఒక్క బేలు కూడా రాకుండానే మర్నాటికి రూ.1600 రేటల్లా 800కి పడిపోయింది. అంటే ఒక కలం పోటుతో, ఒక ప్రధానమంత్రి మాటతో లక్షల మంది రైతుల బతుకుల్ని నాశనం చేశాం. 2011లో నేను శాసనసభ్యుడిగా ఉండగా, పక్క రాష్ట్రాల్లో బీపీటీ ధాన్యం బస్తా రూ.1200 రేటు పలుకుతున్నా మన రాష్ట్రంలో 74 కిలోల బస్తా కేవలం రూ.800 పలికింది. ఎందుకని? పక్క రాష్ట్రాల్లో రేటున్నా అమ్ముకోవటం నిషేధం. అప్పుడు నేను రైతులందరినీ కూడా సమాయత్తపరిచి, బస్తాల్ని మోయలేం కాబట్టి, ధాన్యాన్ని 5-10 కేజీల మూటలుగా చేసి, ప్రజలకు అర్థం కావాలని ఈ రాష్ట్రం నుంచి పక్క రాష్ట్రాలకు.. కర్నూలు నుంచి కర్ణాటకకు, నిజామాబాద్ నుంచి నాందేడ్‌కు ఇటు తెలంగాణ, అటు రాయలసీమ నుంచి తీసుకెళ్తే అప్పుడు ఆంక్షలు సడలిపోయాయి. వెంటనే మన రైతుకు రేట్లు పెరిగాయి. రూ.3,600 కోట్ల దాకా రైతులకు అదనపు ఆదాయం వచ్చింది. ఉత్పత్తి ఒక్క బస్తా పెరగలా. ఆంక్షలు పెట్టి ఉన్న ఉత్పత్తికి రేటు రాకుండా ప్రభుత్వాలు చేసినాయి. అలాగే అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో మన బియ్యానికి రేటు బ్రహ్మాండంగా ఉంటే, దేశంలో గుట్టలుగుట్టలుగా కోట్ల టన్నులు మూలుగుతూ ఉంటే, రేట్లు పడిపోతే, ఎగుమతుల్ని నిషేధించింది జాతీయస్థాయి ప్రభుత్వం. ప్రపంచంలో ఏ దేశమైనా మార్కెట్‌లో రేటు ఉంటే, తన రైతులకు లాభాలొచ్చేలా అమ్ముకునే మార్గమెట్లా అని ఆలోచిస్తుంది. మన దేశం మాత్రమే రైతులను కుంగదీసేలా వ్యవహరించింది.

**(?) ఈ సమస్యలన్నిటినీ కొత్త చట్టాలు పరిష్కరించగలవా**

అన్ని సమస్యలకూ ఈ చట్టాలు పరిష్కారం కాదు. కానీ వీటితో పరిష్కారం దిశగా వెళ్తున్నాం. ఆంక్షల్ని తొలగించి, నీ ఉత్పత్తిని ఎక్కడైనా అమ్ముకోవచ్చు నువ్వు.. మార్కెట్‌లో బాగుంటే అక్కడ అమ్ముకో, లేదా ఫలానా ఊరాయన మంచి రేటిస్తాడంటే ఆయనకు అమ్ముకో, లేదా హోల్‌సేల్‌దారు మంచి ధరకు కొనుక్కుంటున్నాడా.. ఆయనకు అమ్ముకో, ఫలానా పరిశ్రమ నిర్వాహకుడు, ప్రాసెసింగ్ చేసేవాడు ఎక్కువ రేటిస్తే ఆయనకి అమ్ముకో, విదేశాల్లో రేటుంటే విదేశాలకు అమ్ముకో.. అని ఈ చట్టాలు స్వేచ్ఛనిస్తాయి. అలాంటప్పుడు కొత్త వ్యవసాయ చట్టాల వల్ల ఏ రకంగా రైతులకు

నష్టమండీ? మన దేశంలోనే కొన్ని చోట్ల బంగాళ దుంపల సాగు, మార్కెటింగ్‌నే తీసుకోండి. కాంట్రాక్ట్ వ్యవసాయంతో రైతులకు ముందే రేటు గురించి అంచనా ఏర్పడుతుంది. నచ్చితే ఒప్పందం కుదుర్చుకుంటారు. ఎక్కువమంది బంగాళదుంప రైతులు సంతోషంగా ఒప్పందాలు కుదుర్చుకుని వ్యవసాయం చేస్తున్నారు. కాంట్రాక్ట్ వ్యవసాయంతో బంగాళదుంపల్ని పండించటం, వాటిని నిల్వ చేయటానికి తగినన్ని సౌకర్యాలుండటం, ప్రజల్లో డిమాండ్ ఉండటం వల్ల మార్కెట్‌లో బంగాళదుంపల ధరలు పెద్ద ఒడిదుడుకులు లేకుండా స్థిరంగా ఉంటున్నాయి. ఎటువంటి ఆంక్షలు లేని ఉర్లగడ్డల పరిస్థితి ఇలా రైతుకు, వినియోగదారునికి లాభసాటిగా ఉంటే.. నియంత్రణలను అమలు చేస్తున్న ఉల్లిగడ్డల విషయంలో రైతులు, వినియోగదారులు ఇద్దరూ నష్టపోతున్నారు. కాస్త రేటు పెరగ్గానే నిషేధం విధిస్తూ రైతు నడ్డి విరుస్తున్నారు. వినియోగదారుల్లో డిమాండ్, బడ్జెట్‌పై స్పష్టత, నిల్వ సౌకర్యాలు ఉంటే ధరలు నిలకడగా ఉంటాయనేది ఆర్థిక శాస్త్ర ప్రాథమిక సూత్రం. ఇది కూడా గుర్తించకుండా గుడ్డిగా వాదిస్తే ఎలా?

**(?) రైతులు పండిస్తున్న పంటలను సగానికి పైగానే ఇప్పటికే ప్రయివేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు కదా.. వ్యాపారులకే రైతులు కూడా అమ్ముకుంటున్నారు..**

ఈ కాగితం ఎక్కడ్నుంచి కొన్నాను.. ప్రయివేటు వ్యాపారి నుంచి. ఈ కంప్యూటర్ ఎక్కడ్నుంచి కొన్నాను.. ప్రయివేటు వ్యాపారి నుంచి. ఈ సోఫా ఎక్కడ్నుంచి కొన్నాను.. ప్రయివేటు వ్యాపారి నుంచి, ఈ చొక్కా ఎక్కడ్నుంచి కొన్నాను.. ప్రయివేటు వ్యాపారి నుంచి. ఏం పాపం చేశారండీ వీళ్లు. అసలీ భాష ఏంటి? ఈ ముతక భాష ఏమిటి? ప్రయివేటు, ప్రభుత్వం అని ఎందుకొచ్చిందసలు? రేటెవరిచ్చారు? మన్నిక ఎక్కడుంది? అవి ముఖ్యంగానీ.. ప్రయివేటు, ప్రభుత్వం అనే సమస్య ఎక్కడుందసలు? ప్రయివేటంటే ఎవరు? మన ఇంట్లో మన అబ్బాయిలు, అమ్మాయిలు వ్యాపారం చేస్తే వాళ్లు పాపాత్ములా? గవర్నమెంటులో యాభై వేలో, లక్ష జీతం తీసుకుంటూ ఏం పని చేయకుండా వాడమ్మితే పవిత్రుడా? ఏమిటీ ఆలోచన? ఎందుకొచ్చిందసలు?

**(?) ఓపెన్ మార్కెట్ ఉంది గదా అనే ఉద్దేశం..**

ఒకటి ఆలోచించండి. మీరు ఒక ఉత్పత్తిని చేస్తున్నారు. ఆ చేసింది ప్రస్తుతం ఇక్కడ మార్కెట్‌యార్డులో ఇక్కడ మాత్రమే అమ్మాలని ఆంక్ష విధిస్తే అది మీ లాభావకాశాల్ని నష్టపరచదా?

**(?) ఇప్పటికే మార్కెట్‌యార్డుల బయట కూడా అమ్ముకుంటున్నారు గదా**

చట్టవిరుద్ధంగా అమ్ముకుంటున్నారు. అయినా కూడా మార్కెట్ సెస్ కట్టాలి. మార్కెట్ యార్డుతో సంబంధం లేకున్నా సెస్ కట్టాలి. సెస్ కట్టలేదని వాడొచ్చి సీజ్ చేస్తాడు, ఇన్‌స్పెక్ట్ చేస్తాడు, మరోటి చేస్తాడు. ఇప్పుడు ఈ చట్టాల ద్వారా ఏమంటున్నారంటే.. మార్కెట్ యార్డు బాగుంటే అక్కడ అమ్ముకోండి, పక్కూళ్లో బాగుంటే అక్కడ అమ్ముకోండి, పక్క రాష్ట్రంలో బాగుందా అక్కడ అమ్ముకోండి, హోల్‌సేలర్ మంచి ధర ఇస్తున్నాడా అక్కడ అమ్ముకోండి, ఎలక్ట్రానిక్‌గా అమ్ముకుంటారా అక్కడ అమ్ముకోండి, ఎగుమతిదారుడు కొనుక్కుని అమ్ముతాడా అక్కడ అమ్ముకోండి. ఒకళ్లకి బదులు 10 మంది ఉంటే కొనేవాళ్లు ఉంటే, 10 మంది కొనేవాళ్ల మధ్య పోటీ ఉంటే, లాభమా, కాదా? ఏ వస్తువైనా సరే, మీరు మాస్కులు తయారుచేసినా సరే, లేకపోతే బీడీ చుట్టలు తయారుచేసినా సరే పోటీ ఉంటే బేరమాడి లాభం పొందే అవకాశ ముంటుందా, ఒకేచోట అమ్మాల్సిందే అంటే లాభం వచ్చే అవకాశ ముంటుందా? బీడీ చుట్టలు తయారుచేసే కార్మికురాల్ని, ఇంట్లో కుటీర పరిశ్రమలో ఏదైనా వస్తువు తయారుచేసే వారిని అడగండి.

**(?) కొత్త చట్టాల వల్ల మద్దతు ధర రాదు అని విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి**

ఎంత ధర వస్తుంది, మద్దతు ధర వస్తుందా అని ఎవరూ గ్యారంటీ ఇవ్వలేరు. మార్కెట్‌లో రేటుకి నేను గ్యారంటీ ఇవ్వలేను. కానీ ఒక్కడి దగ్గర బలవంతంగా అమ్మితే మీకు రేటొచ్చే అవకాశముందా, 10 మంది మధ్య మీకు ఎవరు ఎక్కువ రేటిస్తే వారికే అమ్ముకుంటే ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశముందా.. చెప్పండి. మన జీవితంలో మనం కొనే వస్తువులు, అమ్మే వస్తువులు చాలా ఉన్నాయిగా ప్రతిరోజూ. ఇవన్నీ ఎక్కడ కొంటున్నాం, ఎక్కడమ్ముతున్నాం. చెప్పులున్నాయి.. నాకు బాటా నచ్చితే బాటాలో కొంటాను, నైక్ నచ్చితే నైక్‌లో కొంటాను. బలవంతంగా ఎవరూ నన్ను కొట్టటం లేదు కదా. అలాగే అమ్ముకునేవాడు ఒక్కళ్లకే అమ్మాలని లేదు. స్వేచ్ఛగా అమ్ముకోవాలి, స్వేచ్ఛగా కొనుక్కోవాలి. అన్యాయానికి తావు లేకుండా, పారదర్శకంగా మార్కెట్ ఉండాలి. మార్కెట్ అంటే అర్థం అదీ. తరతరాలుగా, వేల సంవత్సరాలుగా మార్కెట్ అంటే అర్థం అదే. మీరు బలవంతంగా ఇక్కడే అమ్మవలెను, వీడికే అమ్మవలెను, ఇంతే స్టోర్ చేయవలెను, ఇక్కడే స్టోర్ చేయవలెను, విదేశాలకు ఎగుమతి చేయరాదు, పక్క రాష్ట్రంలో అమ్మకూడదు, ఇవన్నీ తీవ్ర రైతువ్యతిరేక ధోరణులు. నేను చెప్పాను ఉదాహరణలు. 2011-12లో ఒక్క బీపీటీ ధాన్యం, తెలుగునాట ఒక్క వెరైటీ, ఒక్క సీజన్‌లో, ఒక్క పంట, కొన్ని ప్రాంతాల్లో పండించే పంటను ఇతర రాష్ట్రాల్లో అమ్ముకునే స్వేచ్ఛ లేకుండా చేయటం వల్ల రైతులకు రూ.3,600 కోట్ల నష్టం వచ్చింది ఆనాడు. నేను పోరాడి ఆంక్షలు తొలగించే ఏర్పాటు చేయగానే లాభం వచ్చింది. ఇప్పుడు ఆంక్షలు ఇక పెట్టం, ఇక లేవు, శాశ్వతంగా తీసేస్తున్నాం అన్నారు. ఒక రైతుగా, రైతు బంధువుగా, రైతులకు ఆదాయం కావాలని కోరుకున్న మనిషిగా నేను సంతోషించవలెనా, బాధపడవలెనా?.. ఇంకా చాలా చెయ్యాలి. ఇది సర్వరోగనివారిణి కాదు. ఇప్పుడు దీంతోనే అన్ని పనులు జరుగుతా యని ఎవ్వరూ అనటంలా. వ్యవసాయం కచ్చితంగా సంక్షోభంలో ఉంది. వ్యవసాయంలో పనిచేసే జనాభా, వ్యవసాయం నుంచి ఆదాయం పొందే జనాభా ఇప్పటికీ మన దేశంలో నూటికి 40-50 మంది ఉన్నారు. కానీ వ్యవసాయం వాటా మన జాతీయ ఉత్పత్తిలో 15-16 శాతం మాత్రమే. కాబట్టి వ్యవసాయం మీద ఆధారపడిన వారు పేదలే. కానీ ఉన్నదాంట్లో ఏది రేటొచ్చే మార్గం?.. చేతులు కట్టి సంకెళ్లు వేసి నిబంధనలతో మనల్ని హింసిస్తేనా? స్వేచ్ఛనిస్తేనా? ఎగుమతుల్లో మన వాటా చెప్పానుగా. ప్రపంచంలో 8వ వంతు, 12% వ్యవసాయ భూమి ఉండటమేంటి, పంట చేతి కొచ్చే తరుణంలో బియ్యం, గోధుమలు 8 కోట్ల టన్నులు కుప్పలు కుప్పలుగా ముక్కిపోతూ మూలుగుతుండటమేంటి? మనకు వాటిని తినేవాళ్లు బాగా తగ్గిపోతున్నారు. పూర్వం అంతంత లెక్కన అన్నం

తినేవాళ్లు. ఇప్పుడు కొంచెంకొంచెం తింటున్నాం. పండ్లు, కూరగాయలు, మాంసం, పాలు, చేపలు, గుడ్లు వంటివి తింటున్నాం. పౌష్టికాహారం కోసం అవి తినాలనే కదా పిల్లలకు కూడా చెబుతున్నాం. కానీ ఉత్పత్తేమో దీనిలో ఉంది. పళ్లు, కూరగాయలు, మాంసం వాటిల్లో ఉత్పత్తి సరిపడినంత లేదు. రేట్లు పెరుగుతున్నాయి.

**(?) ఇదే తరహాలో స్వేచ్ఛా మార్కెట్ వ్యవసాయ చట్టం బీహార్‌తోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే అమల్లో ఉంది. కానీ దీనివల్ల పెద్దగా ప్రయోజనం కన్పించటం లేదని కొందరి వాదన**

అదే చెప్పాను. ఇది సర్వరోగనివారిణి కాదు. దీని ద్వారా వచ్చే ప్రయోజనం చాలదు, మరింత చేద్దామంటే నేను సంతోషిస్తాను. ఇది కొంప ముంచేస్తోంది, తప్పు అంటే వ్యతిరేకిస్తాను. అంతేగానీ, అతి గడుసుతనం ఎట్లాగ! ఒక్క పక్కన ఇది చాలదు, దీనివల్ల లాభం రావటం లేదు పూర్తిగా అంటూనే.. కాబట్టి ఇది వద్దు అనటం.. ఇదెక్కడి విడ్డూరం. ఇదేం మాట. దీనకసలు అర్థముందా ఏమన్న? ఇది అవసరం, కానీ ఇది చాలదు. ఇది చాలుతుందని ఎవరూ అనరు. దేశంలో బియ్యం, గోధుమలు ఇబ్బడిముబ్బడిగా గుట్టలుగుట్టలుగా కోట్ల టన్నులు మూలుగుతూ కుళ్లిపోతుండగా, పౌష్టికాహారానికి కీలకమైన ఆహారం పప్పుధాన్యాలను మాత్రం దిగుమతి చేసుకుంటున్నాం. భారతదేశంలో మాంసాహారం తినేవాళ్లలో కూడా ఎక్కువమంది మాంసం తినేది వారానికి ఒక్కసారే. కాబట్టి ప్రధానంగా మాంసకృత్తులు వచ్చేది పప్పుల నుంచి. పప్పులు, వంటనూనెలు ఈ రెంటికీ ప్రపంచంలో అతిపెద్ద దిగుమతిదారు భారతదేశం. ఆ పంటలకు ప్రోత్సాహం లేదు. దిగుమతుల్ని మాత్రం యథేచ్ఛగా చేస్తున్నాం. గట్టిగా నాలాంటి వాళ్లు గొంతు విప్పిన తర్వాత వంటనూనెల మీద కొంత దిగుమతి సుంకం పెంచారు. పప్పుల మీద ఇప్పటికీ సుంకం లేదు. ఆ దిగుమతి సుంకాన్ని కూడా ప్రభుత్వ ఖజానాలో వేసుకుంటున్నారుగానీ, ఈ పప్పులు, నూనెలు పండించే రైతులకి ఏమీ ఆదాయం కలిగించటంలా. కాబట్టి వాళ్ల ఉత్పత్తి పెరగటంలా. అట్లాగే మిగతా ఉత్పత్తుల్లో– మనం ప్రపంచంలో నెంబర్‌వన్‌గా ఉన్న ఉత్పత్తుల్లో అయినా సరే– ప్రపంచంలో మన వాటా తక్కువ. ఎందుకు?.. అన్నీ ఆంక్షలే!

**(?) కొత్త చట్టాల వల్ల వ్యాపారస్తులు రాష్ట్ర ప్రభుత్వానికి కట్టే పన్నులను కోల్పోవలసి వస్తోంది గదా**

ప్రభుత్వాలు సేవలందిస్తే కచ్చితంగా పన్నులు కట్టాలండీ. అంతేగానీ ప్రభుత్వాలు రౌడీమామూలుగా వసూలు చేస్తామంటే ఎలా? మీరు సేవలను ఎలా అందిస్తున్నారు అనేది ముఖ్యం. మార్కెట్ యార్డుల్లోది సెస్.. పన్ను కాదు. పన్ను అంటే ప్రభుత్వాలు పనిచేసినా, చేయకపోయినా, ఖర్మ చాలక దేశంలో ఉన్నాం కాబట్టి మనం కట్టవలసినది. పన్ను ఎట్లా ఉపయోగిస్తారో పూర్తిగా ప్రభుత్వం ఇష్టం. చట్టసభ ఉత్తర్వుల ప్రకారం ఏ రకంగానైనా వాడొచ్చు. రాజ్యాంగం నిర్దేశించిన పద్ధతుల్లో. అది పన్ను. పన్ను కడుతున్నప్పుడు ఓటరుగా నేను విచక్షణ ఉపయోగిస్తాను. అరె, పన్ను డబ్బంతా వృథా అవుతోంది, ఫలానావారికి ఓటు వేయాలనా, వద్దా అని చెప్పి. కానీ పన్ను కట్టాలా, వద్దా అనే దానిపై నాకేమీ చాయిస్ లేదు. పన్ను కట్టాలి. కానీ సెస్ వేరు. సెస్ అనేది ఒక ప్రక్రియ కోసం వచ్చినది. మార్కెట్ సెస్.. మార్కెట్ సౌకర్యాలు కల్పించటం కోసం. మీరు నాకు మార్కెట్ సౌకర్యాలు కల్పించకపోతే, మీ మార్కెట్ నేను వాడుకోకపోతే మీకెందుకు నేను సెస్ కట్టాలి? మీరు వాడుకోకపోతే సెస్ కట్టొద్దని చట్టం చెబుతోంది. దానికి బాధేంటి నీకు? మీ మార్కెట్ సౌకర్యం బాగుందని మీ మార్కెట్‌లో అమ్మాలని వచ్చాననుకోండి.. సెస్ తీసుకొమ్మని మీ మార్కెట్‌లో అమ్ముతాను. మీ మార్కెట్‌లో నాకు రేటు రావటం లేదు, సౌకర్యం లేదు.. ఎందుకు కట్టాలి సెస్? అరె, పందులు విహారం చేస్తున్నాయండీ మార్కెట్ యార్డుల్లో. మహిళలొచ్చి ఎఫ్‌సీఐకి ధాన్యం అమ్ముకుందామంటే వారం రోజులపాటు పడిగాపులు గాచి, వర్షం పడుతుంటే నేల మీద గుడ్డలు పరిచి, వర్షం నీరు చొచ్చుకొస్తుంటే కన్నీరు కార్చటం నేను స్వయంగా చూశాను. ఆ మార్కెట్ యార్డుల్లో డబ్బులు కట్టాలా కనీసం ఉపయోగించకుండా. ఏం మాట్లాడుతున్నారు? దాని కోసం చట్టాలు మార్చకూడదా? మార్కెట్లను ఉపయోగిస్తే కచ్చితంగా డబ్బులు కట్టాలి. మార్కెట్ యార్డుల్లో మీ ఇష్టం వచ్చిన వాళ్లను నామినేట్ చేస్తుండె, వాడేమో ఇష్టమొచ్చినట్లు కైంకర్యం చేస్తుండె, రైతులతో సంబంధంలేకుండా పదవులను అనుభవిస్తుండె, మార్కెట్లో రేటు రాకుండె, రైతుల్ని బిచ్చగాళ్లుగా చూస్తుండె. నిన్న కూడా ఒక రైతు నాకు ఫోన్ చేశాడు. టమాటా ఉత్పత్తి చేశాను సార్ ప్రపంచస్థాయి ప్రమాణాలతో. పత్రికలు బ్రహ్మాండంగా ఉన్నాయని ప్రచారం కూడా ఇచ్చాయి. కానీ ఆ టమాటాల్ని నేను బుట్టల్లో మార్కెట్‌కి తీసుకెళ్తే రూ.60 వచ్చాయి సార్. ప్యాకేజీ, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు రాలేదని కన్నీళ్లతో చెప్పాడాయన. రైతుల పరిస్థితి ఇలా ఉంటే నీకు మాత్రం సెస్ కట్టాలి. మార్కెట్లని ప్రజాస్వామీకరించండి. ఏ రైతుల కోసం మార్కెట్ యార్డులను ఏర్పాటు చేశారో వారినే ప్రతినిధులను ఎన్నుకోమనండి. వాళ్ల డబ్బులతో వాళ్లనే నిర్వహించుకోమనండి. మేం పెత్తనం చెయ్యాలి, ఎమ్మెల్యే గారు చెప్పినవాళ్లని నామినేట్ చెయ్యాలి, డబ్బులివ్వాలి, వాడు వీరంగం చేయాలి ఆ డబ్బులతో అంటే కుదరదు. మార్కెట్‌ను ఉపయోగించుకుంటే రైతులు సెస్ కడతారు. ఉపయోగించుకునేలా చేయండి మీరు. బాగా చేస్తే రైతులు వస్తారు. మీరు బాగా చేయకున్నా మీ దగ్గరకు ఎందుకు రావాలి?

**(?) కనీస మద్దతు ధర లభించని వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పించి కొనుగోలు చేస్తోంది. దీని వల్ల మేలు జరగదా**

ఈ చట్టాలు చేస్తూ ఎంఎస్‌పీపై ప్రభుత్వం ఏం చెప్పిందీ.. దాన్ని కొనసాగిస్తాం అని. ఈ ఎంఎస్‌పీ బాగోతం కూడా ఒకసారి చెబుతాను. దేశంలో అవసరంలేని ఉత్పత్తులేంటి? ఇబ్బడిముబ్బడిగా ఉత్పత్తి అయ్యి, దేశంలో డిమాండ్ లేనివి ఏమిటి? బియ్యం, గోధుమలు. 8 కోట్ల టన్నులు పంట దిగుబడి సీజన్‌లో గోడౌన్లలో మూలుగుతున్నాయి. కాబట్టి మనం ఇవాళ ఎంఎస్‌పీ ప్రకటిస్తున్నది, సేకరిస్తున్నది ఏమిటి– బియ్యం, గోధుమలు. అత్యధికంగా మనం సేకరిస్తున్నటువంటి ఆహారధాన్యాలుగానీ, వ్యవసాయోత్పత్తులుగానీ బియ్యం, గోధుమలు. బియ్యంలో 34% ప్రభుత్వం సేకరిస్తున్నది, గోధుమల్లో 31% సేకరిస్తున్నది. మిగతావన్నీ ఉదాహరణకు మొక్కజొన్న 0.17%. ఈ మాట్లాడేవాళ్లకి గణాంకాలు తెలుసా అసలు. ప్రభుత్వం ఎంత సేకరిస్తోందో. ఒక్క శాతంలో ఆరోవంతు.

దేశ ఉత్పత్తిలో 600వ వంతు. రెండోది, మార్కెట్ రేటు కంటే ప్రకటించిన ఎంఎస్‌పీలు మిగతా అన్ని పంటల్లో ప్రకటించిన సందర్భాల్లో దాదాపు నూటికి 95 సందర్భాల్లో మార్కెట్ రేటు కంటే తక్కువ. నేను ఛాలెంజ్ చేస్తున్న. ఏమి ఎంఎస్‌పీ అండీ? ఎవరి కోసం నటిస్తున్నారు? రెండే పంటలకు, అది కూడా నేను బహిరంగంగా చెబుతున్నా, ఎన్నోసార్లు చెప్పాను.. ఈ దేశంలో గిరాకీ లేని పంటలు ఎక్కువ ఉత్పత్తి చేస్తూ వాటిని ప్రోత్సహించి, ఏది అవసరమో వాటి ఉత్పత్తికి రైతులను ప్రోత్సహించటం లేదు. అయినా కూడా ప్రభుత్వం ఎంఎస్‌పీని, ఈ సేకరణను కొనసాగిస్తాం అంటోంది. మీకు ఇబ్బందేంటి? ఏమిటసలు విమర్శ? పాత బూజు పట్టిన విధానాలను కొనసాగించాలన్న కోర్కె తప్ప ఏమిటి నష్టం? నేను స్పష్టంగా, సవివరంగా అంకెలతో చెప్పాను. నిజంగా వ్యవసాయంలో ఎవరికి ఇబ్బంది ఉంది? మెట్టప్రాంతాల రైతులకి. మన రాగి గానీ, సజ్జ గానీ, జొన్న గానీ.. ఇవీ అసలు ప్రధానమైనవి. అవన్నీ నాశనం చేశారు ప్రభుత్వాల విధానాలతో. మొక్కజొన్న-0.17%, సజ్జ-0.39%, కొన్ని పప్పులు-0.54%, ఆవాలు0.59%, జనపనార-0.69%.. అన్నీ ఒక్క శాతం కంటే తక్కువ సేకరణే. సోయాబీన్-0.66%, పత్తి-1.75%, పొద్దుతిరుగుడు-3%. ఏంటండీ మీరు చేస్తున్నది? ఈ ఎంఎస్‌పీ పోతుందనా మీరు బాధపడుతున్నారు? ఎలాగూ అది కొనసాగుతుంది. కానీ ఇదొక డ్రామా. ఏదో అద్భుతం జరుగుతోంది, గొప్ప మద్దతు ధర ప్రకటిస్తున్నారు, కొనేస్తున్నారు అని. పచ్చి అబద్ధం. దేశంలో ఏ పంటలు అవసరంలేదో వాటిని ప్రోత్సహించే రీతిలో ఎంఎస్‌పీ ఇచ్చి కొంటున్నారు. అతి సారవంతమైన భూముల్లో తెలివైన రైతులు ఏదో రేటు వస్తోందిగదా, పెద్ద ఆదాయం లేకపోయినా రిస్కు లేదు గదా అని మనకు అలవాటు ప్రకారం ఈ వరిని, ఈ గోధుమల్ని పండిస్తున్నారు. తెలంగాణలో కేసీఆర్ గారు ఏమన్నారు? రైతుబంధు ఉన్నవారికి పంటల నిబంధనలు పెడతామన్నారు. వరి వద్దు అన్నారు. ఎందుకన్నారు? రైతుల మీద ప్రేమ ఉంది కాబట్టి. మంచి రేటు రావాలి రైతుకు, సమాజ అవసరాలను తీర్చాలనే కోర్కె ఉంది కాబట్టి. వరి, గోధుమ కాదు మన దేశానికి కావలసింది. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా వరి, గోధుమ 8 కోట్ల టన్నులు మన గోడౌన్లలో మూలుగుతున్నాయి. ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇలా లేదు. అయినా కూడా మద్దతు ధర కొనసాగుతుంది, సేకరణ జరుగుతుంది. దీనికి, దానికి సంబంధం లేదు. మరెందుకు గొడవ? అసలైన కారణం ఒకటి చెప్పండి నాకు. గతకాలపు బూజుపట్టిన విధానాలను వదిలేస్తున్నాం, లైసెన్సు రాజ్యాన్ని వ్యవసాయంలో కూడా అంతం చేసే ప్రయత్నం చేస్తున్నాం, పరిశ్రమల్లో గతంలోనే అంతం చేశాం, పరిశ్రమలకు స్వేచ్ఛనిచ్చాం, మార్కెట్‌లో రేటు బాగుంటే, మంచి రేటుతో అమ్మితే, మంచి నాణ్యతతో అమ్మితే పరిశ్రమలవారు బతుకుతారు, లేకపోతే పోతారు, తంటాలు పడుతున్నారు. వ్యవసాయం కూడా అట్లా ఉండాలనుకున్నప్పుడు మీకు నష్టమేంటో చెప్పండి? ఏ రకంగా నష్టమో చెప్పండి? అంటే రైతుకి మాత్రమే సంకెళ్లు కావాలా? పరిశ్రమలవాడు పరిశ్రమలు ఇష్టమొచ్చినట్లు చేసుకోవచ్చు, లేకపోతే సేవారంగంలో ఉన్నవాళ్లు ఒక డాక్టరో, లాయరో ప్రాక్టీస్ చేయాలా వద్దా అని చెబుతున్నామా? ఇష్టమున్నవాళ్లు చేస్తారు, ఇష్టం వచ్చిన స్పెషలైజేషన్ చేస్తారు.

**(?) ఈ చట్టం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలకు సంబంధించి అకస్మాత్తుగా వచ్చే భారీ మార్పులేవీ ఉండవని కొందరి వాదన..**

ఎందుకని? ఇంకా చేయాల్సిన పనులున్నాయి, చేయటం లేదు కాబట్టి. నష్టమొస్తోందా, అనుకున్నంత మంచి జరగటం లేదా? మీ బాధేంటో చెప్పండి నాకు. నష్టమొస్తుంది.. పచ్చి అబద్ధము. నేను స్పష్టంగా కుండబద్దలు కొట్టినట్లు చెప్పాను. అనుకున్నంత రాకపోవచ్చు. కచ్చితంగా వ్యవసాయంలో ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయి. ఈ చట్టాలతో అద్భుతాలు సాధిస్తామంటే నమ్మొద్దు. ఉదాహరణకి, ఉత్పత్తి చేసే రైతుకి, కొనుగోలు చేసే వినియోగదారునికి మధ్య చాంతాడంత పొడుగున 6-7 లింకులున్నాయి ఈ దేశంలో. ఎన్నో ఏళ్ల నుంచి నాలాంటి వాళ్లం మొత్తుకుంటున్నాం. ఈ సప్లయ్ చైన్లని మీరు సంఘటితం చేయండి అని. పెద్దఎత్తున రిటైల్ చైన్లను ప్రోత్సహించండి అని. భారతదేశం నుంచి రిలయన్స్ కావచ్చు, విదేశాల నుంచి వచ్చిన వాల్‌మార్ట్ కావచ్చు, క్యారీఫోర్ వంటి రకరకాల కంపెనీలు కావచ్చు.. ఎవరన్నా కానీండి లక్షల కోట్ల రూపాయలు వ్యవసాయంలో పెట్టుబడులు కావాలి. గ్రేడింగ్‌లో, ప్యాకింగ్‌లో, రవాణాలో, గిడ్డంగుల్లో, శీతల గిడ్డంగుల్లో, రిటైల్ చైన్లలో, ప్రాసెసింగ్‌లో, ఎగుమతుల మార్కెట్‌లో. ఇంతకు ముందు మనం చూశాం. ఎగుమతి మార్కెట్‌లో కనీసం 100 బిలియన్ డాలర్లు, అంటే దాదాపు 8,00,000 కోట్ల రూపాయలు ఒక్క వ్యవసాయోత్పత్తుల్లోనే మనకు అవకాశం ఉన్నది. మనం ఉపయోగించుకోవటంలా. మూర్ఖపు చట్టాల వల్ల, మనం కొంతమందిని రానీయకుండా ఉండటం చేత. దానికి స్కేల్ కావాలి. 40 ఏళ్ల నుంచి నేను వింటున్నాను. తెలుగునాట ఉత్పత్తి చేసినంత అద్భుతమైన మామిడి ఎక్కడా ఉత్పత్తి కాదు, ఎగుమతులు కావాలి, ఎగుమతులు కావాలి అని. ఎంత ఎగుమతి చేస్తున్నాం మనం మామిడిపళ్లను. మొత్తం ఇండియా నుంచి మామిడి ఉత్పత్తి ఎంత, ఎగుమతులు ఎంత? ఒక్కసారి లెక్కచూడండి. హాస్యాస్పదం. ఎందుకని? ఆ స్కేల్ ఉండాలి. ఆ క్వాలిటీ గ్రేడింగ్ ఉండాలి. మనం వెళ్లగానే ప్రపంచ మార్కెట్లలో గేట్లు తెరవరు. ప్రపంచ మార్కెట్‌లోకి చొచ్చుకుపోయే శక్తి ఉండాలి. ఈ మ్యాంగో మచ్చ వచ్చిందంటారు, ఆ రకం రంగు బాలేదంటారు, పురుగుమందులు వాడారంటారు.. రకరకాలు. తమ రైతుని కాపాడుకోవటం కోసం ఆ దేశాలు నానా తంటాలు పడతాయి. మన ప్రభుత్వాలు మన రైతుల నడ్డివిరిచే ప్రయత్నాలతో ముంచేస్తుంటే, ప్రపంచ దేశాలన్నీ కూడా తమ రైతుల్ని కాపాడుకోవటం కోసం రైతుపక్షపాతంతో వ్యవహరిస్తుంటాయి. ఒక్క మన దేశంలో మాత్రమే రైతు పేరు చెప్పి రైతు నడ్డి విరగ్గొడుతున్నాము. ఇప్పుడు మనం ఉల్లిపాయల రేటు కాస్త పెరిగితే వెంటనే ఎగుమతుల్ని నిషేధించాం. ప్రపంచంలో ఏ దేశంలో ఈ పని జరగదు. ఒక్క పవిత్ర భారతదేశంలో మాత్రమే జరుగుతుంది. ఇవన్నీ తొలగించండి, రిటైల్ చైన్లు రానివ్వండి. అప్పుడేమవుతుందీ.. మార్కెట్‌లో వంద రూపాయలకు వస్తువు అమ్ముడుపోతే, ఈవేళ రైతులకు వస్తున్న ఆదాయం సగటున 25 నుంచి 35 రూపాయలు. కొన్ని పంటల్లో రూ.10 కూడా రావటంలా. మీరు 70

రూపాయలకు కొంటే, రైతుకి రూ.10 వస్తే అదృష్టం. కానీ ఎప్పుడైతే రిటైల్ చైన్లు వచ్చి మార్కెట్‌ని సంఘటితం చేస్తామో, అప్పుడు రైతుకి 60-65% వస్తుంది. ప్రపంచ మార్కెట్‌లోకి చొచ్చుకునిపోయే శక్తి వాళ్లకు వస్తుంది. ప్రాసెసింగ్ పెద్దఎత్తున వస్తుంది. గిడ్డంగులు, మౌలిక వసతులు పెద్దఎత్తున వస్తాయి. అక్కడ అన్యాయం జరిగితే రైతుని కాపాడటం కోసం ఏర్పాట్లు చేయండి. ఎవర్నీ పూర్తిగా నమ్మాలని నేనటంలా. కానీ మార్కెట్ అంటే ఏమిటి? ఈ కళ్లజోడు అమ్మేవ్యక్తి ఆయన లాభం కోసం చేస్తాడు తప్ప నా కోసం చేయడు. ఆయన లాభం, నా ప్రయోజనం రెండూ నెరవేరటంలోనే మార్కెట్ లింక్ ఉంటుంది. కొనేవాడిగా నేను చూసేది..ఈ రేటు బాగుంది, ఈ మన్నిక బాగుంది అనేవి. నా ఉత్పత్తి రేటు ఇంతుంటే నాకు మార్కెట్‌లో పది రూపాయల లాభం వస్తుంది, మార్కెట్‌లో నా సరుకు బాగా అమ్ముడవుతుంది అనేది అమ్మేవాడు చూస్తాడు. ఇద్దరికీ ప్రయోజనకరం ఈ మార్కెట్. కానీ అమ్మేవాడు నా కోసం చేయడు. జయప్రకాష్ నారాయణ్ కళ్లజోడు పెడతాడు, ఆయనకు చాలా క్వాలిటీ కళ్లజోడును కారుచౌకగా, ఫ్రీగా ఇవ్వాలని అనుకోడు. మార్కెట్‌లో మిగతావాళ్ల కంటే తక్కువ రేటుతో మంచి కళ్లజోడును అందుబాటులో ఉంచాలని ఆయన చూస్తాడు, ఉన్నవాటిల్లో మంచిది కొనుక్కోవాలని నేను చూస్తాను.

**(?) కొత్త వ్యవసాయ చట్టాలపై పార్టీలు భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. దాంతో రైతులు అయోమయంలో ఉన్నారు. వారికి మీరు ఏం చెబుతారు**

జయప్రకాష్ నారాయణ్ చెప్పింది నమ్మక్కర్లేదు, మరొకరు చెప్పిందీ నమ్మక్కర్లేదు. వాస్తవాలు ముఖ్యం. నేను చెప్పేవి వాస్తవాలు అవునా, కాదా? చెప్పండి.. భారతదేశ విస్తీర్ణం ప్రపంచంలో 2.5% మాత్రమే అయినా మన దేశ వ్యవసాయ భూమి ప్రపంచంలో 12%- వాస్తవమా, కాదా? భారతదేశంలో వ్యవసాయంలో ఆదాయం తగ్గిపోతున్నది- వాస్తవమా, కాదా? భారతదేశంలో ప్రభుత్వ జోక్యం వల్ల మార్కెట్‌లో అతి తక్కువ రేటు రైతులకు వస్తోంది- వాస్తవమా, కాదా? సంకెళ్లు తొలగి 10 మందిలో అమ్మగలిగే అవకాశం ఉంటే ఉన్నంతలో మంచి రేటుకి అమ్ముకునే అవకాశం రైతుకి దొరుకుతుంది. వాస్తవమా, కాదా? విదేశీ వాణిజ్యంలో మనకు చోటులేకపోతే ఇంత పెద్ద దేశంలో మన రైతులు నష్టపోతున్నారు. వాస్తవమా, కాదా? ఒక్కసారి మన మత్స్యపరిశ్రమను చూడండి. చేపల పరిశ్రమలో కూడా ఒడిదుడుకులుంటుంటాయి. రొయ్యలుగానీ, ఇంకోటిగానీ. కానీ మొత్తం మీద ఎప్పుడైతే ప్రభుత్వ జోక్యం లేదో, అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముకునే అవకాశం ఉందో అప్పుడు పండించిన పంటతో రైతులకు ఎకరాకు 3-4 లక్షల ఆదాయం వస్తోంది. మనం గర్వపడాలా? సంతోషపడాలా? ఈర్ష్యపడాలా? అరె, నాకు రొయ్యలంటే చాలా ఇష్టమండీ, వాడు రూ.10లకు ఇవ్వకుండా రూ.100లకు అమ్ముకుంటున్నాడండీ అని వాడ్ని నాశనం చేయటమే నా లక్ష్యమా? ఎందుకీ నటన ఒక పక్కన రైతు మాట చెబుతూ. రైతుకు మంచి రేటు వచ్చే ఏర్పాటు చెబితే దాన్ని ప్రోత్సహించాలా, మనం వ్యతిరేకించాలా? దక్షిణాఫ్రికా నుంచి గాంధీజీ భారతదేశానికి వచ్చాక జాతీయోద్యమంలో భాగంగా చేసిన మొట్టమొదటి ఉద్యమం చంపారన్ సత్యాగ్రహం. రైతులకు ప్రభుత్వం వేసిన సంకెళ్లు తెంచటానికే గాంధీ గారు ఈ పోరాటం చేశారన్న సోయి అయినా ఉండాలిగా మనకి.

**(?) కొత్త వ్యవసాయ చట్టాల వల్ల సాధారణ రైతుకు ఏమిటి లాభం**

రెండు మౌలికమైన అంశాలున్నాయి ఇందులో. అసలు ఏ చట్టం చేసినా సాధారణ రైతు బతుకెట్లా ఉంటుంది?.. మన దేశంలో కోట్లాది మంది రైతులు వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. అందుచేత ప్రపంచంలోని ఏ దేశంలో లేనిరీతిలో అతిచిన్న కమతాలు భారతదేశంలో ఉన్నాయి. ప్రభుత్వంలోని ఓ బంట్రోతుకి పదెకరాల ఆసామి కంటే జీతం ఎక్కువ వస్తుంది. దానికి, ఈ చట్టాలకి సంబంధం లేదు. వ్యవసాయ రంగానికి అన్యాయం జరుగుతోంది. తర్వాత వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి కోసం ఏర్పాట్లు జరగటంలా. ఆర్థిక వ్యవస్థను పెంచటంలా. రైతుల్ని మీరడిగితే నూటికి 50-60 మంది నెలకు 10,000 రూపాయల ఆదాయం వస్తే, ఇది మానేసి వస్తామని చెబుతారు. దానికి మీరు ఏర్పాట్లు చేయటంలా. వివిధ కారణాల వల్ల, మీ దుష్పరిపాలన వల్ల, మూర్ఖపు ఆర్థిక విధానాల వల్ల, దారుణమైన మౌలిక సదుపాయాల వల్ల ఆర్థిక వ్యవస్థ పెరగటం లేదు, ఉద్యోగాల ఉత్పత్తి జరగటం లేదు. కోట్ల మంది ఉపాధి కోసం అలమటిస్తున్నారు. దానికి-దీనికి లంకె పెట్టుకోకండి. ఈ చట్టాల వల్ల పేదరికం పోతుందా, ఈ చట్టాల వల్ల అందరికీ ఆదాయం వస్తుందా, ఈ చట్టాల వల్ల సమానత్వం వస్తుందా.. ఏ చట్టం వల్ల వచ్చిందో చెప్పండి. ప్రభుత్వం చేయవలసిన మార్కెట్‌లో ఉద్యోగాలు కల్పించే ఆర్థిక విధానాలు చేపట్టటం, వ్యవసాయ రంగంలో ఉపాధి, ఆదాయం చాలకుండా ఉంటే వేరే రంగాల్లో పనిచేస్తామంటే వారికి ఉపాధి కల్పించటం చేయాలి. లక్షల మంది పొట్ట చేత పట్టుకుని హైదరాబాద్‌కి వస్తే, కొవిడ్ రాగానే వాళ్లను పురుగుల్లా చూసి వట్టి కాళ్లతో ఎండలో పడి నడిపించటం కాదు చేయవలసింది. ఇక్కడ గౌరవప్రదంగా జీవితం ఉండేందుకు ఏర్పాట్లు చేయాలి. దానికి వ్యవసాయంలో కాదు పరిష్కారం.. ఇక్కడ పరిష్కరించాలి. వ్యవసాయరంగంలో ఉన్నంత వరకు అదనపు విలువను చేకూర్చాలి. అక్కడ ఆదాయాల్ని పెంచే ఏర్పాట్లు కావాలి. అక్కడ మంచి రేటొచ్చే ఏర్పాట్లు కావాలి. ఒక పరిష్కారం లేదు, ఇన్ని పరిష్కారాలున్నాయి. దానిలో వ్యవసాయరంగంలో అదనపు రేటు రావటానికి ఈ చట్టాలు కొంతమేర ఉపయోగపడతాయి. మిగతా ఏర్పాట్లు ఏం చేయాలో చెప్పాను. అంతేగానీ, వ్యవసాయరంగమే భారతదేశంలో ఆర్థిక సమస్యలకు పరిష్కారం కాజాలదు. రెండవది, రైతుల మీద, గ్రామీణ పేదల మీద ప్రధానంగా భారమేంటో ఒక్కసారి ఆలోచించండి. ఒకపక్క వ్యవసాయంలో రేట్లు రాకపోవటం, ఆదాయాలు హరించటం, చిన్న కమతాలు.. రెండోపక్క విద్య, ఆరోగ్యంలో ప్రభుత్వాల ఘోరవైఫల్యం. పిల్లల చదువుల కోసం నిరుపేదలు వేలకువేలు ప్రతి సంవత్సరం ఖర్చు చేస్తున్నారు. అది ప్రభుత్వం చెయ్యవలసిన పని. మీకు రైతుల మీద ప్రేమ ఉంటే, గ్రామీణ ప్రజల మీద మమకారం ఉంటే ఎందుకయ్యా విద్యను అంత దారుణంగా తయారుచేశారు? నిరుపేద

కుటుంబాలు, దళిత కుటుంబాలు శక్తికి మించి నెలకు వెయ్యి రూపాయల దాకా ఖర్చు పెట్టే పరిస్థితి ఎందుకైంది? అయినా కూడా చదువెందుకు రావటం లేదు? సిగ్గుందా అని నిలదీయండి. రోజూ నిలదీస్తున్నాను నేను. ఆరోగ్యం కోసం కొవిడ్ వచ్చిన సందర్భంలోనే కాదు, మీరు పత్రికల్లో ఎన్నిసార్లు చూశారు.. చిన్న అనారోగ్యం వస్తే డాక్టర్ దగ్గరికి వెళ్తే ఐదారు వందలు అవుతోంది. కొందరికి ఇది పెద్ద డబ్బు కాకపోవచ్చు. కానీ ఆ పేదవాడికి ప్రాణాంతకం. ఇక ఆస్పత్రికి చికిత్స అవసరమైతే తల ప్రాణం తోకకి వస్తుంది. నిరుపేదలకు కూడా ఈవేళ భార్య ప్రసవం కావాలంటే సిజేరియన్ లేకుంటే తక్కువలో తక్కువ రూ.40,000, సిజేరియన్ ఉంటే రూ.లక్ష అవుతోంది. ఎందుకైందిలా? ప్రభుత్వ వైఫల్యం వల్ల. ఇది ప్రభుత్వం చేతుల్లో ఉంది. దీన్ని గురించి గొంతెత్తండి. రోజూ గొంతెత్తుతున్నాను నేను. అదేం లేకుండా సందర్భంలేనివి తీసుకొచ్చి మాట్లాడటం తగదు. ఈ చట్టాలతో గ్రామీణ పేదల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని మెడ మీద తలకాయ ఉన్నవాడెవ్వడూ వాదించడు. దీనివల్ల మార్కెట్‌లో కొంతవరకు రేటు న్యాయంగా అందే ఏర్పాటు జరుగుతుంది. ఎంత జాగ్రత్తగా మాట్లాడుతున్నానో చూడండి.. మార్కెట్‌లో కొంతవరకు రేటు న్యాయంగా అందే ఏర్పాటు జరుగుతుంది, కొంతమేరకు సంకెళ్లు తెగుతాయి. ఇంకా చేయాల్సింది ఉంది. ఈ పరిష్కారం చాలదు. కానీ ఇది అవసరం.

**(?) కొత్త వ్యవసాయ చట్టాలపై రైతాంగానికి మీరు ఏం చెబుతారు**

ఒకళ్లకి బలవంతంగా అమ్మటం, ఎక్కడ నిలవ ఉంచాలో, నిలవ ఉంచకూడదో వాళ్లు చెప్పటం, అడుగడుగునా ప్రభుత్వంలో ఉన్నవాళ్లకి లంచాలివ్వటమూ, వాళ్లు చెప్పినప్పుడు అమ్మటం, చెప్పిన రేటుకే అమ్మటం.. దీని స్థానంలో మార్కెట్‌లో ఎక్కడ అవకాశముంటే అక్కడ అమ్ముకోవటం ఈ చట్టాలతో సాధ్యమవుతుంది. కొన్ని చోట్ల పంజాబ్, హర్యానాల్లో మండీలు చాలా బాగా నడుస్తున్నాయి. నేను స్వయంగా చూశాను. మండీ యాక్ట్ అని సర్ చౌతారాం అనే వ్యవసాయ మంత్రి ఎప్పుడో స్వతంత్రం వచ్చిన తొలికాలంలో ప్రతాప్‌సింగ్ కైరానా ముఖ్యమంత్రిగా ఉండగా చాలా ముందుచూపుతో తీసుకొచ్చారు. పంజాబ్, హర్యానాల్లా మార్కెట్ యార్డులు బాగా పనిచేస్తూ మంచి రేటు వచ్చిందనుకోండి, అక్కడే అమ్ముకుంటాం. కాదూ బయటి మార్కెట్‌లో హోల్‌సేల్ డీలర్, ప్రాసెసింగ్ వ్యక్తిగానీ, ఎగుమతి దారుగానీ మంచి రేటు ఇస్తామంటే అక్కడ అమ్ముకుంటారు. మీకు స్వేచ్ఛ పెరుగుతుంది. మార్కెట్ యార్డుల్లో అమ్మొద్దని ఎవరూ చెపటంలా. ఎక్కడ రేటు బాగుంటే అక్కడ అమ్ముకోండి. మార్కెట్ యార్డుని ఉపయోగించుకుంటే మార్కెస్ సెస్ కట్టండి. దాంతోపాటు మార్కెట్ రైతుల చేతుల్లోకి రావాలి. మీరు సెస్ ఇచ్చి మార్కెట్ యార్డుని పోషిస్తుంటే, అది మీకు ఉపయోగపడుతుంటే నిర్ణయాలు ఎమ్మెల్యే చేయటమేంటండీ? నిర్ణయాలు ముఖ్యమంత్రి, మంత్రి చేయటమేంటండీ? సంబంధమేంటి? అందులో రాజకీయం చొప్పించటమేంటి? మీరు ఎన్నుకున్న మనిషి అక్కడ నిర్వహణ చేయాలి. కాబట్టి ఈ చట్టాల వల్ల వచ్చేదేంటంటే, మీకు కొంతమేరకు ఈ సంకెళ్లు తొలగుతాయి. మిగతా రంగాలతోపాటు, పారిశ్రామిక, సేవా రంగాల్లాగా వ్యవసాయంలో ఉత్పత్తి చేసే రైతులకు కూడా ఆర్థిక స్వేచ్ఛ వస్తుంది. అంతమాత్రం చేత మన కడగండ్లు తొలగిపోవు. రైతుకి మార్కెట్‌లో అమ్మే ప్రతి పంటకీ కనీసం 65% అందే ఏర్పాటు జరగాలి. అంటే రిటైల్ చైన్స్ పెద్దఎత్తున రావాలి. పెద్దఎత్తున ప్రాసెసింగ్ రావాలి. లక్షల కోట్ల పెట్టుబడులు గ్రామీణ ప్రాంతాలకు రావాలి వ్యవసాయ, అనుబంధ రంగాల్లో. ఎగుమతుల రంగంలో మనకు స్థానం లభించాలి. దానికోసం గట్టిగా పోరాడాలి. దిగుమతుల మీద కొంతమేరకు నియంత్రణ పెట్టి దిగుమతుల సుంకాల డబ్బు రైతుల చేతికి వెళ్లాలి. ప్రభుత్వ ఖజానాలకి మళ్లటం కాదు. వంటనూనెలకు దిగుమతి సుంకం ఉంది. దాదాపు 40-50 వేల కోట్ల రూపాయల సుంకం వస్తోంది. ఆ డబ్బు నూనెపంటలు పండించే రైతులకు ఇస్తే మూడేళ్లలో భారతదేశాన్ని వారు స్వయంసంపన్నం చేస్తారు, రైతుల ఆదాయం పెరుగుతుంది, దిగుమతుల కోసం మనకు లేని డాలర్లు ఖర్చు పెట్టాల్సిన పన్లేదు. పప్పులు, వంటనూనెలు అతి ఎక్కువ దిగుమతి చేసుకునే దేశం భారత్. పప్పుల మీద కూడా అలానే దిగుమతి సుంకం వేసి రైతులకిస్తే మూడేళ్లలో పప్పులలో కూడా స్వయంసమృద్ధం సాధించి చూపుతారు. మనం ఇతర దేశాల మార్కెట్ల వల్ల నష్టపోవాల్సిన అవసరం ఉండదు. అదీ ప్రజల్ని ప్రేమించే రాజకీయం చేయాల్సిన పని. కాబట్టి, ఈ చట్టాల ద్వారా మొదలుపెట్టిన మార్పుల్ని మరింత విస్తృతం చేయాలి. మరోవైపు మన ఆదాయం హరించుకుపోకుండా, ప్రభుత్వం చేయాల్సిన పనులు సమర్థంగా చేయాలి. విద్య, ఆరోగ్యం కోసం లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నాం మనమంతా. గొంతు విప్పండి. మంచి ప్రమాణాల విద్య జేబులో రూపాయి ఖర్చుకాకుండా మా పిల్లలకు అందాలని గొంతు విప్పండి. మంచి ఆరోగ్యం మా పిల్లలకు అందాలి మాకు ఖర్చు లేకుండా అని గొంతు విప్పండి. మిగతా రంగాల్లో మా పిల్లలకు ఉపాధి అందాలి అని గొంతు విప్పండి. ఈ ప్రయత్నాలు చేసినట్లయితే వ్యవసాయం, గ్రామీణ భారతం బాగుపడతాయి. ఒకరోజు పరిష్కారం లేదు, సర్వరోగ నివారిణిలు కావు ఈ చట్టాలు, కొంతమేరకు సంకెళ్లు తొలగిస్తున్నాయి. గతంలో చేసిన పాపాన్ని కొంత కడిగే ప్రయత్నం చేస్తున్నాయి. వీటి వల్ల కొంతమేరకు రేట్లు మార్కెట్‌లో నిలబడతాయి. కారణం మీకు చెప్పాను.. గ్యారంటీ లేదు కానీ, ఇవాళ ఒక్కడికి అమ్మే బదులు 10 మందిలో ఎవరికైనా అమ్మొచ్చు. అంటే ఆదాయాలకు అవకాశం పెరుగుతుంది. అంచేత, దీన్ని ఆహ్వానిద్దాం, మరింత ఎక్కువ కోరదాం, తెలివిగా కోరదాం మన ప్రయోజనాల కోసం, మన పిల్లల ప్రయోజనాల కోసం. మనం రాజకీయ ఉచ్చులో చిక్కుకోవద్దు. మనకు కావలసింది మన బతుకులు, మన ఆదాయాలు. ఏ పార్టీ ఉన్నా మనకనవసరం, ఏ ప్రభుత్వమైనా మనకనవసరం. ఎలక్షన్లో ఓటేస్తాం. ఓటేశాక వాళ్ల పని వాళ్లను చేయమని చెబుదాం. మన ఉత్పత్తి, మన మార్కెట్ వేరే అంశాలు. 'మీరు చేయాల్సిన పనులు విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, పోలీస్ స్టేషన్లో న్యాయం జరగటం, సకాలంలో న్యాయం అందటం, మంచి మౌలిక సదుపాయాలు, వర్షం వస్తే వరదలు రాకుండా చేయటం. ఆ పనులు ఒళ్లు దగ్గర పెట్టుకుని చేయండి. మిగతావన్నీ మాకు వదిలేయండి' అని ప్రభుత్వాలకు చెప్పండి, గట్టిగా పట్టుబట్టండి. ✦

# టైటిల్ గ్యారంటీ, ఐదారేళ్లకోసారి భూసర్వే కూడా ఉండాలి: జేపీ





తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త రెవెన్యూ చట్టాన్ని (తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్‌బుక్స్ యాక్ట్-2020) సూత్రప్రాయంగా స్వాగతిస్తున్నట్లు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. దీంతోపాటు సమగ్ర భూసర్వే జరిపి టైటిల్ గ్యారంటీ ఏర్పాటు ఉండాలన్నారు. స్వతంత్రం వచ్చిన నాటి నుంచి ఇప్పటి దాకా తెలుగునాట సమగ్ర భూసర్వే జరగలేదని, స్వాతంత్ర్యానికి ముందు కూడా బ్రిటీష్ హయాంలో ఉన్న కోస్తాంధ్ర, రాయలసీమల్లో జరిగినట్లు పూర్తిస్థాయి సర్వే నిజాం హయాంలోని తెలంగాణలో జరగలేదన్నారు. నిజాం కాలంలో కూడా తెలంగాణలో ప్రభుత్వ భూములను సర్వే చేయకపోవటం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వివిధ కారణాల వల్ల దాదాపు 20 శాతం గ్రామాలకు అసలు మ్యాపులే లేవన్నారు. వీటన్నిటినీ సరిచేసేలా సమగ్ర భూసర్వే జరపాలన్నారు. పరిపాలనా సంస్కరణల సంఘంలో సభ్యునిగా దీనిపై సమగ్ర నివేదిక రూపొందించటమే కాకుండా, జాతీయ సలహా మండలి ద్వారా భూరికార్డుల ప్రక్షాళనకార్యక్రమానికి కొన్ని నిధులు కూడా కేటాయించేలా కృషి చేశానని, అయితే ప్రభుత్వాలు వీటిని వేగంగా ముందుకు తీసుకెళ్లలేదన్నారు. తెలుగునాట భూభారతి ప్రాజెక్టును కూడా మధ్యలో వదిలేశారన్నారు. ఇప్పటికైనా పక్కాగా, పారదర్శకంగా, కంక్లూజివ్ టైటిల్‌తో భూముల రికార్డులను అందుబాటులోకి తెచ్చి ప్రజలకు భరోసా కల్పించాలని, ఆర్థిక కార్యక్రమాలకు ఊపందించాలని అన్నారు. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో భూముల లావాదేవీలు కూడా గతంలో కంటే వేగంగా జరుగుతున్నాయన్నారు. పట్టణాల్లో ఉన్నా గ్రామాల్లో కూడా తమకు ఎంతోకొంత జాగా, చిన్నపాటి ఫామ్‌హౌస్‌లాంటివి ఉండాలని కోరుకుంటున్నవారి సంఖ్య సైతం పెరుగుతోందని, అందువల్ల 30 ఏళ్లకొకసారి కాకుండా 5,6 ఏళ్లకోసారి సమగ్ర సర్వే జరిపే ఏర్పాట్లు చేయాలన్నారు. రెవెన్యూ కోర్టుల్ని రద్దు చేసి ట్రైబ్యునళ్లు ఏర్పాటు చేయటం వంటి వాటి వల్ల పెద్దగా మార్పేమీ రాదన్నారు. రెవెన్యూ లావాదేవీల్లో సాంకేతికతను ప్రవేశపెట్టటం వల్ల అవినీతికి అవకాశాలు తగ్గుతాయని, కానీ పక్కా రికార్డులతో టైటిల్ గ్యారంటీ భూయజమానికి ఉండటం మాత్రమే సమస్యకు శాశ్వత పరిష్కారమన్నారు. ఇది పూర్తిగా ఆచరణసాధ్యమని, దీనివల్ల వ్యవసాయంలో కూడా వృత్తి నైపుణ్యాలు, మార్కెటింగ్ అవకాశాలు పెరిగి రైతులకు ఆదాయాలు గణనీయంగా పెరుగుతాయని జేపీ అన్నారు.

**తెలంగాణ కొత్త రెవెన్యూ చట్టంలోని కొన్ని ముఖ్యాంశాలు:**

● తహసీల్దార్ కార్యాలయంలోనే ఏకకాలంలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌లు జరుగుతాయి. తహసీల్దార్ సబ్‌రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తారు ● పట్టా పాసుపుస్తకానికి హక్కు పత్రం అధికారం ● ఇప్పటివరకూ అమలులో ఉన్న భూ యాజమాన్య హక్కుల కల్పన చట్టం-1971 రద్దు ● కొత్తచట్టంతో పూర్తిస్థాయిలో ఎలక్ట్రానిక్ పద్ధతిలో భూదస్త్రాల నిర్వహణ ● ధరణి పోర్టల్‌గా ప్రభుత్వం రూపొందించిన ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఇకపై మరింత కీలకం కానుంది ● పట్టా పాసుపుస్తకం, పహాణీ నకలు తీసుకోకుండానే ఎలక్ట్రానిక్ దస్త్రాల పరిశీలన ఆధారంగానే బ్యాంకులు, ఇతర సంస్థలు వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలి. రుణం పొందిన, తిరిగి చెల్లించిన వారి వివరాలను ఆ సంస్థలు ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయాలి ● భూ యజమాని నుంచి వారసులు భూమిపై హక్కులు పొందాలంటే ఉమ్మడిగా ఒప్పందం తప్పనిసరి ● ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఫైళ్లను దిద్దినట్లు, మార్చినట్లు (టాంపర్) గుర్తిస్తే చట్టప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటారు ● డిజిటల్ దస్త్రాల ఆధారంగా ప్రభుత్వ అధికారి లేదా ప్రభుత్వం సవరణలు చేస్తే ఆ అధికారి లేదా ప్రభుత్వంపై ఎటువంటి దావాలు కుదరవు ● కొత్త చట్టం కింద రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ భూములకు మినహాయింపు ఉంటుంది. పాయిగా, జాగీరు, సంస్థానాలు, మక్తా, గ్రామ అగ్రహారం, ఉమ్లీ, ముకాసా సహా అన్ని రకాల భూముల యాజమాన్యం ఈ చట్టం కింద బదిలీ కుదరదు. వాటి విక్రయం, వారసత్వం చెల్లదు. ఈ భూవివాదాలకు సంబంధించి ఏపీ (తెలంగాణ ప్రాంత) అతియాత్ విచారణ చట్టం 1952 కింద అతియాత్ కోర్టు ఉత్తర్వులే అంతిమం.


'ది తెలంగాణ అబాలిషన్ ఆఫ్ ది పోస్ట్స్ ఆఫ్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ చట్టం-2020' ద్వారా వీఆర్‌వో వ్యవస్థను కూడా ఇదే సమయంలో ప్రభుత్వం రద్దు చేసింది. అలాగే వ్యవసాయేతర భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ అయిన వెంటనే రికార్డుల్లో మ్యుటేషన్ చేసి ధ్రువపత్రం ఇచ్చేలా జీహెచ్‌ఎంసీ చట్టం-1955, పురపాలక చట్టం-2019, పంచాయతీ రాజ్ చట్టం- 2018లలో కూడా సవరణలు చేశారు.






# మార్పు అవసరాన్ని, అవకాశాన్ని కోవిడ్ కల్పించింది

'కోవిడ్ ప్రభావానికి నష్టపోయిన ఆర్థిక వ్యవస్థలో ఆరోగ్యకరమైన, పటిష్ఠమైన, సమానావకాశాలున్న భారత్‌ను నిర్మించటంలో ఎంబీయే గ్రాడ్యుయేట్‌ల పాత్ర'పై ఐఐఎం బెంగళూరు పబ్లిక్ పాలసీ క్లబ్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ మాట్లాడారు. మార్పు అవసరాన్ని, అవకాశాన్ని ప్రస్తుత సంక్షోభం కల్పించిందని.. ఇందులో ప్రభుత్వంతోపాటు మేనేజర్లు కీలక పాత్ర పోషించాల్సిన అవసరముందని జేపీ అన్నారు.



RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2018-2020 Published on 10th October, 2020 Posting Date 15 &16th of every month




# BOOK POST

## PRINT MATTER

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020